10 . 01. 2026

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

శనివారం | రంగారెడ్డి, నల్లగొండ

సంపుటి :07 సంచిక : 217 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper



## సైబర్ నేరగాళ్ల బాధితులకు అండ

### సైబర్ మిత్ర పేరుతో ప్రత్యేక విభాగం ఏర్పాటు

### బాధితులు 1930కు ఫోన్ చేయాలన్న కమిషనర్ సజ్జన్నార్

**హైదరాబాద్,జనవరి9 వెలుతురు:**
సైబర్ నేరాల బాధితులకు హైదరాబాద్ పోలీసులు ఎల్లప్పుడు అండగా ఉంటారని నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. శుక్రవారం నాడు హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ సీసీఎస్ కార్యాలయంలో సైబర్ మిత్ర



## వివాదాలు కాదు.. పరిష్కారాలు ముఖ్యం..

- ఉమ్మడి రాష్ట్రంలోప్రాజెక్టులకు అడ్డంపడకండి
- జలవివాదాలతో రాజకీయ ప్రయోజనం కోరుకోం
- మన సమస్యలను మనమే కలిసి పరిష్కరించుకుందాం
- ఏపి సిఎం చంద్రబాబుకు తెలంగాణ సిఎం రేవంత్ సూచన
- కృష్ణా జలాలపై ఏపీతో చర్చలకే ప్రాధాన్యం
- రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో సుజెన్ మెడికేర్ ప్రారంభోత్సవం



**హైదరాబాద్,జనవరి9 వెలుతురు:**
రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాలు ఉండకూడదనే కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా నీళ్ల సమస్యను పరిష్కరించు కోవాలని చెప్పారు. కోర్టుల్లో కాకుండా.. మన సమస్యలను మనమే పరిష్కరించుకుందామని విజ్ఞప్తి చేశారు. లో సీఎం రేవంత్ మాట్లాడుతూ నీళ్ల సమస్యపై స్పందించారు. జల వివాదం విషయంలో రాజకీయ ప్రయోజనం పొందాలని తమ ప్రభుత్వం ప్రయత్నించడం లేదని స్పష్టం చేశారు. పంచాయితీ కావాలా.. నీళ్లు కావాలా.. అని నన్ను అడిగితే తెలంగాణకు నీళ్లే కావాలని చెబుతా. వివాదాలు కావాలా.. పరిష్కారం కావాలా.. అని అడిగితే పరిష్కారం కావాలని చెబుతా. మన సమస్యలను మనమే సామరస్యంగా పరిష్కరించుకుందాం. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ వేదికగా ఓ విజ్ఞప్తి చేస్తున్నా. కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులకు అడ్డంకులు పెట్టకండి. ఇలా అడ్డంకులతో కేంద్ర ప్రభుత్వం నిధులు రావడం లేదన్నారు. రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోంది. మేం వివాదాలు కోరుకోవడం లేదు. పరిష్కారం కోరుకుంటున్నాం అని అన్నారు. రాజకీయ ప్రయోజనాలు కాదు.. ప్రజల ప్రయోజనాలు

### గ్లోబల్ డెస్టినేషన్‌గా తెలంగాణ

- 2047 లక్ష్యంగా 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ
- క్యూర్-ప్యూర్-రేర్‌తో డెవలప్‌మెంట్ మోడల్
- గ్లోబల్ ఫ్యూచర్ సిటీగా హైదరాబాద్
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





## కరీంనగర్ కు "ఆయుష్' మంజూరు

- పాలనాపరమైన అనుమతులు మంజూరు చేసిన కేంద్రం
- ఫలించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కృషి
- రూ.15 కోట్లతో 50 పడకల ఆసుపత్రికి కేంద్రం ఆమోదం
- రూ.7.5 కోట్ల నిధులు విడుదల
- ఆయుష్ సేవల్లో ఉత్తర తెలంగాణకు కీలకం కానున్న కరీంనగర్

**కరీంనగర్ వెలుతురు జనవరి 09:**
ఉత్తర తెలంగాణ ప్రజలకు....ముఖ్యంగా కరీంనగర్ జిల్లా ప్రజలకు శుభవార్త. ఈ ప్రాంతానికి ఆయుష్ (ఆయుర్వేదం, యోగా నేచురోపతి, యునాని, సిద్ధ, హోమియోపతి) ఆసుపత్రి రాబోతోంది. కరీంనగర్ లో 50 పడకల 'ఆయుష్ష ఆసుపత్రి ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. అల్లోపతి మందులతో సైడ్ ఎఫెక్ట్స్ ఉండే అవకాశాలుండటంతో..... ఈ ప్రాంత ప్రజలు గత కొంత కాలంగా ఆయుర్వేదం, హోమియోపతి

## ప్రజా సమస్యల పరిష్కారమే మా ధ్యేయం

- మున్సిపాలిటీల అభివృద్ధికి సర్కార్ కట్టుబడి ఉంది
- రూ. 3.17 కోట్ల పనుల శంకుస్థాపనలో మంత్రి పొంగులేటి వ్యాఖ్యలు



**ఇల్లెందు వెలుతురు జనవరి 09:**
ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఇల్లెందు మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో రూ. 3.17 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఇల్లెందు మున్సిపాలిటీకి మహర్దశ పడుతుందని, పట్టణాల సర్వతోముఖాభివృద్ధికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని" పేర్కొన్నారు. ప్రధానంగా పట్టణంలోని 1, 4, 7,

## రచ్చకెక్కిన బెంగాల్ రాజకీయం

- ఇడి చర్యలపై మమతా నిరసన ప్రదర్శన
- మమతా బెనర్జీ తీరుపై మండిపడ్డ బిజెపి
- విచారణకు అడ్డుపడడంపై సుప్రీంలో ఇడి పిటిషన్

**కోల్‌కతా,జనవరి9 వెలుతురు:**
ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ , దాని సహ వ్యవస్థాపకుడు ప్రతీక్ జైన్‌పై ఈడీ దాడుల వ్యవహారం రచ్చకెక్కింది. దీనిపై శుక్రవారం నాడు కేంద్రం, పశ్చిమబెంగాల్ ప్రభుత్వం మధ్య ఘర్షణ మరింత తీవ్రమైంది. అవినీతిలో కూరుకుపోయారంటూ తనపై బీజేపీ చేస్తున్న ఆరోపణలు, ఈడీ చర్యలపై ముఖ్యమంత్రి మమతాబెనర్జీ.. కోల్‌కతా రోడ్లపైకి వచ్చి భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. మరోవైపు ఈడీ సైతం కోల్‌కతా హైకోర్టు విచారణపై సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ప్యాక్‌పై ఈడీ దాడులకు సంబంధించి దాఖలైన పలు పిటిషన్లపై కోల్‌కతా హైకోర్టు జస్టిస్ సువ్ర ఘోష్ విచారణ చేపట్టినప్పటికీ



భారీగా జనం హాజరుకావడంతో ఆయన కోర్టు రూమ్‌ను విడిచిపెట్టి వెళ్లిపోయారు. గత వారంరోజులుగా కోర్టుకు సెలవులు ఉండగా.. ఈ అంశంపై వచ్చే

## ఉర్దూ వర్సిటీ భూముల జోలికి రావద్దు

- కాంగ్రెస్ ప్రభుత్వానికి కెటిఆర్ హెచ్చరిక



**హైదరాబాద్,జనవరి9( వెలుతురు):**
మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ భూములపై రేవంత్ సర్కార్ కుట్రల నేపథ్యంలో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. దేశంలో మైనార్టీల సంరక్షకుడినని చెప్పుకునే రాహుల్ గాంధీ.. ఉర్దూ యూనివర్సిటీ

## కరోనా సమయంలో కష్టపడి అన్నం పెట్టారు

- 'మీ భూమి - మీ హక్కు' అని ఎన్నికల ప్రచారంలో చెప్పా
- రాయవరంలో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ
- గతంలో జగన్ బొమ్మలు ముద్రించడంపై ఆగ్రహం
- రాజముద్రతో పాస్ పుస్తకాలు ఇస్తున్నట్లు చంద్రబాబు వెల్లడి




## పిఠాపురంలో గొడవలు చేస్తామంటే ఏరిపారేస్తా

- అవాస్తవాలు వైరల్ చేస్తే.. చూస్తూ ఊరుకోను
- శాంతిభద్రతల విషయంలో పోలీసులు కఠినంగా ఉండాలి
- పట్టణ పారిశుద్ధ్యంపై మున్సిపల్ సిబ్బంది శ్రద్ధ పెట్టాలి
- పీఠాపురం సంక్రాంతి మహోత్సవాలు ప్రారంభించిన పవన్ కళ్యాణ్
- సంక్రాంతి అందరి పండగగా జరుపుకోవాలని పిలుపు



**కాకినాడ,జనవరి9 వెలుతురు :**
పపిఠాపురంలో ఏ చిన్న సంఘటన జరిగినా వైరల్ చేస్తున్నారని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. పిఠాపురంలో కొబ్బరాకు, తాటాకు పడినా ఏదో జరిగిందని ప్రచారం చేస్తున్నారని అసహనం వ్యక్తంచేశారు. అవాస్తవాలను వైరల్ చేయడం మానుకోవాలని హితవు పలికారు. పిఠాపురంలో నిర్వహించిన 'పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాలు' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పులివెందులలో



## ఎన్.సి.ఎల్.టి. సీనియర్ కౌన్సెల్‌గా హరీష్ రెడ్డికి పదోన్నతి

**హైదరాబాద్, వెలుతురు జనవరి 9:**
మన్సూరాబాద్ కు చెందిన సీనియర్ న్యాయవాది కె. హరీష్ రెడ్డి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ లో సీనియర్ కౌన్సెల్ గా పదోన్నతి పొందారు. గత ఆరు సంవత్సరాలుగా ఎన్.సి.ఎల్.టి. కౌన్సెల్ గా సేవలు అందిస్తున్న హరీష్ ను సీనియర్ స్టాండింగ్ కౌన్సెల్ గా నియమిస్తూ కేంద్ర న్యాయవ్యవహారాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ నుంచి కంపెనీ లా ట్రిబ్యునల్ కు సంబంధించిన కేసులలో కేంద్ర ప్రభుత్వం తరఫున ఆయన వాదనలు వినిపిస్తారు. ఈ ట్రిబ్యునల్ లో ఆయనతో పాటు మరో నలుగురు న్యాయవాదులు సభ్యులుగా ఉంటారు. తనకు గుర్తింపునిచ్చి పదోన్నతి కల్పించిన కేంద్రంలోని నరేంద్ర మోడి ప్రభుత్వానికి హరీష్ ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థి దశ నుంచే జాతీయవాద ఉద్యమాల్లో పాల్గొని, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎబివిపి) పూర్తిసమయ కార్యకర్తగా విజయవాడ కేంద్రంగా మూడేళ్లపాటు సేవలు అందించారు. ప్రస్తుతం ఆయన న్యాయవాద పరిషత్ నగర కార్యదర్శిగా ఉన్నారు. మూడు దశాబ్దాలకు పైగా ప్రధానంగా రంగారెడ్డి జిల్లా కోర్టులలో న్యాయవాదిగా సేవలు అందిస్తున్న హరీష్ రెడ్డి పలు సామాజిక కార్యక్రమాలలో పాల్గొంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన పదోన్నతి పొందిన సందర్భంగా రంగారెడ్డి జిల్లా కోర్టుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, కార్యదర్శి కార్తిక్, భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి, నాగోల్ కార్పొరేటర్ సురేందర్ యాదవ్, రామకృష్ణాపురం కార్పొరేటర్ రాధా ధీరజ్ రెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు

## సంస్కృతి,సంప్రదాయాలను కాపాడుకోవాలి

### పండగల విశిష్టతను బాగా చాటాలి

### సంక్రాంతి అంటే నాకు ఎంతో ఇష్టం

### ఇందిర పుణ్యమా అని రాజకీయాల్లోకి వచ్చా

### విశాఖ సంక్రాంతి సంబరాల్లో వెంకయ్యానాయుడు



వెలుతురు

## సైబర్ నేరగాళ్ల బాధితులకు అండ

పేరుతో రూపొందించిన ప్రత్యేక విభాగాన్ని సజ్జనార్ ప్రారంభించారు. అనంతరం సీపీ సజ్జనార్ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లకు చిక్కిన బాధితులకు ఈ సెల్ ఎంతో సహాయంగా ఉంటుందన్నారు. దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్‌లో సైబర్ క్రైమ్‌పై హెల్ప్ డెస్క్ ఏర్పాటైందని వివరించారు. సైబర్ క్రైమ్‌ల్లో బాధితుల సంఖ్య పెరుగుతోందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్ క్రైమ్‌కు గురైన వెంటనే 1930కి ఫోన్ చేయాలని బాధితులకు సూచించారు. సైబర్ దాడికి గురైతే మ్యూల్ ఖాతాలకు నగదు బదిలీ అయి.. విత్ డ్రా చేస్తారన్నారు. ఈ నేపథ్యంలో సైబర్ క్రైమ్‌కు గురైన వెంటనే గో÷-డలెన్ అవర్‌ను వినియోగించుకోవాలంటూ బాధితులకు ఆయన కీలక సూచన చేశారు. నేరం జరిగిన గంట లోపు ఫిర్యాదు చేస్తే నగదు ఫ్రీజ్ అవుతుందన్నారు. సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930కి ఫోన్ చేసి.. ఫిర్యాదు చేస్తే సరిపోదన్నారు. అనంతరం స్థానిక పోలీసులకు సైతం ఫిర్యాదు చేయాల్సి ఉందని చెప్పారు. కానీ చాలా మందికి ఎక్కడ ఫిర్యాదు చేయాలో తెలియడం లేదన్నారు. నూతన విధానం ద్వారా బాధితులు తమ ఫిర్యాదును పోస్ట్ ద్వారా లేదా పోలీస్ స్టేషన్లలో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్ ద్వారా పంపవచ్చన్నారు. సైబర్ మిత్ర సెల్‌లోని పోలీసులు.. బాధితులకు ఫోన్ చేసి ఫిర్యాదు ఎలా రాయాలి? ఏయే సెక్షన్లు వర్తిస్తాయనే విషయాలపై అవగాహన కల్పిస్తారు. ఇంటి నుంచే ఎఫ్ఐఆర్ పొందే సౌకర్యాన్ని కల్పించడం ద్వారా 100 శాతం కేసుల నమోదును లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ట్రయిల్‌లో భాగంగా 86 మందికి ఫోన్ చేశామని.. వారి నుంచి మంచి స్పందన వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ సైబర్ నేరానికి గురికాకుండా జాగ్రత్తగా ఉండాలంటూ ప్రజలకు స్పష్టం చేశారు. సైబర్ నేరాలపై తరచూ ప్రజలకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారంటూ హైదరాబాద్ పోలీసులను నగర సీపీ సజ్జనార్ ప్రశంసించారు.

## సంస్కృతి,సంప్రదాయాలను కాపాడుకోవాలి

**విశాఖపట్నం,జనవరి9 వెలుతురు:**

భారతీయ సంస్కృతిని కాపాడుకోవాలని.. భారతీయ వంటలు అందరూ తినాలని దేశ ప్రజలకు మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు పిలుపునిచ్చారు. మన పండగల విశిష్టతను చాటాలన్నారు. సంక్రాంతి పండగ అంటే తనకు చాలా ఇష్టమన్నారు. విశాఖపట్నంపై తనకు ఎంతో ప్రేమ ఉందని చెప్పారు. శుక్రవారం విశాఖపట్నంలో జరిగిన సంక్రాంతి ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్యానాయుడు మాట్లాడుతూ.. తాను ఆంధ్రా యూనివర్సిటీ పూర్వ విద్యార్థినని గుర్తు చేసుకున్నారు. ఇక్కడ జరుగుతున్న సంక్రాంతి సంబరాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని చెప్పారు. తెలుగు రైతుల పండగ సంక్రాంతి.. తెలుగు వారి లోగిళ్లలో ఇది పెద్ద పండగని వెంకయ్యానాయుడు అభివర్ణించారు. ఫల సాయాన్ని అందించే వ్యవసాయాన్ని ఎప్పుడూ మర్చిపోకూడని ప్రజలకు ఆయన హితవు పలికారు. అలాగే జన్మనిచ్చిన తల్లిదండ్రులను, విద్య నేర్పిన గురువులను, మాతృభాషను మర్చిపోకూడదని చెప్పారు. ప్రజలకు అర్థమయ్యే భాషలో పరిపాలన చేయాలంటూ ప్రభుత్వాలకు ఆయన సూచించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను పిల్లలకు నేర్పించాలంటూ ఈ సందర్భంగా తల్లిదండ్రులకు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు కీలక సూచన చేశారు.విద్యార్థి దశలో ఎన్నో పోరాటాలు చేశానని.. జైలుకు సైతం వెళ్లానని చెప్పారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఆమె కారణంగానే తాను రాజకీయాల్లోకి వచ్చానని వివరించారు. స్వతంత్ర భారతదేశంలో ఆత్మ నిర్భర భారత్ కోసం అందరూ కృషి చేయాలని వెంకయ్యానాయుడు ఆకాంక్షించారు. ప్రపంచంలో నాలుగో వంతు జీడీపీ భారతదేశానిదేనని పేర్కొన్నారు. పశు సంపద ఎంత బాగుంటే జాతీయ సంపద కూడా అంత బాగుంటుందన్నారు. ఆత్మ నిర్భర భారత్ ముందు.. ఎవరు ఎన్ని సుంకాలు వేసినా ప్రభావం ఉండదని స్పష్టం చేశారు. అందుకే ఆత్మ నిర్భర భారత్ అని ప్రధాని నరేంద్ర మోదీ అంటున్నారని వివరించారు. తాను రైతు బిడ్డగా పుట్టానని.. అందుకే రైతులు అంటే తనకు చాలా అభిమానమన్నారు.

## రచ్చకెక్కిన బెంగాల్ రాజకీయం

బుధవారం నాడు తిరిగి విచారణ చేపట్టనున్నారు. కోల్‌కతా హైకోర్టులో కేసు విచారణ వాయిదా పడటంతో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్‌ను ఈడీ శుక్రవారం నాడు ఆశ్రయించింది. తక్షణ విచారణ కోసం ధర్మాసనం ఏర్పాటు చేయాలని కోరింది. కాగా, హైకోర్టులో శుక్రవారం విచారణ సందర్భంగా ఈడీ తమ వాదన వినిపిస్తూ, ఐప్యాక్ కార్యాలయం, జైన్ నివాసంలో తాము సోదాలు నిర్వహిస్తుండగా అధికారులతో అడ్డగించడం ద్వారా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించింది. దీనిపై జైన్, తృణమూల్ కాంగ్రెస్ కౌంటర్ పిటిషన్ దాఖలు చేసింది. తృణమూల్ కాంగ్రెస్ ఎన్నికల వ్యూహానికి సంబంధించిన డాక్యుమెంట్లను సీజ్ చేయాలని ఈడీ ప్రయత్నించిందని ఆ పిటిషన్‌లో ఆరోపించారు. ఒకవైపు కోర్టు విచారణ జరుగుతుండగా మరోవైపు ఈడీ దాడులకు నిరసనగా ముఖ్యమంత్రి మమతాబెనర్జీ జాదవ్‌పూర్ నుంచి హజ్రా క్రాసింగ్ వరకూ 5 కిలోమీటర్ల మేరకు పాదయాత్ర నిర్వహించారు. పెద్దఎత్తున కార్యకర్తలు, పార్టీ నేతలు ఇందులో పాల్గొన్నారు. ఏం చేసైనా సరే పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో గెలవాలని బీజేపీ ప్రయత్నాలు చేస్తోందని మమతా బెనర్జీ, తృణమూల్ నేతలు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అయితే ఈ ఆరోపణలను బీజేపీ తోసిపుచ్చింది. టీఎంసీ చీఫ్ అవినీతి ఊబిలో కూరుకుపోయారని, ఈడీ అధికారులను బెదిరిస్తున్నారని బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ ఆరోపించారు. మమతా చర్యల వెనుక అనేక అనుమానాలు ఉన్నాయని.. తనను, తమ పార్టీని చిక్కుల్లోకి నెట్టే కీలకమైన సమాచారాన్ని తొలగించేందుకు ఆమె ప్రయత్నిస్తున్నారని రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే మా ధ్యేయం

8, 9, 18, 22, 24 వార్డులలో నెలకొన్న సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ఇల్లెందును అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పొంగులేటి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మడుగు సాంబమూర్తి, మండల రాము, బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, జిల్లా అధికారులు, స్థానిక అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఉర్దూ వర్సిటీ భూముల జోలికి రావద్దు

భూములను అన్యాక్రాంతం చేయడమే కాపాడటమా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని నందినగర్ నివాసంలో కేటీఆర్‌తో మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ విద్యార్థులు సమావేశమయ్యారు. యూనివర్సిటీకి చెందిన 50 ఎకరాల భూమిపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలపై చర్చించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి వచ్చి చదువుకుంటున్న మైనార్టీ విద్యార్థుల యూనివర్సిటీని నిర్వీర్యం చేయడమే మీ సంరక్షణనా అని ప్రశ్నించారు. దీనిపై సమాధానం చెప్పాలని రాహుల్ గాంధీని డిమాండ్ చేశారు. మీరు చెబుతున్న మొహబ్బత్ కి దుకాణం ఇదేనా అని ప్రశ్నించారు. విద్యార్థులను వారి భూములను తీసుకొని రోడ్డుమీద వేయడమేనా? అని నిలదీశారు. సెంట్రల్ యూనివర్సిటీలో ఉన్న సమస్యలపై రాహుల్ గాంధీ మాట్లాడాలి కానీ వారి భూములు గుంజుకుంటున్న తమ ప్రభుత్వంపై స్పందించకపోవడం దారుణమని కేటీఆర్ విమర్శించారు. యూనివర్సిటీలో ఉన్న భూములు ఖాళీగా ఉన్నవి కావు భవిష్యత్తు విస్తరణ కోసం ఇప్పటికే ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. సెంట్రల్ యూనివర్సిటీ ప్రతిష్టను తగ్గించేలా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని మండిపడ్డారు. గతంలో ఇదే యూనివర్సిటీ ప్రజా అవసరాల కోసం హైదరాబాద్ నగరం కోసం 32 ఎకరాలు ఔటర్ రింగ్ రోడ్డు కోసం ఇచ్చారని, ఖాజాగూడ నుంచి నానక్ రామ్ గూడ కు లింక్ రోడ్డు కోసం ఏడెకరాల స్థలాన్ని యునివర్సిటీ భూమి ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఏనాడు కూడా హైదరాబాద్ నగర ప్రయోజనాల కోసం ప్రజాప్రయోజనాల కోసం అవసరమైనప్పుడు భూసేకరణను ఏనాడు వ్యతిరేకించలేదని చెప్పారు. గతంలో తెలంగాణలో జరిగిన ఉద్యమం వల్లనే హైదరాబాద్‌లో సెంట్రల్ యూనివర్సిటీ, ఉర్దూ యూనివర్సిటీ ఏర్పడిందని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ ఉద్యమాలు త్యాగాల ఆధారంగా ఏర్పడిన యూనివర్సిటీని రియల్ ఎస్టేట్ కోసం వాడటం దారుణమని మండిపడ్డారు. గతంలో మేము నిజాం కాలేజీలో హాస్టల్ లేదు అంటే ప్రభుత్వ నిధులతో హాస్టల్ కట్టించామని గుర్తుచేశారు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యూనివర్సిటీకి అండగా ఉంటామని స్పష్టం చేశారు. కావలసిన విస్తరణ సౌకర్యాలకు నిధులు కూడా కేటాయించి అండగా నిలబడతామని భరోసానిచ్చారు.

# వివాదాలు కాదు.. పరిష్కారాలు ముఖ్యం

కోసం ఆలోచిస్తున్నాం. తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ రావాలంటే పక్క రాష్ట్రం సహకారం ఉండాలి. రెండు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకుంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయి. ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు.. ఏ రాష్ట్రమైనా సరే మేం వివాదాలు కోరుకోవడం లేదు. ఈ విషయంలో ఏపీ సర్కారు ఒక్క అడుగు ముందుకు వేస్తే.. తెలంగాణ 10 అడుగులు ముందుకు వేస్తుందని సీఎం హామీ ఇచ్చారు. ఈ మేరకు కృష్ణా నది జల వివాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. నీళ్ల వివాదం ముసుగులో రాజకీయ లబ్ది పొందాలన్న ఆలోచన కాంగ్రెస్ పార్టీకి లేదని, రాజకీయాలకు అతీతంగా సమస్యల పరిష్కారం కోసం అందరూ సహకరించాలని పార్టీలను విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. మన సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుందామని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఈ వేదికగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి విజ్ఞప్తి చేస్తూ.. కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులకు అడ్డంకులు పెట్టవద్దని కోరారు. అడ్డంకుల వల్ల కేంద్ర ప్రభుత్వ నిధులు రావడం లేదని, రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము వివాదం కోరుకోవడం లేదని.. పరిష్కారమే కోరుకుంటున్నామని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాలు కాదని.. ప్రజలు, రైతుల ప్రయోజనాల కోసమే ఆలోచిస్తున్నామని రేవంత్ రెడ్డి స్పష్టీకరించారు. తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ రావాలంటే పక్క రాష్ట్రం సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాశ్ గౌడ్, మల్ రెడ్డి రంగారెడ్డి, కాలె యాదయ్య, తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్ నగరం నేడు ప్రపంచ స్థాయి నగరాలతో పోటీ పడుతోందంటే అది గత మూడు దశాబ్దాల నిరంతర శ్రమ ఫలితమేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. జర్మన్ టెక్నాలజీతో దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద ఐవీ ఫ్లూయిడ్స్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేసిన సుజెన్ మెడికేర్ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌లో భాగంగా ఇటువంటి తయారీ యూనిట్లు రావడం రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం క్యూర్ , ప్యూర్ , రేర్ అనే మూడు విభాగాలుగా అభివృద్ధి ప్రణాళికను రూపొందించినట్లు సీఎం తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ ద్వారా ఇప్పటికే తెలంగాణ పాలసీ డాక్యుమెంట్‌ను విడుదల చేశామని, 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దడమే తమ అంతిమ లక్ష్యమని ఆయన ప్రకటించారు. ప్రస్తుతం దేశంలో ఉత్పత్తి అవుతున్న బల్క్ డ్రగ్స్‌లో 40 శాతం వాటా తెలంగాణదేనని, ఫార్మా రంగంలో ప్రపంచమే మన వైపు చూసేలా ఎదుగుతున్నామని గర్వంగా చెప్పారు. ప్రపంచ నగరాలతో హైదరాబాద్ పోటీ పడుతోంది. సుజెన్ మెడికేర్ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తోంది. పెట్టుబడులకు లాభం వచ్చేలా ప్రభుత్వ ప్రణాళికలు ఉన్నాయి. ప్రపంచ స్థాయి దేశాలతో తెలంగాణ పోటీపడేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. పెట్టుబడులకు అనుకూల మైన వాతావరణం మన రాష్ట్రంలో ఉంది. పెద్ద కంపెనీలకు సీఈవోలుగా ఉన్నది మన దేశం వాళ్లే అని సీఎం అన్నారు.

రాజకీయ వివాదాల కంటే సమస్యల పరిష్కారానికే తాము ప్రాధాన్యత ఇస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులకు అడ్డంకులు సృష్టించవద్దని, అడ్డంకుల వల్ల కేంద్ర నిధులు రాక రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ రావాలన్నా, నీటి సమస్యలు తీరాలన్నా ఏపీతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర వంటి పొరుగు రాష్ట్రాల సహకారం అవసరమని, అందుకే తాము వివాదాల కంటే సామరస్యపూర్వక చర్చలకే మొగ్గు చూపుతామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా ప్రజల , రైతుల ప్రయోజనాల కోసమే తమ ప్రభుత్వం ఆలోచిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం ద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా ప్రైవేట్ రంగ పెట్టుబడులను ఆహ్వానిస్తున్నట్లు సీఎం తెలిపారు. రాబోయే పదేళ్లలో హైదరాబాద్‌లోని 'ఫ్యూచర్ సిటీ'లో నివసిస్తున్నామని ప్రతి ఒక్కరూ గర్వంగా చెప్పుకునేలా నగరాన్ని అభివృద్ధి చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జర్మనీ, జపాన్, సౌత్ కొరియా వంటి దేశాలతో పోటీ పడుతూ తెలంగాణను గ్లోబల్ డెస్టినేషన్‌గా మార్చడమే తమ సంకల్పమని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.

## పిఠాపురంలో గొడవలు చేస్తామంటే ఏరిపారేస్తా

సొంత బాబాయ్‌ని చంపినా అది వార్త కాదు.. పిఠాపురంలో స్కూల్ పిల్లలు కొట్టుకున్నా అది పెద్ద వార్త అవుతుంది. పిఠాపురం వచ్చి గొడవలు చేద్దామనుకుంటే ఇక్కడ కూర్చొని ఏరివేస్తాను. గత ప్రభుత్వంలో బూతులు తిట్టడం, కేసులు పెట్టడం చేశారు. పిఠాపురంలో మళ్లీ అలాంటివి తెచ్చే ప్రయత్నం జరుగుతోంది. శాంతి భద్రతల విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరించాలి. నా మాటలు మెత్తగా.. చేతలు గట్టిగా ఉంటాయి. నన్ను అన్నా.. పార్టీని అన్నా భరిస్తా. ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించే వారిని మాత్రం క్షమించనని ఘాటుగా హెచ్చరించారు. అంతకుముందు పలు స్టాళ్లను మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్‌తో కలిసి ఆయన సందర్శించారు. పిఠాపురం సంక్రాంతి ఉత్సవాలకు చిరునామా కావాలన్నారు ఈ పండుగ అన్ని మతాలు జరుపుకొనే స్థాయికి ఎదగాలి. తెలంగాణకు ఆంధ్రా ప్రాంత ప్రజల ప్రేమను తీసుకెళ్లాలి. అక్కడి సోదరీమణులను సంక్రాంతికి ఆహ్వానించి.. వారికి గోదావరి జిల్లాల ఆతిథ్యాన్ని రుచి చూపాలి. సంక్రాంతి అంటే కోడిపందేలు, జూదాలు మాత్రమే కాదు. ఈ సరదాలను నేను కాదనడం లేదు.. చేసేవాళ్లు చేసుకోండి. కానీ వాటికే పరిమితం కాకూడదన్నారు. పిఠాపురం.. దేశానికి చాలా కీలకమైన శక్తిపీఠం. శ్రీపాద శ్రీవల్లభుడు వెలసిన నేల ఇది. ఇక్కడి నుంచి నేను పోటీ చేయడం భగవంతుడి సంకల్పం. పిఠాపురం అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నాం. నన్ను బలోపేతం చేస్తే మరింతగా పనిచేస్తా. అధికారం ఉన్నా లేకపోయినా ఆఖరిశ్వాస వరకు ఇక్కడి ప్రజల కోసం పనిచేస్తాను. సీఎం చంద్రబాబు అనుభవం రాష్ట్రానికి చాలా అవసరం. కూటమి నేతలు పొత్తులను బలహీనం చేసే ప్రయత్నం చేయొద్దు. ప్రజలను ఎలా కాపాడాలి అనే అంశంపై నాకు, చంద్రబాబుకు పూర్తి అవగాహన ఉందని పవన్ అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. తన సొంత నియోజకవర్గం కాకినాడ జిల్లా పిఠాపురంలో పర్యటిస్తున్నారు.. అయితే, స్థానిక అధికారుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు పవన్.. పిఠాపురం మున్సిపల్ కమిషనర్‌తో పాటు డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, పిఠాపురం కమిషనర్ వ్యవహారశైలిని ఆయన తప్పుబట్టారు. కాలనీల్లో పేరుకుపోయిన చెత్త, అపరిశుభ్ర పరిస్థితులను చూసి పవన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలనీలు ఇంత చెత్తగా ఉంటే అక్కడి ప్రజల జీవన ప్రమాణాలు ఎలా ఉంటాయి? నేను అయితే ఇలాంటి చోట ఒక్క రోజు కూడా ఉండలేను. అసలు నేను చీపురు పట్టి రోడ్లు తుడవాలా? అంటూ అధికారులను నిలదీశారు. ఇక, పిఠాపురంలో పారిశుధ్య నిర్వహణ విఫలమవుతున్న నేపథ్యంలో.. 'గుడ్ మార్నింగ్ పిఠాపురం' కార్యక్రమాన్ని కూడా తానే స్వయంగా నిర్వహించాలా? అని పవన్ తీవ్రంగా ప్రశ్నించారు. ప్రజలకు కనీస సదుపాయాలు అందించడంలో మున్సిపల్ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. పిఠాపురం అభివృద్ధి కోసం పాడా పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రకటించినా, దాని అమలు విషయంలో వేగం లేకపోతే ప్రయోజనం ఏముంటుందని ప్రశ్నించారు.

అవసరమైతే రాజకీయ-పరమైన అడ్మినిస్ట్రేషన్ నిర్ణయాలు తీసుకోలేరా? అభివృద్ధి కోసం ప్రభుత్వం గట్టి అడుగులు వేయొద్దా? అని అధికార పార్టీ నేతలను, యంత్రాంగాన్ని నిలదీశారు.కాలనీల్లో నడుచుకుంటూ సమస్యలు తెలుసుకున్నారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. కేవలం సమీక్షలకే పరిమితం కాకుండా, పవన్ కల్యాణ్ పిఠాపురం కాలనీల్లో నడుచుకుంటూ వెళ్లి స్థానికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, చెత్త నిర్వహణ, మౌలిక వసతుల కొరతపై ప్రజలు చెప్పిన అంశాలను ఆయన నోట్ చేసుకున్నారు. అయితే, పిఠాపురం పారిశుధ్య వ్యవస్థను వెంటనే మెరుగుపర్చాలని, అధికార యంత్రాంగం ప్రజల అవసరాలకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. నిర్లక్ష్యం కొనసాగితే ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హెచ్చరించారు.

## కరోనా సమయంలో కష్టపడి అన్నం పెట్టారు

**కాకినాడ,జనవరి9 వెలుతురు:**

కరోనా సమయంలోనూ రైతులు పనిచేసి అందరికీ అన్నం పెట్టారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాయవరంలో పర్యటించిన సీఎం చంద్రబాబు.. రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రైతుల భూమి పత్రాలపై జగన్ ఫొటో ఎందుకు వేశారో అర్థం కాలేదన్నారు. గత ప్రభుత్వ నేతలవి ప్రమాదకరమైన ఆలోచనలని.. 'మీ భూమి - మీ హక్కు' అని ఎన్నికల ప్రచారంలోనే తాము చెప్పినట్లు గుర్తు చేశారు. రాజముద్ర వేసి పాస్‌బుక్‌లు ఇస్తామని హామీ ఇచ్చామని, దాన్ని ఇప్పుడు నెరవేర్చామని తెలిపారు. గ్రామసభలు ఏర్పాటు చేసి రైతులకు ఈనెల 11 వరకు పాస్‌బుక్‌లు ఇస్తున్నాం. ఒక్క రూపాయి అవినీతి లేకుండా చూడాలని అధికారులకు చెప్పా. ఎమ్మార్వోలు, ఆర్డీవోలు, మిగతా సిబ్బంది మనసుపెట్టి పనిచేయాలి. వచ్చే నెలలో మళ్లీ సర్వే చేసి పాస్‌బుక్‌లు ఇస్తాం అన్నారు. ఒక్కసారి ప్రింట్ అయ్యాయంటే ఇక జీరో మిస్టేక్స్ ఉండాలి. భూమికి సంబంధించి 29 అంశాలపై ఫిర్యాదులు వచ్చాయి. అన్నింటినీ పరిష్కరిస్తున్నాం. 22-ఏ భూములపై వచ్చిన సమస్యలన్నీ తొలగిస్తున్నాం. రైతుల భూరికార్డులన్నీ బ్లాక్‌చైన్‌లో భద్రంగా ఉంటాయి. ఎవరైనా భూకబ్జా చేయాలంటే భయపడేలా చర్యలు తీసుకుంటాం. చిన్న చిన్న భూతగాదాలు పెట్టుకోవద్దని ప్రజలందరినీ కోరుతున్నా. కుటుంబసభ్యులు, బంధువులతో వివాదాలు వద్దు. గొడవలు పడి కోర్టులకు వెళ్తే జీవితమంతా ఖర్చయిపోతుంద సీఎం చంద్రబాబు తెలిపారు. అయితే పాసు పుస్తకాల పంపిణీలో నిర్లక్ష్యంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు. ఈ వ్యవహారానికి సంబంధించి అధికారులపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పాసు పుస్తకాలు తీసుకున్న రైతులంతా సభకు రాకపోవటంపై కలెక్టర్, రెవెన్యూశాఖ అధికారులపై సీఎం మండిపడ్డారు.

ఎంపీ, ఎమ్మెల్యేలు కూడా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఇటువంటి ఘటనలు పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీలో పారదర్శకత ఉండాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. 'మీ భూమి మీద హక్కు' ప్రభుత్వ రాజముద్రతో పట్టాదారు పాసు పుస్తకాల పంపీణీ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'మీ భూమి - మీ హక్కు'... చేసి చూపించామన్నారు. రైతులకు ఎప్పుడూ అన్యాయం జరగకూడదని అన్నారు. కరోనా సమయంలోనూ పనిచేసి రైతులు అందరికీ అన్నం పెట్టారని గుర్తుచేశారు. ఏపీలో 6,680 ఎకరాల్లో రీ సర్వే చేశామని.. 22.30 లక్షల పాస్ పుస్తకాలు సిద్ధం చేశామని చెప్పారు. గతంలో పట్టాదారు పాసు పుస్తకాలకు జగన్ ఫొటో పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. కూటమి అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశామని తెలిపారు. ఈ పట్టాదారు పాసు పుస్తకాన్ని ఎవరూ ట్యాంపరింగ్ చేయలేరని తెలిపారు. ఎవరైనా ట్యాంపరింగ్ చేస్తే గుర్తించి శిక్షించే పరిస్థితి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# గతేడాది మోడీ, ట్రంప్ మధ్య 8 సార్లు ఫోన్ కాల్స్

**- వాణిజ్య మంత్రి హాళవార్డ్ లుట్నిక్ కామెంట్‌పై రణ్‌దీప్ జైస్వాల్**

**న్యూఢిల్లీ,జనవరి9 వెలుతురు:**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు భారత ప్రధాని మోదీ ఫోన్ చేయకపోవడంతో వాణిజ్య ఒప్పందం కుదరలేదంటూ అమెరికా వాణిజ్య మంత్రి హాళవార్డ్ లుట్నిక్ తాజాగా చేసిన కామెంట్స్ ప్రస్తుతం కలకలం రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత విదేశాంగ శాఖ కీలక ప్రకటన చేసింది. గతేడాది మోదీ, ట్రంప్ 8 సార్లు మాట్లాడుకున్నారని విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ శుక్రవారం తెలిపారు. ఆ కామెంట్స్ మా దృష్టికి వచ్చాయి. గతేడాది ఫిబ్రవరి 13 నుంచి భారత్, అమెరికా దేశాలు వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు కృషి చేస్తున్నాయి. నాటి నుంచీ ఇరు దేశాల బృందాలు పలుమార్లు చర్చలు జరిపాయి. పరస్పర ఆమోదయోగ్యమైన ఒప్పందం కోసం ప్రయత్నిస్తు



న్నాయి. చాలా సందర్భాల్లో ఒప్పందంపై చర్చలు తుది వరకూ వెళ్లాయి. అయితే, ఈ చర్చలపై వస్తున్న వార్తలు పూర్తిగా వాస్తవం కాదు' అని రణ్‌ధీర్ జైస్వాల్ మీడియా సమావేశంలో అన్నారు. గతేడాది ప్రధాని మోదీ, అధ్యక్షుడు ట్రంప్ ఏకంగా 8 సార్లు మాట్లాడుకున్నారని చెప్పారు. ఇరు దేశాల భాగస్వామ్యానికి సంబంధించి వివిధ అంశాలు వారి మధ్య చర్చకు వచ్చాయని తెలిపారు. భారత్, అమెరికా దేశాలకు ఆమోదయోగ్యమైన వాణిజ్య ఒప్పందం కోసం తాము కట్టుబడి ఉన్నామని విదేశాంగ శాఖ ప్రతినిధి తెలిపారు. ఇరు దేశాధినేతల మధ్య పరస్పర గౌరవంతో కూడిన స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని కూడా చెప్పారు. ప్రధాని మోదీ, అధ్యక్షుడు ట్రంప్‌నకు కాల్ చేయకపోవడంతో భారత్, అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదరలేదని అమెరికా వాణిజ్య మంత్రి హాళవార్డ్ లుట్నిక్ పేర్కొన్న విషయం తెలిసిందే. ఓ పాడ్ కాస్ట్‌లో గురువారం ఆయన ఈ కామెంట్స్ చేశారు. 'ఒప్పందం దాదాపుగా ఓ కొలిక్కి వచ్చింది. చివర్లో ప్రధాని మోదీ, ట్రంప్‌నకు కాల్ చేయాల్సి ఉంది. ఇది భారత ప్రభుత్వానికి రుచించలేదు. చివరకు ప్రధాని మోదీ కాల్ చేయలేదు' అని లుట్నిక్ కామెంట్ చేశారు.

## ఎసిబికి చిక్కిన పంచాయితీ కార్యదర్శి

**- లంచం తీసుకుంటుండగా పట్టివేత**

**సూర్యపేట,జనవరి9( వెలుతురు):**

జిల్లాలో పంచాయతీ కార్యదర్శి ఒకరు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. తుంగతుర్తి మండలం గానుగబండ గ్రామ పంచాయతీ కార్యదర్శి శుక్రవారం రూ.6 వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. గ్రామస్థుడు ఒకరు కొత్తగా నిర్మించుకున్న ఇంటికి నంబర్ కేటాయించాలని కార్యదర్శి బర్‌పాటి కృష్ణాను సంప్రదించాడు. అతను లంచం డిమాండ్ చేయడంతో దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా వ్యూహం ప్రకారం రూ.6 వేలు తీసుకుంటూ పట్టుబడ్డాడు. అతడి వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.



అనంతరం నాంపల్లి ఏసీబీ కోర్టు అడిషనల్ స్పెషల్ జడ్జి ఎదుట హాజరు పరిచారు.వరుసగా గత నాలుగు రోజుల నుంచి ఏసీబీ అధికారులు మొత్తం 7 గురు ప్రభుత్వ అధికారులను లంచం తీసుకుంటూ పట్టుకున్నారు. నిన్న వనపర్తిలో పౌరసరఫరాల మేనేజర్ జగన్ మోహన్ అవినీతి నిరోధక అధికారులకు చిక్కాడు. గురువారం అతడు రూ.50 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈనెల 7న వరంగల్ కేయూసీ సబ్ ఇన్‌స్పెక్టర్ పి. శ్రీకాంత్ ను అదే రోజు రంగారెడ్డి జిల్లాలో నందిగామమండలానికి ఎంపీడీవో, ఎంపీవో పంచాయతీ కార్యదర్శిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అంతకు ముందు హైదరాబాద్‌లోని బొగ్గుకుంట ఎండోమెంట్ కమిషనర్ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఆకవరం కిరణ్‌కుమార్ రూ. 50 వేలు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కాడు.

## వికసిత్ భారత్ యంగ్ లీడర్ డైలాగ్-2026 పై పీఐబి హైదరాబాద్‌లో విలేకరుల సమావేశం




**హైదరాబాద్ వెలుతురు జనవరి 09:**
న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఈనెల 9 నుంచి 12 వరకు జరగనున్న "వికసిత్ భారత్ యంగ్ లీడర్ డైలాగ్ (వీబీవైఎల్‌డీ)–2026" కార్యక్రమంపై విలేకరుల సమావేశాన్ని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, మై భారత్ తెలంగాణ విభాగం ఆధ్వర్యంలో పీఐబీ హైదరాబాద్ కార్యాలయంలో నిర్వహించారు. జాతీయ యువజన ఉత్సవానికి నూతన రూపమైన 'వికసిత్ భారత్ యంగ్ లీడర్ డైలాగ్–2026' రెండవ కార్యక్రమాన్ని భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నాలుగు రోజుల కార్యక్రమం జనవరి 9 నుంచి 12 వరకు న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతుంది. ఈ కార్యక్రమానికి సంబంధించి బృహత్తరమైన ఎంపిక ప్రక్రియ కొనసాగింది. మై భారత్ వేదిక ద్వారా నిర్వహించిన క్విజ్‌లో దేశవ్యాప్తంగా సుమారు 50 లక్షల మంది యువత పాల్గొన్నారు. పది ప్రధాన ఇతివృత్తాలపై వ్యాసాలు సమర్పించిన 2.5 లక్షల మంది నుంచి 15,000 మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. దేశంలోని 677 జిల్లాల నుంచి జానపద కళలు, కవిత్వం, చిత్రలేఖనం వంటి విభాగాల్లో ప్రతిభ కనబరిచిన 954 మంది విజేతలు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ ఉత్సవ ముగింపు వేడుకను జనవరి 12న నిర్వహిస్తారు. ఈ ముగింపు కార్యక్రమానికి గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరవుతారు. మై భారత్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ గంటా రాజేశ్, హైదరాబాద్ జిల్లా యువజన అధికారిణి ఖుష్బు గుప్తా, రంగారెడ్డి జిల్లా యువజన అధికారి శ్రీ ఐసయ్య ఈ విలేకరుల సమావేశంలో పాల్గొని కార్యక్రమ విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

## కరీంనగర్ కు "ఆయుష' మంజూరు

చికిత్సవైపు మొగ్గు చూపుతున్నారు. ఇటీవల కాలంలో వీటికి ఆదరణ కూడా బాగా పెరిగిపోయింది. దీనిని దృష్టిలో ఉంచుకున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో 'ఆయుష్ణ ఆసుపత్రి ఏర్పాటు కోసం క్రుషి చేస్తున్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు పంపి కేంద్రానికి పంపించారు. ఉన్నతాధికారులతోపాటు కేంద్ర ఆయుష్ మంత్రి ప్రతాప్ రావు జాదవ్ ను కలిసి కరీంనగర్ లో ఆయుష్ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని కోరుతూ వినతి పత్రం అందించారు. తెలంగాణలో వికారాబాద్, సిద్ధిపేట, భూపాపల్లి జిల్లాల్లో ఇప్పటికే ఆయుష్ ఆసుపత్రులు ఉన్నాయి. అయినప్పటికీ బండి సంజయ్ విజ?ప్తి మేరకు కరీంనగర్ లో ఆయుష్ ఆసుపత్రి ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై కేంద్ర ఆయుష్



విభాగం అధికారులు పరిశీలించారు. ఉత్తర తెలంగాణలో ఆయుష్ సేవల పట్ల ప్రజలు మక్కువ చూపుతున్నట్లు తేలడంతో కరీంనగర్ లో 'ఆయుష్ణ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా 50 పడకల ఆయుష్ ఆసుపత్రిని మంజూరు చేస్తూ పరిపాలనాపరమైన ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఆసుపత్రి ఏర్పాటుకు మొత్తం రూ.15 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. అందులో భాగంగా రూ.7.5 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. తక్షణమే 'ఆయుష్ణ ఏర్పాటు కోసం తగిన స్థలాన్ని ఎంపిక చేసి ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ పంపింది. స్థల ఎంపిక ఆయుష్ ఆసుపత్రి ఏర్పాటుతోపాటు డాక్టర్లు, సిబ్బందిని నియామక బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించింది. కేంద్రం ఆయుష్ ఆసుపత్రి ఏర్పాటుకు అనుమతి ఇవ్వడంతో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆయుష్ అధికారులతో చర్చించారు. స్థల సేకరణపై దృష్టి సారించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం భారతీయ సాంప్రదాయ వైద్య చికిత్సలకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా యోగా, ఆయుర్వేదం, హోమియోపతి వైద్యంపట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. ఈ చికిత్సలవల్ల పెద్దగా సైడ్ ఎఫెక్ట్స్ లేకపోవడంతో ప్రజలు సైతం వీటివైపు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా తెలంగాణలో ఆయుర్వేదం, హోమియోపతి, యోగా నేచురోపతి ఆసుపత్రులకు తండోపతండాలుగా జనం తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో కరీంనగర్ పార్లమెంట్ ప్రజలు సైతం తమ ప్రాంతంలో ఆయుష్ ఆసుపత్రి ఉంటే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో పర్యటిస్తున్న సందర్భంలో పలుమార్లు ప్రజలు 'ఆయుష్ణ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని కోరుతూ వినతి పత్రాలు అందించారు. ఈ నేపథ్యంలో బండి సంజయ్ ప్రత్యేక చొరవ తీసుకుని ఆయుష్ ఆసుపత్రి కోసం క్రుషి చేశారు. సంజయ్ విజ?ప్తిని దృష్టిలో ఉంచుకుని తాజాగా కేంద్రం ఆయుష్ ఆసుపత్రి ఏర్పాటుకు ఆమోదం తెలపడంతోపాటు నిధులు కూడా మంజూరు చేయడం గమనార్హం.దపడకల ఆయుష్ ఆసుపత్రి ఏర్పాటైతే ఆయుర్వేద, హోమియోపతి, యోగా నేచురోపతి, యునాని, సిద్ధ వైద్య చికిత్స సేవలన్నీ అందుబాటులోకి రానున్నాయి. దీంతోపాటు ప్రసూతి, స్త్రీ రోగ చికిత్సలు కూడా అందుబాటులోకి రానున్నాయి. వీటితోపాటు కాయకల్ప చికిత్స, పంచకర్మ,శల్య, శాలాక్య వంటి సేవలు అందుబాటులోకి వస్తాయి. మొత్తం 50 పడకల ఆసుపత్రిలో కాయచికిత్సకు 20, పంచకర్మ చికీత్సకు 10, శల్య సేవలకు 10, ఈఎన్టీ, ప్రసూతి, స్త్రీ ఆరోగ్య సేవలకు 5 పడకలను కేటాయించనున్నారు. ప్రతి విభాగానికి అర్హత, అనుభవం ఉన్న ఆయుష్ వైద్యులు అందుబాటులో ఉంటారు. యోగా ట్రైనర్ కూడా ఉంటారు. పరిపాలన విషయానికొస్తే మెడికల్ సూపరింటెండెంట్ తోపాటు ఇద్దరు డిప్యూటీ/అసిస్టెంట్ డైరెక్టర్స్ (అడ్మిన్, ఫైనాన్స్) , ఇద్దరు హెడ్ క్లర్క్, ఇద్దరు యూడీసీలు, 7 గురు ఎల్డీసీలు, 14 మంది నర్సింగ్ స్టాఫ్, ఇద్దరు నర్సులతోపాటు ల్యాబ్ టెక్నీషియన్, రేడియోగ్రాఫర్, ఫార్మాసిస్టులు కూడా ఈ ఆయుష్ ఆసుపత్రలో సేవలందిస్తారు. పంచకర్మ చికిత్సలకు ప్రత్యేక సిబ్బంది అందుబాటులో ఉంటారు. అట్లాగే ఆయుష్ ఆసుపత్రిలో హౌస్‌కీపింగ్, లాండ్రీ, ఎలక్ట్రిషియన్, ప్లంబర్, గార్డెనర్ తోపాటు 21 మంది సెక్యూరిటీ సిబ్బంది కూడా సేవలు అందిస్తారు. ఆయుర్వేదం విషయానికొస్తే... పంచకర్మ చికిత్సలు (వమన, విరేచన, బస్తి మొదలైనవి), చర్మ, జాయింట్, జీర్ణక్రియ, దీర్ఘకాలిక వ్యాధుల చికిత్సలు అందుబాటులోకి వస్తాయి. యోగా ఢ నేచురోపతి విభాగం విషయానికొస్తే... యోగా ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం వంటి సేవలతోపాటు జీవనశైలి మార్పులు, స్ట్రెస్, షుగర్, బీపీ నియంత్రణకు సంబంధించి పై కౌన్సిలింగ్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. హోమియోపతి విభాగానికి సంబంధించి హోమియోపతి డాక్టర్లు, పిల్లలు, మహిళలు, అలర్జీ, ఆస్తమా, మైగ్రేన్ చికిత్సలు అందుబాటులోకి వస్తాయి. డిమాండ్ ను బట్టి సిద్ధ, యునానీ సేవలు కూడా ప్రారంభిస్తారు. రోజువారీ వైద్య సేవలు (ఓపీ), డైట్ న్యూట్రిషన్ సలహాలు, ఆరోగ్య అవగాహన శిబిరాలు కూడడా అందుబాటులోకి రానున్నాయి. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ప్రజలకు సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా సహజ పరిష్కార సేవలు ఆయుష్ ఆసుపత్రి ద్వారా అందుబాటులోకి రానున్నాయి.

## ఆంధ్రప్రదేశ్ కి సంక్రాంతి కళ - ఎటు చూసినా వేడుకలే!

ఆంధ్రప్రదేశ్‌లో సంక్రాంతి సందడి ఈసారి సరికొత్త శోభను సంతరించుకుంది. గత ఐదేళ్ల పాలనలో పండుగ అంటే కేవలం కాసినోలు, కోడి పందాలు, జూద వినోదాలే అన్నట్లుగా సాగిన పరిస్థితి నుంచి, నేడు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా రాష్ట్రం కళకళలాడుతోంది. పాలకుల ఆలోచనా ధోరణి మారితే ప్రజల ఉత్సాహం ఎలా ఉంటుందో ప్రస్తుత రాష్ట్ర వేడుకలే నిదర్శనంగా నిలుస్తున్నాయి.

- అమరావతిలో ఆవకాయ్ వైభవం
- రాజధాని అమరావతి పరిధిలోని విజయవాడ పున్నమి ఘాట్,
- భవానీ ద్వీపంలో ప్రభుత్వం ఆవకాయ్–అమరావతి సినిమా,
- సంస్కృతి,
- సాహిత్యోత్సవం
- నిర్వహిస్తోంది.
- తెలుగువారి
- ఐకానిక్ రుచి ఆవకాయ పేరుతో జరుగుతున్న
- ఈ వేడుకల్లో సాహిత్యం,
- కళలు,
- సినిమా విశ్లేషణలు
- సాంస్కృతిక కార్యక్రమాలతో కృష్ణమ్మ తీరం ఆధ్యాత్మిక, సామాజిక చైతన్యానికి వేదికైంది.



- జూదానికే పరిమితం
- కాకుండా, తెలుగు మేధో సంపత్తిని ప్రపంచానికి చాటాలనే లక్ష్యం ఇక్కడ కనిపిస్తోంది.
- పిఠాపురంలో పీఠికాపురం సంబరాలు
- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన సొంత నియోజకవర్గమైన పిఠాపురాన్ని పీఠికాపురం
- పేరిట ఆధ్యాత్మిక,
- సంప్రదాయ వేడుకలకు కేంద్రంగా మార్చారు.
- మూడు రోజుల పాటు జరిగే
- ఈ సంక్రాంతి మహోత్సవంలో గంగిరెద్దుల ఆటలు,
- హరిదాసుల కీర్తనలు,
- జానపద కళారూపాలతో
- పాతకాలపు పల్లెటూరి పండుగ వాతావరణాన్ని తలపిస్తోంది.
- పీఠికాపురం పురావైభవాన్ని గుర్తు చేస్తూ సాగుతున్న
- ఈ వేడుకలు స్థానికుల్లో అపూర్వమైన ఉత్సాహాన్ని నింపాయి.
- సరికొత్త పాలన సంతోషకరమైన
- పండుగ
- గతంలో పండుగ రోజుల్లో
- అశ్లీల నృత్యాలు,
- అక్రమ జూద కేంద్రాలతో భయానక వాతావరణం ఉండేదన్న విమర్శలు ఉండేవి.
- కానీ ఇప్పుడు ప్రభుత్వం అధికారికంగా సాంస్కృతిక ఉత్సవాలను ప్రోత్సహిస్తుండటంతో
- సామాన్య ప్రజలు కుటుంబాలతో కలిసి పండుగను ఆస్వాదిస్తున్నారు.
- హరిదాసుల దీవెనలు,
- ముగ్గుల పోటీలు,
- సంప్రదాయ వంటకాలతో
- ప్రతి ఇల్లు ఒక కళానిలయంగా మారింది.
- ఇది కేవలం పండుగ మార్పు మాత్రమే కాదు,
- రాష్ట్రంలో వచ్చిన పాలనాపరమైన మార్పుకు ప్రతిబింబం.
- ఆంధ్రప్రదేశ్ లో ఇప్పుడు కనిపిస్తున్న సంక్రాంతి కళ కేవలం వినోదం కోసం మాత్రమే కాదు,
- అది తెలుగు జాతి మూలాలను గౌరవించే ఒక గొప్ప ప్రయత్నం.
- పాలకుల ప్రాధాన్యతలు మారినప్పుడు,
- సమాజంలో నైతిక విలువల కంటే సంస్కృతికి పెద్దపీట వేసినప్పుడు ప్రజల్లో ఇలాంటి నిజమైన పండుగ కళ కనిపిస్తోంది.

## హుస్నాబాద్ ను ఆరోగ్య నియోజకవర్గంగా తీర్చిద్దుతాం

**- నియోజకవర్గంలో ప్రతి ఒక్కరికి రూపాయి ఖర్చు లేకుండా వైద్య పరీక్షలు అవసరమైనవారికి ఉచిత చికిత్స**

**- గ్రామాల వారిగా ప్రతి క్లస్టర్ లో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ లు - మంత్రి పొన్నం ప్రభాకర్**



**హుస్నాబాద్ వెలుతురు జనవరి 09:**
హుస్నాబాద్ ను ఆరోగ్య నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి 7 మండలంలోని ఏడు మెడికల్ కాలేజీల ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ లు ఏర్పాటు చేస్తున్నట్లు రవాణా మరియు బీసీ సంక్షమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. శుక్రవారం సిద్దిపేట జిల్లాలోని కోహెడ , అక్కన్నపేట, హుస్నాబాద్ మండలాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ ఉచిత వైద్య శిబిరాలను ప్రారంభించారు. కోహెడ మండలంను ఆర్వీఎం మెడికల్ కాలేజీ , అక్కన్నపేట మండలం ను సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీ, హుస్నాబాద్ మండలం , మున్సిపాలిటీ నీ సురభి మెడికల్ కాలేజీ లు దత్తత తీసుకొని గ్రామగ్రామాన హెల్త్ క్యాంప్ లు ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. మెడికల్ క్యాంప్ వైద్యులతో , పరీక్షలు చేసుకోవడానికి వచ్చిన ప్రజలతో మాట్లాడారు. వారికి అవసరమైన మందులు అందిస్తున్నాయి చికిత్స కూడా ఉచితంగా హైదరాబాద్ లో చేయిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. హెల్త్ క్యాంప్ లో ప్రతి విభాగం నుండి సూపర్ స్పెషాలిటీ డాక్టర్స్ వచ్చారని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హుస్నాబాద్ లో 250 పడకల ఆసుపత్రి నిర్మాణం జరుగుతుందని దానికి అనుబంధంగా పీజీ మెడికల్ కాలేజీ కూడా వస్తుందని నిరంతరం వైద్య పరీక్షలు నాణ్యమైన వైద్యం అందరికీ అందుబాటులో ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రతి గ్రామంలో ఆశ వర్కర్లు, అంగన్వాడి సభ్యులు గ్రామాల్లో ఎవరెవరికి ఆరోగ్య సమస్యలు ఉన్నాయో వివరాలు సేకరించాలని ఆదేశించారు. అనంతరం హుస్నాబాద్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ముగ్గుల



పోటీల తుది కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. ఇప్పటికే ప్రతి గ్రామంలో ,తరువాత మండలాల వారిగా జరిగిన ముగ్గుల పోటీలో ఈరోజు ఫైనల్ లో 42 మంది మహిళలు పాల్గొన్నారని అందులో మొదటి 5 మంది విజేతకు బహుమతులు ప్రధానం చేశారు. పోటీలో పాల్గొన్న మహిళలందరికీ బహుమతుల తో సత్కరించారు. రోడ్ సేఫ్టీ పై రోడ్డు నిబంధనలు పాటించాలనీ ముగ్గు రూపంలో అవగాహన కల్పించిన హుస్నాబాద్ కి చెందిన కొంపల్లి మౌనిక ను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం హుస్నాబాద్ మున్సిపాలిటీ లోని 20 వార్డులకు వార్డుకు ఒకటి చొప్పున క్రికెట్ కిట్ లు ,క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. హుస్నాబాద్ ను క్రీడల అడ్డగా మార్చాలని కోరారు. ఇప్పటికే హుస్నాబాద్ ప్రాంతం కబడ్డీలో రాష్ట్ర స్థాయి గుర్తింపు సాధించిందని ఇక్కడ కబడ్డీ అకాడమీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. హుస్నాబాద్ లో ఉన్న స్టేడియాన్ని అన్ని రకాల క్రీడలు ఆడేలా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమవతి, గ్రంథలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, డీఎంహెచ్ఓ ధనరాజ్,ఆర్డీవోలు ,మార్కెట్ కమిటీ చైర్మన్ లు ,సర్పంచ్ లు ఇతర ముఖ్య నేతలు,అధికారులు పాల్గొన్నారు..

## జేఎన్‌జే జర్నలిస్ట్స్ భూములపై కుట్రలా?

**- నిజాంపేట్, పేట్ బషీరాబాద్ లో అక్రమాలు నిమ్మకాయల వంశీ శ్రీనివాస్ చట్టవ్యతిరేక చర్యలు!**

**- కుట్రలు బట్టబయలు చేసిన సభ్యులు**

**- సహకార శాఖ, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి-సభ్యులు**




**హైదరాబాద్, వెలుతురు జనవరి 9 :**
జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ హైజింగ్ సోసైటీ సీఈ, కార్యదర్శిగా సుదీర్ఘంగా కొనసాగుతున్న నిమ్మకాయల వంశీ శ్రీనివాస్ చట్ట వ్యతిరేక చర్యలను సభ్యులు హైదరాబాద్ ప్రెస్ క్లబ్ వేదికగా బట్టబయలు చేశారు. 2023 లో వంశీ శ్రీనివాస్ పై చార్జిషీటు, ఎన్నికల సంఘం ద్వారా కేసు నిజం కాదా? అని ప్రశ్నించారు. 2022 సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయకుండా నిర్లక్ష్యం వహించడంలో లోగుట్టు ఏమిటి? వెయ్యి కుటుంబాల ప్రయోజనాలను ఫణంగా పెట్టి భూములను జేఎన్‌జేహెచ్ఎస్ సభ్యులు అనుభవించకుండా ఎందుకు కుట్రపన్నారని నిలదీశారు. ప్రభుత్వం సానుకూలంగా ఉన్నా నిజాంపేట, పేట్ బషీరాబాద్ భూములు జేఎన్‌జేహెచ్ఎస్ మ్యాక్ సొసైటీ సభ్యులకు దక్కనివ్వకుండా కుట్రపన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ గందరగోళంలో నిజాంపేట్, పేట్ బషీరాబాద్ భూములను అక్రమమార్గంలో కొట్టివేయాలని కుట్రపన్నింది ఎవరు? వారికి బాసటగా నిలిచింది ఎవరు? చొరబాటుదారులకు మార్గం సుగమం చేసింది ఎవరు? తేల్చాలని ప్రభుత్వాన్ని సభ్యులు కోరారు. నిజాంపేట్ లో భోగీ కృష్ణ పేరిట మూడు ఎకరాలు, స్ట్రింగర్స్ పేరిట రెండు ఎకరాలు అక్రమణలు జరిగాయని ఆరోపించారు. పేట్ బషీరాబాద్ లో కబ్జాలు, మానేటి శ్రీనివాస్ రెండు వేల గజాలు ఆక్రమించి రెండంతస్తుల ఇళ్లు, అపర్ణ వెంచర్స్‌కు సోసైటీ భూమిలోంచి రోడ్డు, సెయింట్ ఆన్స్ పాఠశాల ఎకరంన్నర కబ్జా అంశాల్లో నిమ్మకాయల వంశీ పాత్ర అనుమానాస్పందంగా ఉందన్నారు. ప్రభుత్వ ఖజానాకు చెల్లించగా అలాట్ అయిన భూమి అన్యాక్రాంతమైతే ఎందుకు మీ మీడియాహౌజ్‌ల ద్వారా ఆ కబ్జాలను వెల్లడించలేదని, సాటి జర్నలిస్టులకు జరుగుతున్న అన్యాయాన్ని ఎందుకు బహిర్గతం చేయడం లేదని వాపోయారు. జర్నలిస్టు సంఘాలు కూడా ఈ విషయంలో నోరు మెదపడం లేదెందుకు? ఈ దోస్తీ ఏమిటి? చార్జీషీటు తర్వాత విచారణ ఏమైంది? కంప్లయింట్ దారులు కూడా ఎందుకు మౌనం వహిస్తున్నారు? ఈ లోపాయికారీ ఒప్పందాలే తమకు శాపంగా మారాయన్నారు. చార్జ్ షీట్ నమోదై ఉన్న వ్యక్తికి ఓట్లేయమని పలు మీడియాల్లో కీలక స్థానాల్లో ఉన్నవారు ఎలా మెసేజ్ విడుదల చేశారు? అలా మెసేజ్ విడుదల చేసినందుకు గాను సొసైటీకి, సభ్యులకు జరిగిన అన్యాయానికి బాధ్యత వహిస్తారా? లేదా మీ పేర్లను మీ అనుమతి లేకుండా వంశీ శ్రీనివాస్ వాడుకున్నారా స్పష్టం చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు.

**- సహకార శాఖ చర్యలు తీసుకోవాలి**

2014 నుంచి 2021 వరకు జీచీజీూ సోసైటీకి ఎన్నికలు జరగకున్నా, జరిగినట్లుగా కమిటీ వ్యవహరిస్తే సహకార శాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సభ్యులు ప్రశ్నించారు. ప్రతి సంవత్సరం ఆడిట్ రిపోర్టులు , సభ్యుల వివరాలు ఎవరు పొందుపరిచారు? ఈ గందరగోళానికి కారణం అప్పటి ప్రభుత్వం, సంబంధిత ప్రభుత్వ శాఖలది కాదా? అన్నారు.

**- సుప్రీం కోర్టుకు ఎందుకు?**

ఇళ్లులేని సోసైటీ సభ్యులు అఫిడవిట్లు ఇచ్చి భూములు తీసుకోవాలని 2010లో హైకోర్టు స్పష్టంగా పేర్కొన్నా, సభ్యులను సంప్రదించకుండా సుప్రీంకోర్టుకు వెళ్లారని సభ్యులు వాపోయారు. గవర్నమెంట్ మెమో నంబరు 19544 /ఏఎస్ఎస్ఎన్ 5(3) 2011, 04012012 ద్వారా తమ సొసైటీ ప్రభుత్వానికి డబ్బులు కట్టిందన్నారు. ప్రభుత్వం ఐ అండ్ పీఆర్ శాఖ ద్వారా భూములను తమ సొసైటీకి స్వాధీన పరిచినా కూడా ఎందుకు సుప్రీంకోర్టులో ఎస్‌ఎల్‌పీ విరమించుకోలేదు? దీని వెనుక ఉన్న మర్మమేమిటో నిమ్మకాయల వంశీ చెప్పాలన్నారు.

**-సీఎం రేవంత్ కు కృతజ్ఞతలు**

ఈ మొత్తం యవనికలో జేఎన్‌జేహెచ్ఎస్ సభ్యులను కాపాడుతున్న అంశం ఒకే ఒక్కటి. అది రాష్ట్ర ముఖ్యమంత్రి 2024, సెప్టెంబర్, ఎనిమిదవ తేదీన రవీంద్రభారతిలో భారీ సభ ఏర్పాటు చేసి పేట్ బషీరాబాద్ భూముల మీద అనుభవ హక్కులను ప్రసాదిస్తూ అధికారిక పత్రాన్ని విడుదల చేశారని సభ్యులు తెలిపారు. తమకు అండగా నిలిచిన కాంగ్రెస్ సర్కారుకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు, ధన్యవాదాలు చెప్పారు.

# సంపాదకీయం.. ప్రాజెక్టుల్లో మునిగిపోతున్న నిర్వాసిత జీవితాలు

పోలవరం కావచ్చు...మల్లన్న సాగర్ కావచ్చు లేదా కొండపోచమ్మ సాగర్ కావచ్చు లేదా..గతంలో గంగవరం పోర్టు కావచ్చు..ప్రాజెక్టులు ఏవైనా త్యాగం ప్రజలది, భోగం కార్పోరేట్లది అవుతోంది. వేలకోట్లు పెట్టి ప్రభుత్వాలు కట్టించే ప్రాజెక్టులు సైతం కార్పోరేట్లకు ధారదత్తం చేస్తున్నారు. భూముల సేరణ, ఇళ్లను సేకరించడం తరవాత వారికి కబుర్లు చెప్పడం ఆ తరవాత వారి త్యాగాలను మరచిపోతున్నారు. గంగవరం పోర్టు కోసం త్యాగం చేసిన మత్స్యకారులు రోడ్డున పడ్డారు. పోర్టును పొందిన ఆదానీ ఒడ్డున పడ్డారు. ఇలా ఏ ప్రాజెక్టు తీసుకున్నా ఇదే చరిత్ర కనిపిస్తుంది. ఘనత వహించిన తెలంగాణ వల్లభుడు కెసిఆర్ హయాంలో మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్లకు భూములు ఇచ్చి, ఊర్లను త్యాగం చేసిన వారు ఆగమయ్యారు. కెసిఆర్, ఆయన అనుయాయులు పొలాలు మాత్రం పచ్చగా తడుస్తున్నాయి. తాజాగా అమరావతి రాజధాని కోసం లక్ష ఎకరాలు సేకరిస్తున్నారు. అయినా పాలకులు భూదాహం తీరడం లేదు. అమరావతిలో భూమి తీసుకున్న రైతులకు అరకొరగానే పరిహారం అందించారు. ప్లాట్లను సక్రమంగా అందించలేదు. బహిరంగంగా వారిపై ప్రశంసలు కురిపించడం తప్పవారికి లబ్ది చేకూర్చడం లేదు. ఇంకా ప్లాట్ల కోసం అక్కడి రైతులు పాట్లు పడుతూనే ఉన్నారు. తాజాగా రెండోదఫా భూసేకరణ మొదలయ్యింది. ఈ అభివృద్ధి ఏ ప్రజల కోసమన్నది పాలకులు ఆలోచన చేయాలి. ప్రజలను ముంచి చేసే పనులు మంచి ఎలా అవుతాయి. పోలవరం సంగతి చూస్తే అక్కడి నిర్వాసితులు దుర్భర పరిస్థితుల్లో ఉన్నారు. అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారిని పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ఇలా



దేశవ్యాప్తంగానే కాదు... తెలుగు రాష్ట్రాల్లో ఘనత వహించిన పాలకులు రైతులను నట్టేట ముంచుతున్నారు. పోలవరంలో సర్వస్వం కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయమైన పరిహారం, పునరావాసం లభించని దుస్థితి ఇప్పటికీ కొనసాగడం అత్యంత విచారకరం.ప్రాజెక్టు పూర్తయి అన్ని ప్రాంతాలకు నీరు అందించడం మునక ప్రాంతంలో 1.20 లక్షల కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారమైతేనే సాధ్యమవుతుంది. నిర్వాసితులకు భూమికి భూమిగానీ, ఇల్లు కట్టించడంగానీ, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలుగానీ జరగలేదు. కట్టించిన కాలనీల్లో వర్షం వస్తే ఇళ్లు కారుతున్నాయి. శ్మశానాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రార్థనా స్థలాల వంటివేవీ లేవు. 1986లో ఒకసారి, 2022లో మరోసారి వచ్చిన వరద ప్రభావ ప్రాంతాలను పరిశీలిస్తే మునక ప్రాంతంలో జరిగిన కాంటూరు సర్వే, తరువాత చేపట్టిన లైడార్ సర్వే ఏదీ వాస్తవాలను వెల్లడించడం లేదని రుజువైంది. తాజాగా నిర్వాసితుల బ్యాంకు ఎకౌంట్లలో జమచేస్తున్న పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ 2017కు ముందు అంచనాల ప్రకారం నిర్ణయించినవి కావడం గమనార్హం. 2017 తర్వాత డ్యామ్ అంచనాలు రెండుసార్లు సవరించారు కానీ నిర్వాసితులకు మాత్రం పాత ప్యాకేజీలే! పెళ్లయిన యువతులకు పునరావాస ప్యాకేజీ ఇవ్వడం లేదు. పురుషులతో సమానంగా స్త్రీలకు కూడా ప్యాకేజీ అమలు చేయాలి కదా! నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించినా అది అమలుకు నోచుకోలేదు. ఈ ప్రభుత్వం అయినా ప్యాకేజీ తాజా ధరలకు అనుగుణంగా సవరించి పెంచి ఇస్తుందేమోనని నిర్వాసితులు ఆశిస్తున్నారు. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు వాటి ఊసే ఎత్తుకోలేదు. పర్యటనలో డ్యామ్ నిర్మాణ పనులను ఆమూలాగ్రం పరిశీలించిన ఆయన ముంపు ప్రాంతాలను, పునరావాస కాలనీలను కూడా సందర్శిస్తే బాగుండేది. అక్కడి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటే వాటిని సత్వరం పరిష్కరించడానికి, అనేక అవకతవకలను, సర్వేలో జరిగిన పొరపాట్లను సరిదిద్దడానికి అవకాశం వుండేదని ప్రాజెక్టు బాధితుల భావన. వచ్చే సంవత్సరం జరిగే గోదావరి పుష్కరాల్లోగా అంటే మార్చి నెలకల్లా పోలవరం ప్రాజెక్టు జాతికి అంకితం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వాసితులకు న్యాయం చేయడానికి కృషి చేయడం లేదు. తీయని మాటలు తప్ప చిత్తశుద్ధ ఇకానరావడం లేదు. జలయజ్ఞంలో పోలవరం ప్రాజెక్టు ప్రతిపాదించినపుడు ఒకటే దశ. కానీ రాష్ట్ర విభజన చట్టం దాన్ని జాతీయ ప్రాజెక్టుగా పేర్కొనడంతో నిర్మాణ బాధ్యత కేంద్రానిదయ్యింది. నరేంద్రమోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మొదటంతా కేవలం ఇరిగేషన్ కాంపొనెంట్ మాత్రమే బాధ్యతని, అంటే డ్యాం, ప్రధాన కాలువల నిర్మాణమేనని బుకాయించి, పునరావాస పునర్నిర్మాణ విషయాన్ని దాటవేస్తూ వచ్చింది. ఆ తరువాత ప్రాజెక్టును రెండు దశలుగా మార్పించింది. డ్యాం 41.15 మీటర్ల ఎత్తు వరకు మొదటి దశగానూ, పూర్తి రిజర్వాయర్ మట్టం 45.72 మీటర్లు రెండోదశ అన్నారు. రాష్ట్రంలో అధికార పార్టీలు మారినా అప్పుడు, ఇప్పుడూ కేంద్రం కనుసన్నల్లో నడుచుకుంటున్నవే కనుక తలాడించాయి. అయితే, డ్యాం నిర్మాణం విషయంలో మాత్రం ఇది వర్తించదనీ, నిర్మాణం మొత్తం ఒకటిగానే పూర్తవుతుందని అప్పటి, ఇప్పటి ముఖ్యమంత్రులు చెబుతున్నారు. కాబట్టి నిర్వాసితులను పొమ్మనకుండా పొగబెట్టిన చందంగా రిజర్వాయర్‌లో నీరు నింపి వెళ్లగొట్టడానికే ఈ కుట్ర. అందుకనే దశలవారీ కాకుండా పూర్తి ఎత్తు వరకూ ఆర్ ఆండ్ ఆర్ మొదట పూర్తి చేశాకనే ప్రాజెక్టు నిర్మాణం అని నిర్వాసితులు ఘోష పెడుతున్నారు. మొదటి దశకు సంబంధించిన 41.15 మీటర్ల పరిధిలోని నిర్వాసితులకు 2027 జనవరికల్లా పునరావాసం పూర్తి చేయనున్నట్లు బుధవారంనాడు ముఖ్యమంత్రి చెప్పారు. ఆ లెక్కలు చూసినా మొదటి దశకు సంబంధించిన ఆర్‌అండ్‌ఆర్ అమలు సైతం ఇంకా ఆమడదూరంలో వుందని తేటతెల్లమవుతోంది.డయాఫ్రం వాల్‌ను నాణ్యంగా నిర్మించనందున వరదలకు దెబ్బతిన్నది. విదేశీ నిపుణులు సైతం దీన్ని నిర్ధారించారు కానీ వారిచ్చిన నివేదికను బహిరంగపర్చలేదు. మరమ్మతులకు అదనంగా రూ.900 కోట్లు ఇచ్చారేతప్ప డయాఫ్రం వాల్ దెబ్బతినడానికి కారణమైన కాంట్రాక్టర్లపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. నిర్మాణంలో అవకతవకలను సరిచేయడానికి భవిష్యత్‌లో డ్యాం భద్రతకు అవసరమైన చర్యలను పారదర్శకంగా తీసుకోవాలి. కానీ డయాఫ్రం వాల్ దెబ్బతిన్నా కనిపెట్టలేక పోయారని, గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఆరేడు సంవత్సరాలు ఆలస్యం అవుతోందని సిఎం చంద్రబాబు చెప్పారే తప్ప అందుకు కారణమైన కాంట్రాక్టర్, ఆనాటి పనులు సర్టిఫైచేసిన ఉన్నతాధి కారులు, గత ప్రభుత్వంలో ఈ అంశాల్లో నిర్ణయాలు చేసినవారిపై ఎలాంటి చర్యలనూ వెల్లడించలేదు. ఇప్పటికైనా ముందు నిర్వాసితులను ఆదుకోవాలి. దుబారా హెలికప్టర్ ఖర్చులు తగ్గించుకుని వారికి న్యాయం చేయాలి.

## కోల్‌కతాలో ఇడి దాడులకు నిరసన

**- హోంమంత్రి అమిత్ షా నివాసం ముందు టీఎంసి ఆందోళన**

**న్యూఢిల్లీ,జనవరి 9( వెలుతురు):**




కోల్‌కతాలో ఈడీ దాడులను ఖండిస్తూ టీఎంసీ ఎంపీలు ఢిల్లీలోని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కార్యాలయం ముందు నిరసనలు చేపట్టారు. శుక్రవారం ఉదయం టీఎంసీ ఎంపీలు డెరెక్ ఓబ్రెయిన్, శతాబ్ది రాయ్, మహువా మొయిత్రా, కీర్తి ఆజాద్‌తో పాటు మరికొంతమంది నిరసనలు చేపట్టారు. అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేయటం మొదలెట్టారు. పోలీసులు రంగంలోకి దిగి వారిని అక్కడి నుంచి పంపించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులు, ఎంపీలకు మధ్య తోపులాట జరిగింది. పోలీసులు అతి కష్టం మీద వారిని అక్కడి నుంచి పార్లమెంట్ స్ట్రీట్ పీఎస్‌కు తరలించారు. రాజకీయ కన్సల్టెన్సీ సంస్థ ఐప్యాక్ చీఫ్ ప్రతీక్ జైన్ నివాసంలో గురువారం ఈడీ సోదాలు నిర్వహించింది. కోల్‌కతాలోని ఆయన నివాసంలో ఈడీ సోదాలు జరుగుతున్న సమయంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అక్కడకు చేరుకున్నారు. ఈడీ తీరును ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. ఈ సందర్భంగా మమతా మీడియాతో మాట్లాడుతూ.. 'మా ఐటీ సెల్ చీఫ్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. మా పార్టీకి సంబంధించిన దస్త్రాలు, హార్డ్ డిస్క్‌లను స్వాధీనం చేసుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి మా పార్టీ అభ్యర్థుల వివరాలు వాటిలో ఉన్నాయి. వాటిని వెనక్కు తీసుకున్నారని అన్నారు. మా పార్టీకి సంబంధించిన డాక్యుమెంట్లను ఈడీ తీసుకోవచ్చా? నేను ఇలాగే బీజేపీ ఆఫీసుకు వెళితే పరిస్థితి ఏమిటి? ఓటర్ జాబితా సమగ్ర సవరణ పేరిట ఇప్పటికే 5 లక్షల మంది పేర్లను తొలగించారు. కేవలం ఎన్నికలు జరగనున్నాయనే ఇలా చేస్తున్నారు'.. అంటూ మండిపడ్డారు. కాగా, కేంద్రం రాజకీయ లబ్ది కోసం ఈడీని అస్త్రంగా వాడుతోందని టీఎంసీ పార్టీ నేతలు అంటున్నారు. ఈ మేరకు సోషల్ మీడియా వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు సైతం పెడుతున్నారు.

## ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగస్వామ్యం కండి

**- మెరుగైన ఆరోగ్య సేవలు, నాణ్యమైన వైద్యం మా లక్ష్యం**

**- వైద్యారోగ్య శాఖ అధికారుల వర్క్‌షాపులో మంత్రి సత్యకుమార్**

**విజయవాడ,జనవరి 9( వెలుతురు):**



ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో అందరూ భాగస్వామ్యం కావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఏపీ వ్యాప్తంగా అన్ని ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లు, బోధనాస్పత్రుల ప్రిన్సిపాళ్లతో మంత్రి.. ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు కీలక సూచనలు చేశారు. మెరుగైన ఆరోగ్య సేవలు, నాణ్యమైన వైద్య, విద్య అందించాలని దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో వైద్య రంగంలో ప్రతికూలతలు ఎదుర్కొంటూనే సేవలందించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఓపీ, ఐపీ, ఇతర సేవలు గతంతో పోలిస్తే 12శాతం పెరిగాయని చెప్పుకొచ్చారు. రోగులు అధిక శాతం ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చేలా చేయగలిగామని వ్యాఖ్యానించారు. డాక్టర్లు, మందులు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారని తెలిపారు. కింది స్థాయిలో 28శాతం అవినీతి ఉందని తెలుస్తోందన్నారు. పారిశుధ్యంలో ఇంకా మార్పు రావాల్సి ఉందని తెలిపారు. బోధనాస్పత్రుల్లో అనుమతించిన బెడ్లు 500 వరకూ ఉంటున్నాయని వివరించారు. ఆస్పత్రుల్లో రోగులకు సరిపడా మంచాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆస్పత్రుల్లో మార్పులు రావాల్సి ఉందని చెప్పుకొచ్చారు. వాట్సాప్ గవర్నెన్స్‌లో వైద్య సేవలు అందుబాటులోకి రావాల్సి ఉందని తెలిపారు. ఎబిహెచ్ఎ యాప్ ఐడీ జనరేట్ చేసేలా చూడాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు. చాలాచోట్ల ఎఫ్ఎంఓలు లేకపోవడం ప్రధాన అంశంగా కనిపిస్తోందని అన్నారు. సూపరింటెండెంట్‌లు, అడ్మినిస్ట్రేషన్ మధ్యలో సరైన కోఆర్డినేషన్ ఉండట్లేదని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. అనంతపురంలోని ఆస్పత్రుల్లో చాలా అంశాల్లో లోపాలు తన దృష్టికి వస్తుంటాయని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో సూపరింటెండెంట్‌లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రిడిక్టివ్, ప్రివెంటివ్ వెల్‌నెస్ వైపు ప్రభుత్వ వైద్యులు అందరూ ఆలోచించాలని కోరారు. ఆరు నెలలు సెకండరీ ఆస్పత్రుల్లో, ఆరు నెలలు బోధన ఆసుపత్రుల్లో పని చేయాలని ఆదేశాలు జారీ చేశారు. సొంతూళ్లలో పని చేయాలని చూసేవారు అటెండెన్స్ తప్పించుకోవాలని చూస్తున్నారని అన్నారు. కొత్త బోధనాస్పత్రులకు ఇంకా నిర్మాణమే మొదలవలేదని చెప్పుకొచ్చారు. ÷ఎఎఓ÷ూని సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్సీగా చేయాలంటే రూ.1000 కోట్లు కావాలని అన్నారు. గత జగన్ ప్రభుత్వంలో అభివృద్ధి పనులు ఏమీ చేయలేదని.. ఇవాళ అన్నీ కావాలంటే కొంత సమయం పడుతుందని తెలిపారు. 2047 నాటికి వికసిత భారత్ సాధించాలంటే ప్రధాన భూమిక డాక్టర్లదేనని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. మూడు నెలల్లో ఆస్పత్రుల పరిస్థితి మారాల్సి ఉందని ఏపీ వైద్య ఆరోగ్య శాఖ సెక్రెటరీ సౌరభ్ గౌర్ సూచించారు. ఆరు నెలల్లో అత్యుత్తమ ఆస్పత్రులుగా మారాలని పేర్కొన్నారు. సంజీవనిలో పౌరులకు ఇచ్చే సేవలు తెలియాలని చెప్పుకొచ్చారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు లక్షకు పైగా రోగులు వస్తారని అన్నారు. ఆక్సిజన్ సప్లై, ఇతర సదుపాయాలు ప్రైవేటు సెక్టార్ నుంచి వినియోగిస్తున్నామని తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ విషయంలోనూ ప్రైవేటు ఆస్పత్రులు పని చేస్తున్నాయని వివరించారు. ఏపీ వ్యాప్తంగా మొత్తం ఆస్పత్రుల్లో ఇప్పటి వరకూ.. 144శాతం ఔట్ పేషెంట్ సేవలు అందించామని చెప్పారు. ఈ నెలాఖరులోగా అన్ని రకాల స్థాయిల్లోని ఉద్యోగులకు ప్రొమోషన్లు కల్పిస్తామని చెప్పుకొచ్చారు. 140శాతం సర్జరీలు మన ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరిగాయని వివరించారు. పిల్లల డెలివరీలు అన్ని ఆస్పత్రుల్లో పెంచాల్సి ఉందని తెలిపారు. ఎబిహెచ్ఎ యాప్ పూర్తి స్థాయిలో డౌన్ లోడ్ అయ్యేలా చూడాలని సూచించారు. ఇప్పటి వరకూ 96శాతం మంది యాప్‌ను డౌన్‌లోడ్ చేశారని వెల్లడించారు. మరమ్మతులు చేయాల్సిన పరికరాలను వెంటనే చేయించాలని చెప్పుకొచ్చారు. నెల రోజుల్లో అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని అన్నారు. పారిశుధ్యం, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్, వీల్ చైర్లు, స్ట్రెచర్లు, పడకలు.. అన్నీ మారాలని సౌరభ్ గౌర్ సూచించారు.

## ప్రశాంతంగా ముగిసిన ఉత్తర ద్వార దర్శనం

**- దర్శనాలపై దాదాపు 93 శాతం భక్తులు సంతృప్తి**

**- స్వామివారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య 7.83 లక్షలు**

**- శ్రీవారి హుండీ ఆదాయం రూ.41.14 కోట్లు రాక**

**- మీడియా సమావేశంలో టిటిడి ఛైర్మన్, ఇవోలు వెల్లడి**

**తిరుమల,జనవరి9( వెలుతురు):**



వైకుంఠ ఏకాదశి సందర్భంగా డిసెంబర్ 30 నుండి జనవరి 8వ తేది వరకు నిర్వహించిన వైకుంఠ ద్వార దర్శనాలకు టీటీడీ చేసిన ఏర్పాట్లపై భక్తులు విశేష సంతృప్తి వ్యక్తం చేసినట్లు టీటీడీ ఛైర్మన్ బీ.ఆర్.నాయుడు తెలియజేశారు. వైకుంఠ ద్వార దర్శనాలు విజయవంతం కావడంతో ఆయన టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరిలతో కలిసి తిరుమలలోని అన్నమయ్య భవన్ లో శుక్రవారం ఉదయం మీడియా సమావేశం నిర్వహించారు. స్వామివారి దర్శనానికి విచ్చేసిన భక్తులందరూ కూడా టీటీడీ కల్పించిన సౌకర్యాలు అద్భుతంగా ఉన్నాయని ఆనందం వ్యక్తం చేశారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఏఐ సహకారంతో ఎప్పటికప్పుడు భక్తుల రద్దీని పర్యవేక్షిస్తూ గతంలో ఎన్నడూ లేని విధంగా టోకెన్ లేని భక్తులకు కూడా వేగవంతంగా దర్శనం చేయించామని అన్నారు. వైకుంఠ ద్వార దర్శనాలపై దాదాపు 93 శాతం మంది భక్తులు సంతృప్తి చెందారని అన్నారు. ఈ పది రోజుల్లో స్వామివారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య 7.83 లక్షలు అన్నారు. గత వైకుంఠ ద్వార దర్శనాల్లో 6.83 లక్షల మంది దర్శించుకోగా ఈ ఏడాది లక్ష మంది భక్తులకు అదనంగా దర్శనాలు జరిగాయన్నారు. జనవరి 2వ తేది శుక్రవారం రోజు అయినప్పటికీ రికార్డు స్థాయిలో 83 వేల మంది భక్తులకు దర్శనం కల్పించామని అన్నారు. జనవరి 3వ తేది శనివారం అత్యధికంగా దాదాపు 89 వేల మందికి దర్శనం జరిగిందన్నారు. అందుబాటులో ఉన్న 182 గంటల దర్శన సమయంలో 164 గంటల సమయం సామాన్య భక్తులకు కేటాయించడంతో సామాన్య భక్తుల్లో ఆనందం కలిగిందన్నారు. పది రోజుల్లో శ్రీవారి హుండీ ఆదాయం రూ.41.14 కోట్లుగా తెలిపారు. భక్తులకు విక్రయించిన శ్రీవారి లడ్డూల సంఖ్య 44 లక్షలు అన్నారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది 10 లక్షల లడ్డూలు అదనంగా విక్రయం జరిగిందన్నారు. దాదాపు 2400 మంది పోలీసులు, 1150 మంది విజిలెన్స్ సిబ్బందితో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని అన్నారు. వివిధ విభాగాల సమన్వయంతో ఇంటిగ్రేటెడ్ ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఎప్పటికప్పుడు భక్తుల రద్దీని ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నట్లు వారు వెల్లడించారు. తిరుమల, తిరుపతిలో 5 భాషల్లో భక్తులకు అర్థమయ్యేలా 400 ప్రచార బోర్డులు ఏర్పాటు. రేడియో బ్రాడ్ కాస్టింగ్ ద్వారా 5 భాషల్లో వైకుంఠ ద్వార దర్శనాలపై అవగాహన కల్పించామని అన్నారు. తిరుమలలో విద్యుత్ దీపాలంకరణపై భక్తులు విశేష ప్రశంస వచ్చిందన్నారు. తిరుమలలో టీటీడీ విజిలెన్స్, పోలీసులు సమన్వయంతో భక్తులకు ఇబ్బంది కలగకుండా బ్యారికేడ్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తిరుమలలో నీటి కొరత లేకుండా నిరంతరాయం భక్తులకు నీటి సరఫరా చేశామని అన్నారు. ఈ పది రోజుల్లో 33 లక్షల మంది భక్తులకు అన్న ప్రసాదాల పంపిణీ జరిగిందన్నారు. గత వైకుంఠ ద్వార దర్శనాలతో పోల్చితే ఈసారి 9.29 లక్షల మంది భక్తులకు అదనంగా అన్న ప్రసాదాలు పంపిణీ చేశామని అన్నారు. తొలి మూడు రోజులు టోకెన్ కలిగిన భక్తులకే దర్శనం కల్పించడం జరిగిందన్నారు. దర్శన క్యూ లైన్లు, రోడ్లు, మరుగుదొడ్ల వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా పారిశుధ్య సిబ్బంది ద్వారా ఎప్పటికప్పుడు చెత్తను తొలగిస్తూ పరిశుభ్రతకు పెద్దపీట వేశామన్నారు. ఈ సందర్భంగా టీటీడీ యంత్రాంగంతో సమన్వయం చేసుకుని చక్కటి సేవలు అందించిన పోలీస్ యంత్రాంగం, జిల్లా యంత్రాంగం, ఏపీఎస్ ఆర్టీసీ, శ్రీవారి సేవకులు, ఇతర విభాగాలు, మీడియా ప్రతినిధులకు ఛైర్మన్ ధన్యవాదాలు తెలియజేశారు.టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ మాట్లాడుతూ తిరుమలలోనే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న టీటీడీ అనుబంధ ఆలయాల్లో కూడా గతంలో కంటే అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారని చెప్పారు. గత వైకుంఠ ఏకాదశి రోజు 7 లక్షలకు పైగా దర్శించుకుంటే ఈసారి 12 లక్షలకు పైగా భక్తులు దర్శించుకున్నారని తెలిపారు. టీటీడీ భక్తుల కోసం చేస్తున్న సౌకర్యాలను చూసి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేస్తున్నారని చెప్పారు. అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి మాట్లాడుతూ వివిధ విభాగాల మధ్య సమన్వయంతో సమయాన్ని సరైన విధంగా వినియోగించుకోవడంతో అనుకున్న దానికన్నా అదనంగా దర్శన సమయం సమకూరడంతో మరింత మంది భక్తులకు సౌకర్యవంతంగా దర్శనం చేయించేందుకు అవకాశం ఏర్పడిందని తెలిపారు. ఈ సమావేశంలో టీటీడీ బోర్డు సభ్యులు నరేష్, శాంతారామ్, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా బరిగేల వారి నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవం...





**వెలుతురు, హైదరాబాద్ జనవరి 09 :** నల్గొండ జిల్లా, డిండి మండలం బొగ్గులదోన గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బరిగేల శ్రీను – మౌనిక దంపతుల కుమార్తె లక్ష్మ ప్రసన్న (చక్కని), కుమారుడు కృష్ణ ప్రసాద్ (నాన్ని) నూతన పట్టువస్త్రాలంకరణ మ హోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహిం చారు. బొగ్గులదోన గ్రామంలోని వారి నివా సంలో జరిగిన ఈ వేడుకకు బొగ్గులదోన గ్రామ సర్పంచ్ బుద్ధుల శ్రీవాణి శ్రీను, ఉప సర్పంచ్ ఆర్కపల్లి మమత ఈదమయ్య, 5వ వార్డు సభ్యులు శోభా శ్రీధర్, సీనియ ర్ జర్నలిస్ట్ మల్లెపాకుల పరుశురాం, నా యకులు బి.వెంకటయ్య, శేఖర్, హుస్సేన్, ఎల్లయ్య, కృష్ణయ్య, వీరస్వామి, ఆంజనేయులు, రమే ష్, కార్తీక్, వినయ్, యువ నాయకులు, ఉద్యోగస్తులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్త లు, అభిమానులు, బంధుమిత్రులు పెద్ద ఎత్తున హాజరై చి న్నారులను ఆశీర్వదిం చారు. ఈ వేడుక లో గ్రామ నాయకులు, యువత బరిగేల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, బంధు వులు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**





**వనపర్తి, వెలుతురు ప్రతినిధి జనవరి 09:**
విద్యాలయాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం వనపర్తి పట్టణం మర్రికుంటలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూమ్ లో నిల్వ ఉన్న ఆహార పదార్థాలు, మంచి నూనే, కూరగాయల నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. స్టాక్ వచ్చినప్పుడు విద్యార్థులకు ఆహార పదార్థాల నాణ్యత, గడువు పరిలనకు పెట్టీ రిజిస్టరులో విద్యార్థుల సంతకాలు తీసుకోవాలని ఆదేశించారు. వంటగదిని పరిశీలించిన కలెక్టర్ భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యాలయాల్లో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టీ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జిల్లా విద్యా అధికారి అబ్దుల్ ఘని, పాఠశాల ఉపాధ్యాయులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# హిమాయత్ నగర్ డివిజన్ యూత్ కాంగ్రెస్ సమావేశం

**- రాబోయే మున్సిపల్ ఎన్నికల కోసం సమావేశంలో కాంగ్రెస్ శ్రేణులకు దిశా నిర్దేశం**



**హైదరాబాద్ వెలుతురు జనవరి 09:**
హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మ రామన్ గౌడ్ కార్యాలయంలో శుక్రవారం రోజున హిమాయత్ నగర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అఖిల్ అహ్మద్ అధ్యక్షతన హిమాయత్ నగర్ డివిజన్ యూత్ కాంగ్రెస్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి. రామన్ గౌడ్, ఖైరతాబాద్ యూత్ డిస్టిక్ అధ్యక్షుడు కే హరిధర్, ఖైరతాబాద్ యూత్ కాంగ్రెస్ ఇంచార్జ్ శశాంక్, పరమేష్ యాదవ్ ఖైరతాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు , సోషల్ మీడియా కోఆర్డినేటర్ జస్వంత్ రావు, శ్రవణ్ డివిజన్ యూత్ కార్గేస్ ఉపాధ్యక్షుడు, డివిజన్ యూత్ కాంగ్రెస్ కార్యదర్శి శ్యామ్ మరియు ఇతర యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు యూత్ కాంగ్రెస్ నాయకులకు దిశా నిర్దేశం చేసి రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అందరు కలిసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు.

# GHMC శేరిలింగంపల్లి జోన్ జోనల్ కమిషనర్‌ను కలిసిన కాట సుధాశ్రీనివాస్ గౌడ్



**శేరిలింగంపల్లి వెలుతురు జనవరి 09:**
GHMC శేరిలింగంపల్లి జోన్ జోనల్ కమిషనర్ గారిని సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధాశ్రీనివాస్ గౌడ్ గారు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ గారిని శాలువాతో సన్మానించి, 270-బీరంగూడ, 271-అమీన్‌పూర్ డివిజన్ల పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను కమిషనర్ గారి దృష్టికి తీసుకెళ్లారు. రోడ్ల అభివృద్ధి, డ్రైనేజ్ సమస్యలు, త్రాగునీటి సరఫరా, వర్షపు నీటి నిర్వహణ, చెరువుల అభివృద్ధి వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని కమిషనర్ గారికి అందజేశారు.

# ఉన్నత విద్యతోపాటు క్రీడలపై దృష్టి సారించాలి

**- క్రీడలపర్తి వనపర్తికి జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకురావాలి**
**- సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభించిన వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, స్పోర్ట్స్ అథరిటీ చైర్మన్ శివసేన రెడ్డి**








**వనపర్తి, వెలుతురు ప్రతినిధి జనవరి 09:**
జనవరి, 17 నుండి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న సి.యం. కప్ 2వ ఎడిషన్ క్రీడలకు సంబంధించి శుక్రవారం వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానం లో స్థానిక శాసన సభ్యులు, రాష్ట్ర స్పోర్ట్స్ అథరిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ క్రీడా జ్యోతిని వెలిగించి కొత్త బస్టాండ్ మీదుగా జరిగే ర్యాలీ ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని క్రీడాకారులకు అవసరమైన అన్ని వసతులతో పాటు ప్రతిభావంతులైన క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించే విధంగా సహకారం అందిస్తామని అన్నారు. క్రీడాకారులకు స్ఫూర్తినిచ్చేందుకు పులి, జింక గురించి వివరించారు. జింక కంటే పులి తక్కువ వేగంతో పరిగెడుతుందని కానీ జింకను ఎలాగైనా పట్టుకోవాలనే పట్టుదలతో ఉంటుందని అదే జింక ఎక్కడ నేను దొరికిపోతానో అనే భయంతో పరిగెడుతూ పులికి దొరికిపోతుందన్నారు. క్రీడాకారులు సైతం గెలవాలి అనే ఏకైక సంకల్పంతో పోటీ పడాలని ఉద్బోధించారు. విద్యార్థులు ఇతరత్రా వ్యాపకాల మీద కాకుండా చదువు, క్రీడల పై మాత్రమే దృష్టి పెట్టాలని సూచించారు. వనపర్తి జిల్లాకు క్రీడాపర్తి అని సైతం పేరుందని, వనపర్తి జిల్లా నుండి ఎంతో మంది క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించారని గుర్తు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి ప్రభుత్వ బాలుర పాఠశాలలో చదువుకొని, ఇదే మైదానంలో ఫుట్ బాల్ ఆడారని ఇదే మైదానంలో ఆడుతున్న క్రీడాకారులు స్ఫూర్తిని పొందాలని సూచించారు. వనపర్తి జిల్లాలో క్రీడల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. సర్వే నెంబర్ 55 లో 25 ఎకరాల స్థలంలో స్పోర్ట్స్ స్కూల్ కు కేటాయించడం జరిగిందని, హాకీ గ్రీన్ టార్పెట్, స్విమ్మింగ్ పూల్, క్రికెట్ స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. 2032 లో భారత దేశానికి వచ్చే గోల్డ్ కప్ లలో ఒకటి వనపర్తి జిల్లా నుండి కొట్టి ఉండాలని .. వనపర్తి క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షంచారు. గ్రామస్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను వెలికి తీసి అకాడమీలో చేర్పించి నైపుణ్య శిక్షణ ఇచ్చి జాతీయ స్థాయిలో రాణించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో ఒక క్రీడా మైదానం ఏర్పాటు చేసి అవసరమైన క్రీడా సామాగ్రి అందుబాటులో ఉంచే విధంగా ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు క్రీడలకు రాష్ట్రంలో 840 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలోవనపర్తి మార్కెట్ కమిటి చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, జిల్లా యువజన క్రీడల అధికారి సుధీర్ కుమార్ రెడ్డి, డి.ఈ.ఓ అబ్దుల్ ఘని, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి అంజయ్య, డీఎస్పీ వెంకటేశ్వర రావు, తహసిల్దార్ రమేష్ రెడ్డి, ఎస్.జి.ఎఫ్ సెక్రటరీ పొలమోని కుమార్, పిడి లు, పి. ఈ టి లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఓటర్ లిస్ట్ అభ్యంతరాలు పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి, వెలుతురు ప్రతినిధి జనవరి 09:**





జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఓటర్ జాబితాపై వచ్చిన అభ్యంతరాల్ని పరిష్కరించి ఈ నెల 12 వ తేదీన వార్డు వారీగా తుది ఓటర్ జాబితా ప్రచురించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ మునిసిపల్ ఎన్నికల కార్యాచరణ సంసిద్ధత గురించి మునిసిపల్ కమీషనర్లు, తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో ఓటర్ జాబితాపై వచ్చిన అభ్యంతరాల్ని పరిష్కరించి ఈ నెల 12 వ తేదీన వార్డు వారీగా ఫోటోలతో కూడిన తుది ఓటర్ జాబితా ప్రచురించాలని ఆదేశించారు. అదేవిధంగా ఈనెల 16వ తేదీన పోలింగ్ కేంద్రం వారీగా తుది ఓటర్ జాబితా ప్రదర్శించాలని సూచించారు. ఓటర్ల వార్డు మ్యాపింగ్ సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే సరిచేయాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంత ఓటర్లు ఎవరైనా ఓటర్ జాబితాలో నమోదయి ఉంటే వారిని అన్ మ్యాప్ చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో అధికారులు అత్యంత పారదర్శకంగా పనిచేయాలని సూచించారు. ఆయా మున్సిపాలిటీలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను గుర్తించి అన్ని సౌకర్యాలు కల్పించేలా సిద్ధం చేయాలన్నారు. అదేవిధంగా డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్, కౌంటింగ్ కేంద్రాలకు సంబంధించి కావలసిన ప్రాంతాలను, భవనాలను గుర్తించి సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఆయా కేంద్రాల్లో సకల సౌకర్యాలు ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ప్రతి ఒక్క కేంద్రం గ్రౌండ్ ఫ్లోర్ లోనే ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఈ విధంగా మున్సిపల్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసి సంసిద్ధంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# "ఆరోగ్యమే మహాభాగ్యం - చదువుతో పాటు క్రీడలపై దృష్టి పెట్టాలి"

**- కోహీర్‌లో ఘనంగా చీఫ్ మినిస్టర్ కప్ 2025-26 ప్రమోషన్ ర్యాలీ...**



**జహీరాబాద్ వెలుతురు జనవరి 09:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం కోహీర్ మండలంలో చీఫ్ మినిస్టర్ (సీఎం) కప్ 2025-26 రెండవ ఎడిషన్ ప్రమోషన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీస్ నుంచి మండల ఎడ్యుకేషనల్ ఆఫీస్ వరకు భారీ ర్యాలీలో పాల్గొన్నారు. మండల విద్యాశాఖ అధికారి మహ్మద్ జాకీర్ హుస్సేన్ ర్యాలీ ముగింపులో "ఆరోగ్యం మహాభాగ్యం. చదువుతో పాటు క్రీడలపై దృష్టి పెట్టి, శరీరాన్ని, మనస్సుని ఆరోగ్యంగా ఉంచుకోవాలి" అని విద్యార్థులను ప్రేరేపించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ భారతి మాట్లాడుతూ, చీఫ్ మినిస్టర్ కప్ 2025-26 పోటీలు గ్రామ పంచాయతీ స్థాయి జనవరి 17 నుండి 22 వరకు, ?మండల స్థాయి జనవరి 28 నుండి 31 వరకు, ?అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి ఫిబ్రవరి 3 నుండి 7 వరకు, ?జిల్లా స్థాయి ఫిబ్రవరి 10 నుండి 14 వరకు, ?రాష్ట్ర స్థాయి ఫిబ్రవరి 19 నుండి 26 వరకు నిర్వహించబడతాయని వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకట్ రెడ్డి, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ నాథ్, రవి కుమార్, శ్రీనివాస్, ఇఫ్తికార్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ జలయ్య, ఎం.ఏ. ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వానికి నిదర్శనం

## మైనంపల్లి హనుమంత్ రావ్ బర్త్‌డే సందర్భంగా రక్తదానం





**మౌలాలి, జనవరి 9 వెలుతురు:**
మైనంపల్లి హనుమంత్ రావ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మౌలాలి చౌరస్తాలో రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం గత మూడేళ్లుగా ఆయన పుట్టినరోజు సందర్భంగా నిరంతరంగా నిర్వహించడం విశేషం. ఈ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా మైనంపల్లి వాణి హాజరై కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రక్తదానం చేసిన దాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రక్తదానం చేయడం ద్వారా అనేక ప్రాణాలను కాపాడవచ్చని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఇన్‌చార్జ్ లక్ష్మకాంత్ రెడ్డి, బి-బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, బి-బ్లాక్ వర్కింగ్ ప్రెసిడెంట్ బీకే శీను, డివిజన్ అధ్యక్షుడు పోతుల వినోద్ యాదవ్, కంటెస్టెడ్ కార్పొరేటర్ పోతుల ఉమామహేశ్వరి వినోద్ యాదవ్ పాల్గొన్నారు. అలాగే డివిజన్ సీనియర్ నాయకులు అరుణ్ గౌడ్, వెంకటేష్, అమిత్, ప్రతాప్ రెడ్డి, చెంకు శ్రీనివాస్, గద్దం సత్తి, చంద్రకాంత్, నర్సింగ్ రావు, భీమ్రాజ్, కృష్ణ, ముహమ్మద్ ముక్తార్, అన్ను, షకీల్, చరణ్, ప్రేమ్, ఇర్ఫాన్, బాకర్, పాండురంగ చారి, నాగార్జున నాయుడు పాల్గొన్నారు. మహిళా నాయకురాలు భాగ్యరాణి, మైముదా, అనిత, జాన్వి, సునీత, పద్మ, పద్మావతి, కాసింబి, యూత్ కాంగ్రెస్ నాయకులు అజయ్, చరణ్, లడ్డు, బన్నీ, అక్కి, నిఖిల్, సాయి, నాని, అరవింద్, నవీన్, నరసింహ, శివా, తనీష్, హనీష్, రిషి, పవన్ తదితరులు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# చైనా మంజా తగిలి బాలుడికి తీవ్ర గాయాలు

**జగిత్యాల,జనవరి9( వెలుతురు):**
చైనా మాంజా తగిలి బాలుడికి తీవ్ర గాయాలైన ఘటన మెట్‌పల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని దుబ్బవాడలో శ్రీహాస్ గురువారం సాయంత్రం ఇంటిముందు ఆడుకుంటున్నాడు. ఇంతలో చైనా మాంజా వచ్చి మెడకు చుట్టుకోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే మెట్‌పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెడ భాగంలో తీవ్రంగా కోసుకుపోవడంతో ప్రాథమిక చికిత్స అనంతరం బాలుడిని నిజామాబాద్‌కు తరలించారు. అక్కడ బాలుడు చికిత్స పొందుతున్నాడు. మెడ చుట్టు సుమారు 20 కుట్లు వేసినట్లు సమాచారం.

# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

**- విద్యార్థులకు అవగాహన కార్యక్రమం**

**జహీరాబాద్ వెలుతురు జనవరి 09:**
రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న వయస్సు నుంచే రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించుకోవడం ఎంతో అవసరమని అధికారులు పేర్కొన్నారు. రోడ్డు భద్రతా మాసం సందర్భంగా గురువారం కోహిర్ మండలం కవేలి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రహదారి భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోహిర్ ఎస్ఐ నరేష్ పాల్గొని మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు, నిర్లక్ష్య డ్రైవింగ్, అధిక వేగంతో నడపడం, హెల్మెట్, సీట్ బెల్ట్ వాడకపోవడం వంటి అంశాలను విద్యార్థులకు



వివరించారు. ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటిస్తే ప్రమాదాలను చాలా వరకు నివారించవచ్చని సూచించారు. డెక్కన్ టోల్ ప్లాజా సేఫ్టీ మేనేజర్ నాగరాజు మాట్లాడుతూ, రోడ్డు మీద నడిచేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాదచారులు పాటించాల్సిన నియమాలు, జీబ్రా క్రాసింగ్ వినియోగం, రాత్రివేళల్లో రిఫ్లెక్టర్ల ప్రాముఖ్యత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతపై విద్యార్థులు నేర్చుకున్న విషయాలను తమ కుటుంబ సభ్యులకు, గ్రామస్తులకు తెలియ జేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రెసిడెన్షియల్ పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, డెక్కన్ టోల్ ప్లాజా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## స్టేట్ ఫస్ట్ సాధించిన క్రిష్ణవేణి విద్యార్థి శరణ్ తేజ్

**రామన్నపేట వెలుతురు జనవరి 09:**



కామారెడ్డిలో గత మూడు రోజులుగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫేర్ లో మండల కేంద్రంలోని క్రిష్ణవేణి టాలెంట్ విద్యార్థి వి.శరణ్ తేజ్ తన అత్యుత్తమ విజ్ఞాన ప్రదర్శన తో రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతి సాధించినట్లు పాఠశాల కరెస్పాండెంట్ గంగుల నరేందర్ రెడ్డి తెలిపారు. గ్రీన్ ఎనర్జీ జూనియర్ విభాగంలో శరణ్ తేజ్ చేసిన ప్రదర్శన అందరినీ విశేషంగా ఆకట్టుకొని రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతి పొందిన శరణ్ తేజ్ ను, గైడ్ టీచర్ పి.మురళి ని కామారెడ్డి ఎమ్మెల్యే కె. వెంకట రమణ రెడ్డి తో పాటు పలువురు రాష్ట్ర స్థాయి నేతలు, అధికారులు అభినందించి బహుమతి అందజేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర స్థాయి ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థి శరణ్ తేజ్ ను పాఠశాల ప్రిన్సిపాల్ బి. యాదగిరి, అకాడమిక్ డైరెక్టర్ జె. మణి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

## బీసీ రిజర్వేషన్లు పెంచాకే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలి

**- మున్సిపల్ ఎన్నికల్లో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు లేకుంటే బీసీలకు అన్యాయమే - లింగంగౌడ్**



**మిర్యాలగూడ వెలుతురు జనవరి 09:**
స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికలకు వెళతామని అనడం బీసీ లకు అన్యాయం చేయడమేనని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే ఎన్నికలు నిర్వహించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సర్పంచ్ ఎన్నికల్లో కూడా బీసీలకు అన్యాయం జరిగిందని మున్సిపల్ ఎన్నికల్లో పెద్ద ఎత్తున డబ్బు ప్రభావం ఉంటుశీది కనుక బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తేనే ఎక్కువ మంది కౌన్సిలర్లు మరియు చైర్మన్లు అయ్యే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు ఎర్రబెల్లి దుర్గయ్య గుండెబోయిన నాగేశ్వరరావు యాదవ్ బంటు సైదులు ధోనేటి శేఖర్ శ్రీనివాస్ మహేష్ తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా సంక్రాంతి సంబురాలు



**తిరుమలగిరి (సాగర్) వెలుతురు( న్యూస్) జనవరి 9:**
తిరుమలగిరి సాగర్ మండల పరిధిలోని రంగుండ్ల తండ ప్రాథమికోన్నత పాఠశాల నందు ప్రధానోపాధ్యాయులు చింతరెడ్డి భాస్కర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబురాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా 7వ తరగతి విద్యార్థి ఆంగోతు ఈశ్వర్ హరిదాసు పాత్రతో అందరిని అలరించడం జరిగింది. అమ్మాయిలతో పాటు అబ్బాయిలు కూడా ముగ్గుల పోటీలో పాల్గొని విజేతలుగా నిలిచారని అనంతరం బోగి మంటలు వేసి, గాలి పటాలు ఎగురవేసి పిల్లలు ఆనందించారని సూర్య గమనం ప్రకారం జరుపుకునే పండుగ సంక్రాంతి అని దాని విశిష్టతను తెలుసుకున్నారని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేందర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రజిత, వెంకటరమణ, విజిత, చైతన్య, రాజేష్, విద్యార్థులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## మునుగోడు నియోజకవర్గంలో ఇంటర్మీడియట్ కళాశాలలు ఏర్పాటు చేయాలి

**- ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ కి రిప్రజెంటేషన్ ఇచ్చిన మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**



**హైదరాబాద్ వెలుతురు జనవరి 09:**
మునుగోడు నియోజకవర్గంలో ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలను ఏర్పాటు చేయాలంటూ హైదరాబాదులో ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య ని కలిశారు గౌరవ మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి నియోజకవర్గంలోని మునుగోడు, చండూరు, మర్రిగూడెం, ఘట్టుప్పల్ మండల కేంద్రాలలో ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలలు ఏర్పాటు చేయాలనీ ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య ను కలిశారు. మునుగోడు నియోజకవర్గం పూర్తిగా వెనుకబడిన నియోజకవర్గం అని మండలానికి ఇంటర్ కళశాల ఉంటే పేద విద్యార్థులు ఇక్కడే చదువుకునే అవకాశం ఉంటుందని వీలైనంత తొందరగా ఆయా మండల కేంద్రాలలో ప్రభుత్వ ఇంటర్ కళశాలల ను ఏర్పాటు చేయాలనీ కోరుతూ ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య కి రిప్రెజెంటేషన్ ఇచ్చారు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

## వివేకానంద పాఠశాలలో ఇంద్రజాల ప్రదర్శన

**రామన్నపేట వెలుతురు న్యూస్ జనవరి 09:**
స్థానిక మండల కేంద్రంలోని వివేకానందాస్ డివైన్ మోడల్ స్కూల్‌లో శుక్రవారం ప్రఖ్యాత ప్రసిద్ధ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ గ్రహీత, ప్రముఖ మెజీషియన్ రామకృష్ణ ద్వారా అద్భుతమైన ఇంద్రజాల ప్రదర్శన (మ్యాజిక్ షో) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులను, తల్లిదండ్రులను ఆకట్టుకునే విధంగా ఆనందోత్సాహాలతో ముంచెత్తారు. వివిధ రకాల ఇంద్రజాలాలతో పిల్లలు ఆశ్చర్యానికి గురై ఉత్సాహంతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రామకృష్ణ పిల్లల్లో మొబైల్ ఫోన్ వాడకం అధికం కావడం వల్ల చదువుపై శ్రద్ధ తగ్గుతున్న విషయాన్ని, సమర్థవంతంగా చదువుతూ మంచి మార్కులు సాధించే చిట్కాలను కూడా ప్రేరణాత్మక ప్రసంగంగా వివరించారు. ఈ కార్యక్రమం ఉద్దేశిస్తూ పాఠశాల వ్యవస్థాపకులు తిరుగుడు మల్లికార్జున్ మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో నూతన ఉత్సాహాన్ని రేకెత్తిస్తాయని,




ఆనందోత్సాహంతో మునిగిపోయిన విద్యార్థులు చదువుపట్ల మరింత శ్రద్ధ చూపగలరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అస్మా, నాగరాజు, సునీత, శాంతి, సుధారాణి, సరిత, అనిత, రాజేశ్వరి, ముత్యాల, సాయి, విద్యాసాగర్, పారిజాత, మమత, సింధు, మమత తదితర ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన కల్పించాలి

**- ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో జర్నలిస్టుల పాత్ర కీలకం**
**- వనపర్తి జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి**
**- జిల్లా ఎస్పీకి శుభాకాంక్షలు తెలిపిన టీయుడబ్ల్యూజే (ఐజేయు) నాయకులు**



**వనపర్తి వెలుతురు ప్రతినిధి జనవరి 09:**
యువత, విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడకుండా అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా ఎస్పీ సునీత రెడ్డి అన్నారు. శుక్రవారం టీయుడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో ఇటీవల వనపర్తి జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సునీతారెడ్డి ని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టు యూనియన్ నాయకులతో పలు అంశాలపై జిల్లా ఎస్పీ చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సునీత రెడ్డి మాట్లాడుతూ.. ఎడ్యుకేషన్ హబ్ గా ఉన్న వనపర్తి జిల్లాలో యువత చెడుదారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సమాజాన్ని, ప్రధానంగా యువత, విద్యార్థులను పట్టిపీడిస్తున్న గంజాయి, మాదక ద్రవ్యాలు కల్తీకల్లు, మద్యం తదితర మత్తు పదార్థాల బారిన పడకుండా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై , బాల్య వివాహాల నియంత్రణపై పోలీసు శాఖ ప్రధానంగా దృష్టి సారిస్తుందని చెప్పారు. నార్కోటిక్స్, డ్రగ్స్ వంటి వాటిపై తాను గతంలో పనిచేసిన ప్రాంతాల్లో ఉక్కు పాదం మోపడం జరిగిందని వివరించారు. సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్నాయని అలాంటి వాటి పట్ల మీడియా విరివిగా ప్రచారం చేసి అవగాహన కల్పించాలని కోరారు. బెట్టింగ్ యాప్స్ వల్ల ఎంతోమంది జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. జిల్లాలో నేర నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. యువత, విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడకుండా సామాజిక బాధ్యతగా ఆరోగ్య సమాజ నిర్మాణంలో జర్నలిస్టులు కీలకపాత్ర పోషించాలని సూచించారు. టీయుడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్ మాట్లాడుతూ.. గతంలో రోడ్డు ప్రమాదాల నివారణ పై అవగాహన కల్పించడంతో పాటు యూనియన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు హెల్మెట్లు పంపిణీ చేయడం జరిగిందని, అదేవిధంగా భవిష్యత్తులో తమ యూనియన్ ఆధ్వర్యంలో మదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని అందుకు పోలీస్ శాఖ సహకారం తీసుకుంటామని అన్నారు. పోలీస్ శాఖ, జర్నలిస్టులు సమన్వయంతో పనిచేస్తూ నేర రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ మెంబర్లు మల్యాల బాలస్వామి, ప్రశాంత్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ శ్రీనివాస్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాధవరావు, బి.రాజు, జిల్లా ఉపాధ్యక్షులు నాకొండ యాదవ్, గోపాల్, కోశాధికారి ద్వారపోగుమన్యం, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు ఆంజనేయులు సాగర్, నరసింహారాజు, నియోజకవర్గ అధ్యక్షుడు విజయ్, టౌన్ అధ్యక్షుడు అరుణ్, యూనియన్ జిల్లా నాయకులు వెంకట్ గౌడ్, లక్ష్మణ్ ,తిరుపతయ్య, ఫారూఖ్ పటేల్, ధనుష్, రంగస్వామి, సురేష్, అరుణ్, చిన్న రాజు తదితరులు పాల్గొన్నారు.

## యువకులకు వివేకానంద స్వామి జీవితం ఆదర్శం

**- సీనియర్ సివిల్ జడ్జ్ వి.రజని**






**వనపర్తి, వెలుతురు ప్రతినిధి జనవరి 09:**
యువకులకు వివేకానంద స్వామి జీవితం ఆదర్శం అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి. రజని అన్నారు. శుక్రవారం వనపర్తి జిల్లా నర్సింగాయపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జనవరి 12న నేషనల్ యూత్ డే సందర్భంగా మరియు జనవరి 11న హ్యూమన్ ట్రాఫికింగ్ డే సందర్భంగా యువత అందరూ స్వామి వివేకానందుల వారిని ఆదర్శంగా తీసుకోవాలని అలాగే మత్తు పదార్థాలు మరియు అక్రమ రవాణా బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి మాట్లాడుతూ యువకులు మాదకద్రవ్యాలకు మరియు మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఉన్నత లక్ష్యలను సాధించాలని కోరారు. ఉద్యోగాలు పొందడం కోసం మోసపూరితమైన సంస్థల వలలో చిక్కి విదేశాలలో బానిసలుగా మారవద్దని సూచించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలనపై ఉపన్యాస పోటీలను మరియు వ్యాసరచన పోటీలను నిర్వహించి బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రఘు, కళాశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి పాల్గొన్నారు.

## చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలకు అన్ని శాఖల అధికారులతో సమావేశం

**- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**
**- ఎమ్మెల్యే వేముల వీరేశం**





**నార్కట్ పల్లి వెలుతురు జనవరి 09 :**
నార్కెట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామంలోని శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవములు త్వరలో జరగనున్న సందర్భంగా స్వామి వారినీ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, డైయిరీ చెర్మన్ గుత్తా అమిత్ రెడ్డి ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, దేవస్థానం ఈఓ మోహన్ బాబు జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో కలిసి ఈనెల 23నుండి 30తారీకు వరకు జరగబోయే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను సమీక్షించిన ఎమ్మెల్యే వేముల వీరేశం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవముల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి. అని పలు శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలి. అని సూచించారు అలాగే 100 కోట్ల అంచనాలతో మాస్టర్ ప్లాన్ ఏర్పాటు చేశాం.. వచ్చే నెల ఫిబ్రవరి లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తాం. అని తెలిపారు .

### ఇంద్రపాలనగరం గ్రామంలో ఇరుముడి మహోత్సవం లో అన్నప్రసాదం చేసిన సర్పంచ్



**రామన్నపేట వెలుతురు న్యూస్ జనవరి 09:ం**
శ్రీ శ్రీ శ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వాముల ఇరుముడి మహోత్సవములో అయ్యప్ప స్వాములకు,భక్తులకు, సర్పంచ్ గర్దాస్ విక్రమ్ వారి కుటుంబసభ్యులు. అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో యువనాయకులు సింగణబోయిన గణేష్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులకు ఘన సన్మానం



**రామన్నపేట వెలుతురు న్యూస్ జనవరి 09:**
పట్టణ కేంద్రంలో మొన్న జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన సర్పంచ్ గరిక సత్యనారాయణ ఉప సర్పంచ్ మోటే రమేష్ వార్డు సభ్యులు మోటే మహేష్, బండ కవిత, లింగస్వామి, గొరిగే పారిజాత, శేఖర్ లను రామన్నపేట కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప గుడి ఆవరణ లో ఘనంగా సన్మానించినారు. ఈ కార్యక్రమంలో సిందం లింగయ్య, మిర్యాల మల్లేష్, మోటే మల్లేష్, ఎర్ర అంజయ్య, కడగంచి ఐలయ్య, బర్ల డేవిడ్,గోరిగే కృష్ణ, మల్గా లింగయ్య, మోటే రాములు, శీలం యాదయ్య, గొరిగే సోములు, చిన్నం రమేష్, మోటె బీరప్ప, వల్లూరి ఐలయ్య, మోటె నరసింహ, గొరిగే నర్సింహ, మోటే గోపాల్, బంగారి మొగులయ్య, కొండే వెంకటేష్, మోటే బోలేష్, బె డిద లింగస్వామి, బెడిద మల్లేష్, మిర్యాల బిక్షం, బర్ల స్వామి, మోటె క్రాంతి, తోటకూరి కృష్ణ, చిన్నం వేణు, మోటి అనిల్, మోటే మదన్, మోటే చక్రపాణి, మిరియాల లింగస్వామి, మోడీ లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## మరణించిన కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



**గుండాల (వెలుతురు) జనవరి 9**
యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సీతారాంపురం గ్రామంలో ఇటీవల మృతి చెందిన పాలడుగు రమేష్ కుటుంబానికి బీర్ల ఫౌండేషన్ తరపున 50 కేజీల బియ్యం ఆర్థిక సహాయంగా అందించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లిపెద్ది మమత సురేందర్ రెడ్డి 25 కిలోల బియ్యం ఆర్థిక సహాయం అందించిరు. ఈకార్యక్రమంలో సర్పంచ్ కాళీ పద్మ వెంకన్న, ఉప సర్పంచ్ మల్లెపాక నరేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు బోరెశీ వెంకట్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు మచ్చ శివారెడ్డి, వార్డ్ మెంబర్లు జోగు కిష్టయ్య, పాచిల్ల శ్రీను, మలిపెద్ది సుమతి, పాలడుగు పోచమ్మ, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మచ్చ మల్లరెడ్డి మొగిలి పాక రామ్ నరసయ్య, మొగిలిపాక భాస్కర్ జోగు కుమార్ దర్గా మల్లేష్ శేఖర్ రెడ్డి సోషల్ మీడియా పాలడుగు కృష్ణ, వేణు, నరేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతికి ఊరెళ్లేవారు జాగ్రత్తలు

**- పోలీసుల ముందస్తు హెచ్చరిక**



**హైదరాబాద్,జనవరి9( వెలుతురు):**
సంక్రాంతి తెలుగు ప్రజల పెద్దపండుగ అని, ముఖ్యంగా ఆంధ్రకు వెళ్లేవారు ఎక్కువగా ఉంటారని పోలీస్ అధికారులు అన్నారు. సంక్రాంతి సెలవులకు ఊరు వెళు_న్న వారు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఇంట్లో విలువైన వస్తువులు, ఆభరణాలు జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని సూచించారు. సీసీ కెమెరాలు కచ్చితంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. వాటికి విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలన్నారు. ఎవరైతే ఉరికి వెళ్తున్నారో చుట్టు పక్కల వారికి చెప్పాలని, సంబంధిత పోలీస్ స్టేషన్‌లో కూడా సమాచారం ఇవ్వాలన్నారు. ఈ ప్రాంతాల్లో ఎక్కువగా పెట్రోలింగ్ చేస్తామని తెలిపారు. నేరాల నియంత్రణకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దింపామని తెలిపారు. ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్‌తో పాటు అలారం కూడా ఏర్పాటు చేసుకోవాలన్నారు.

# కోహిర్‌లో ప్రజా భద్రత చర్యల కోసం డీఈ కార్యాలయానికి వినతిపత్రం



**జహీరాబాద్ వెలుతురు జనవరి 08:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం కోహిర్ పట్టణంలో ప్రజల భద్రతకు ముప్పుగా మారిన పాత ఇనుప విద్యుత్ స్తంభాలను తొలగించమని, అలాగే అన్ని ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచె ఏర్పాటు చేయమని కోరుతూ కోహిర్ పట్టణ బిఆర్ఎస్ వైస్ ప్రెసెంట్ మహమ్మద్ ఫిర్దోస్ సర్వర్ జహీరాబాద్ డీఈ కార్యాలయంలో సబ్ ఇంజినీర్ రాహుల్ కి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వినతిలో పాత ఇనుప విద్యుత్ స్తంభాలను తొలగించడం, అలాగే అన్ని ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయడం అంశాలు ప్రధానంగా పేర్కొన్నారు. పాత స్తంభాలు, రక్షణ లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు ప్రజలకు ప్రమాదాన్ని కలిగించగలవని ప్రత్యేకంగా గుర్తుచేశారు. అదేవిధంగా, కోహిర్ సబ్‌స్టేషన్‌లో మౌలిక వసతుల మెరుగుదల కోసం కొత్త భవనం నిర్మాణానికి కూడా ఆవశ్యకత ఉందని వినతిలో సూచించారు. ప్రజా భద్రత కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని మరియు సమస్యలను పరిష్కరించాలన్న ముఖ్యాంశాలను అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. ఈ ప్రయత్నం ద్వారా కోహిర్ పట్టణంలోని విద్యుత్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ భద్రత మరియు సమర్ధతను పెంచే దిశగా ముమ్మరమైన కృషి జరుగుతోందని పేర్కొన్నారు.

# స్థానిక ఎలక్షన్లో పోల్ చిట్టి పంచిన వారికీ డబ్బులు చెల్లించాలి

- బిఎల్‌ఓ లతో వెట్టిచాకి చేయిస్తున్న
- అధికారులు డబ్బులు ఇచ్చే విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్న ఎంపీడీవోలను సస్పెండ్ చేయాలి
- ఏఐటియుసి జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి చిరంజీవి



**వెలుతురు నారాయణఖేడ్ జనవరి 09 :**
సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ నియోజకవర్గంలో స్థానిక ఎన్నికల్లో బిఎల్ఓ గా పాయింట్ పర్సన్ గా అనేకమంది పనిచేసిన వారికి సంబంధించిన డబ్బులు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు బి ఎల్ ఓ పోల్ చిట్టీలు వంచిన వారికి డబ్బులు ఇవ్వాల్సింది ఉన్న ఎంపీడీవో నిర్లక్ష్యం పూర్తిగా కనబడుతుంది దీనివల్ల అనేకమంది ఇబ్బంది పడ్డారు కొందరి అంగన్వాడీ టీచర్లకు ఎలక్షన్ డ్యూటీ పడ్డ వారికి బిఎల్ఓ ఉన్నవారు పోల్ చిట్టీలు పంచి పోవాల్సిందని టార్చర్ కూడా చేయడం అనేది జరిగింది అవన్నీ తట్టుకోని వాళ్ళు పోల్చీటీలు కూడా పంచి అనేకమంది వారు ఎలక్షన్ డ్యూటీ కూడా చేయాల్సిన పరిస్థితి కూడా ఏర్పడ్డది అలాంటి పరిస్థితిలో పనిచేసిన వారికి డబ్బులు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. అనేక గ్రామాలలో పాయింట్ పర్సెంట్ గా విలేజ్లో పనిచేసిన వారికి సంబంధించిన డబ్బులు ఇవ్వకపోవడం బాధాకరం వారికి కూడా డబ్బులు ఇవ్వాలని అట్లనే గ్రామపంచాయతీ సిబ్బంది కూడా పనిచేశారు వారు ఎన్ని రోజులు చేశారు వారందరు కూడా డబ్బులు చెల్లించే విధంగా అధికారులు చూడాలని చెప్పేసి విజ్ఞప్తి చేశారు ఒకవేళ స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కూడా చేపడతామని హెచ్చరించారు తక్షణమే డబ్బులు చెల్లించాలన్నారు ఒకవేళ చెల్లించకుంటే సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

# సంక్రాతి రద్దీ ఒత్తిడి తగ్గించే యత్నం

- సజావుగా వాహనాల రాకపోకలు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన పోలీస్ యంత్రాంగం
- డ్రోన్ల తో నిరంతర పర్యవేక్షణ



**నల్లగొండ,జనవరి9( వెలుతురు):**
సంక్రాంతి సమీపిస్తున్న వేళ విజయవాడకు, ఇటు హైదరాబాద్‌కు రద్దీ పెరిగే అవకాశాలు ఉండడంతో అధికారులు తక్షణ చర్యలు తీసుకున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా మీదుగా హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు భారీ సంఖ్యలో వాహనాలు వెళ్లే అవకాశం ఉంది. టోల్ గేట్లు, జాతీయ రహదారిపై వంతెనల నిర్మాణం తదితరాలతో ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ముందస్తు ప్రణాళికలను రూపొందించారు. హైదరాబాద్ నుంచి గుంటూరు వెళ్లే వాహనాలను నార్కట్‌పల్లి వద్ద నల్గొండ, మిర్యాలగూడ, పిగుడురాళ్ల మీదుగా దారి మళ్లిస్తారు. రాజమండ్రి–విశాఖపట్నం: నకిరేకల్ మీదుగా అర్వపల్లి, మరిపెడ బంగ్లా, ఖమ్మం మీదుగా మళ్లిస్తారు. అక్కడ సమస్య ఉంటే టేకుమట్ల నుంచి ఖమ్మం జాతీయరహదారి మీదుగా రాజమండ్రి వైపునకు పంపిస్తారు. హైదరాబాద్–విజయవాడ: టేకుమట్ల డైవర్షన్‌ను ఎత్తివేయనున్నారు. టేకుమట్ల నుంచి ఖమ్మం జాతీయ రహదారికి వెళ్లి యూ టర్న్ తీసుకొని తిరిగి సూర్యాపేట వైపునకు రావల్సి ఉండగా.. జాతీయ రహదారిపై సరాసరి వాహనాలు వచ్చే విధంగా తాత్కాలిక రహదారిని నిర్మించారు. ఖమ్మం–హైదరాబాద్: రాయినిగూడెం వైపునకు వచ్చి యూటర్న్ తీసుకోవల్సి ఉండగా.. చివ్వెంల, ఐలాపురం వద్ద దారి మళ్లించి సూర్యాపేట మీదుగా సరాసరి హైదరాబాద్ వెళ్లే విధంగా ప్రణాళికలను రూపొందించారు. సూర్యాపేట జిల్లా పోలీసులు ఈ ఏడాది జాతీయ రహదారిపై డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయనున్నారు. ఎక్కడైనా వాహనాలు పెద్ద సంఖ్యలో నిలిచిపోతే..వెంటనే తగిన చర్యలు చేపడతారు. సూర్యాపేట గ్రామీణం, సూర్యాపేట, మునగాల, కోదాడ, కోదాడ గ్రామీణ సీఐల ఆధ్వర్యంలో పండగకు ముందు, ఆ తర్వాత ఐదేసి రోజులు సిబ్బంది నిరంతరం ట్రాఫిక్‌ను పర్యవేక్షించనున్నారు. క్రేన్లు, అంబులెన్సులు, టోయింగ్ వాహనాలను సిద్ధం చేశారు. నాలుగు హైవే పెట్రోలింగ్ వాహనాలు గస్తీ కొనసాగనుంది. జిల్లా వ్యాప్తంగా 24 బ్లాక్ స్పాట్లను గుర్తించారు. వీటితోపాటు ప్రమాదకర క్రాసింగ్‌ల వద్ద ప్రత్యేక చర్యలు చేపట్టారు. సీసీ టీవీ కెమెరాలను, సైన్ బోర్డులు, విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేశారు. వేగ నియంత్రికలను, బారికేడ్లను తొలగించారు. గుంతలు పడిన చోట మరమ్మతులు చేపట్టారు. అయితే వాహనదారులకు తొందరపాటు సరికాదని, ప్రతి ఒక్కరూ వేగ నియంత్రణ పాటించాలని పోలీసులు సూచించారు. సంక్రాంతిని ఆనందంగా జరుపుకొని తిరిగి సురక్షితంగా గమ్యస్థానం చేరేందుకు నిరంతరం పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామని వివరించారు.

# జాగృతి పేడ్ బ్యాచ్‌పై టీఆర్‌పి నేత జ్యోతి పండాల్ ఘాటు విమర్శలు

- వాస్తవాలు మాట్లాడితే ఎందుకు కోపం?
- బీసీల పేరుతో నాటకాలు మానుకోవాలి
- టీఆర్‌పి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి జ్యోతి పండాల్...



**జహీరాబాద్ వెలుతురు జనవరి 09:**
టీఆర్‌పి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి జ్యోతి పండాల్ జాగృతి పేడ్ బ్యాచ్‌కు గట్టిగా కౌంటర్ ఇచ్చారు. టీఆర్‌పి పార్టీ అధ్యక్షులు తీన్మార్ మల్లన్న కల్వకుంట్ల కవితపై వాస్తవాలు మాట్లాడుతుంటే ఎందుకు అంత ఆగ్రహం వస్తుందో చెప్పాలని ప్రశ్నించారు. వాస్తవాలను భరించలేక పేడ్ బ్యాచ్‌తో మల్లన్నపై అనుచిత వ్యాఖ్యలు చేయించడం సరికాదన్నారు. మీ కుల జనాభా రెండు లక్షలు కూడా లేకపోయినా బీసీ ఓట్లతో అధికారంలోకి వచ్చి పదేళ్లపాటు రాష్ట్రాన్ని దోచుకున్నారని మండిపడ్డారు. ఇప్పుడు మళ్లీ బీసీల ఓట్ల కోసం పూటకు ఒక వేషం వేస్తూ 'జనం బాట' పేరుతో రోజుకు ఒక ఊరు తిరుగుతూ నాటకాలు చేస్తున్నారని కల్వకుంట్ల కవిత తీరుపై తీవ్రంగా విమర్శించారు. సార దందాలో జైలుకు వెళ్లి తిరిగి వచ్చి సొంత కుటుంబ సభ్యులపైనే వ్యాఖ్యలు చేయడం నీతి నిజాయితీకి నిదర్శనమా అని ప్రశ్నించారు. తీన్మార్ మల్లన్న ప్రతి ఆడబిడ్డను చెల్లెలు, అక్క, అమ్మగా గౌరవిస్తూ మహిళలకు పార్టీలో పెద్దపీట వేస్తారని తెలిపారు. మల్లన్న గ్రామాల పర్యటనకు వస్తే బీసీలు పెద్ద ఎత్తున తరలివచ్చే పరిస్థితి ఉందన్నారు. జాగృతి పేడ్ బ్యాచ్ బహిరంగంగా దాడుల బెదిరింపులు చేస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఉమ్మడి జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జి శ్రీకాంత్, ఉమ్మడి మెదక్ జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జి హర్ష, జహీరాబాద్ మండల అధ్యక్షుడు రాకేష్, ఝరసంఘం మండల అధ్యక్షుడు సంగమేష్, మొగుడంపల్లి మండల సోషల్ మీడియా ఇన్‌చార్జి వీరేశం, మహేష్, నర్సింలు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# బాగారెడ్డి మైదానంలో ఉత్కంఠభరిత గోల్డ్ కప్ పోటీలు

- కాశ్మీర్ సీసీ, డాలి సీసీ ఘన విజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌లో ప్రవేశం...





**జహీరాబాద్ వెలుతురు జనవరి 09:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డి క్రీడా మైదానంలో శుక్రవారం నాడు ఖిజర్ యఫై--4 గోల్డ్ కప్ క్రికెట్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌కు ముఖ్య అతిథులుగా హాజరైన మున్సిపల్ కమిషనర్ సత్య ప్రవీణ్, గుంజేటి సర్పంచ్ బొమ్మ దేశెట్టి పాటిల్ మాట్లాడుతూ, జహీరాబాద్ వంటి ప్రాంతంలో ఇంత అద్భుతమైన టోర్నీని నిర్వహించి కులమతాలకు అతీతంగా క్రీడలు నిర్వహించడం, స్థానిక యువతను దేశవ్యాప్తంగా ఉన్న క్రికెటర్లతో పరిచయం చేయడం అభినందనీయం అని పేర్కొన్నారు. వారు ఇక్కడి ఆటగాళ్లను రంజీ, జోనల్ స్థాయి మ్యాచ్‌లలో ప్రమోట్ చేయాల్సిన అవసరాన్ని కూడా గుర్తించారు. మూడవ రోజు జరిగిన తొలి మ్యాచ్‌లో కర్ణాటక సీసీ--కాశ్మీర్ సీసీ జట్లు ఎదురయ్యాయి. కర్ణాటక సీసీ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకోని 14 ఓవర్లలో 101 పరుగులు చేసి అలౌటయ్యింది. లక్ష్యంతో బరిలో దిగిన కాశ్మీర్ సీసీ 2 వికెట్ల నష్టంతో 8 ఓవర్లలో 104 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. నితిన్ నాయక్ 45 పరుగులు చేసి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు పొందారు. రెండవ మ్యాచ్‌లో డాలి నగర్ కర్నూల్--డి.వి.ఆర్. అన్న హైదరాబాద్ జట్లు ఎదురయ్యాయి. డాలి సీసీ టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించి 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 258 పరుగులు చేసింది. లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన డి.వి.ఆర్. అన్న హైదరాబాద్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 180 పరుగులే చేసింది. దీంతో డాలి సీసీ 78 పరుగుల తేడాతో విజయాన్ని సాధించి క్వార్టర్ ఫైనల్‌కు అర్హత పొందింది. క్రికెట్ టోర్నీలో ముఖ్య అతిథులు బొమ్మ దేశెట్టి పాటిల్, మున్సిపల్ కమిషనర్ సత్య ప్రవీణ్ చేతుల మీదుగా వెయ్యి రూపాయల నగదు, ట్రోఫీతో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ చైర్మన్ రాములు నేత, మీడియా ఇంచార్జ్ మహేబూబ్ అలీ, అదం యఫై, అబుద్ యఫై, తహ యఫై, నిర్వాహకులు మాక్సుద్ అలీ, మొహమ్మద్ అలీ, రాంచరణ్, వ్యాఖ్యాతలు అబ్దుల్లా సిద్ధిఖీ, తయ్యబ్ అలీ, జయచంద్ రాథోడ్, మొహమ్మద్ ఫెరోజ్, మీడియా ప్రతినిధులు, మరియు స్థానిక నిర్వాహకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శాస్త్ర-సాంకేతిక మంత్రిత్వశాఖ అంటువ్యాధుల నుంచి వ్యక్తిగతీకరించిన వైద్యం దాకా భారత్ నేడు భవిష్యత్ ఆరోగ్య సంరక్షణ దశలోకి ప్రవేశిస్తోంది - డాక్టర్ జితేంద్ర సింగ్



**హైదరాబాద్ వెలుతురు 09 జనవరి 2026:**
అరుదైన, జన్యు వ్యాధుల ముందస్తు గుర్తింపుతోపాటు అందుబాటు వ్యయంతో వాటికి చికిత్స చేయడం ఆరోగ్య సంరక్షణ రంగంలో నేడు అతిపెద్ద సవాళ్లని కేంద్ర శాస్త్ర-సాంకేతిక, భూవిజ్ఞాన (స్వతంత్ర బాధ్యత), అంతరిక్ష, అణుశక్తి శాఖలు సహా పీఎంవో సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ చెప్పారు. ఈ రోజు హైదరాబాద్‌లో ఓ కార్యక్రమం సందర్భంగా ప్రసంగిస్తూ- జన్యుశాస్త్రం, బయోటెక్నాలజీ, వ్యాధి నివారక ఆరోగ్య సంరక్షణ మార్గంలో సంక్లిష్ట ఆరోగ్య సమస్యల పరిష్కారానికి దేశం శాస్త్రీయంగా, ఆర్థికంగా సన్నద్ధమైందని ఆయన పేర్కొన్నారు.
హైదరాబాద్‌లోని డీబీటీ-బీఆర్ఐసీ సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్ (సీడీఎఫ్‌డీ)ని ఆయన ఇవాళ సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ 'సమర్థ్' జాతీయ నైపుణ్యాభివృద్ధి కేంద్రానికి శంకుస్థాపన చేయడంతోపాటు 'ఐడీఈఏ-ఎన్ఏ బీఆర్ఐసీ-సీడీఎఫ్‌డీ' టెక్నాలజీ ఇంక్యుబేటర్‌ను మంత్రి ప్రారంభించారు.
మునుపటి దశాబ్దాల్లో అంటువ్యాధులతో పోరాడుతూ వచ్చిన దేశంగా పరిగణలోగల భారత్ ఇప్పుడు తదుపరి తరం ఆరోగ్య సంరక్షణ దశలోకి ప్రవేశించిందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ఈ మేరకు మాలిక్యులర్ డయాగ్నస్టిక్స్, జీనోమ్ సీక్వెన్సింగ్, వ్యక్తిగతీకరించిన వైద్యం ఆరోగ్య సంరక్షణకు ప్రపంచ కూడలిగా మారుతున్నదని చెప్పారు. ప్రయోగశాలల్లో పరిశోధనల విజయాలను వాస్తవ జీవన పరీక్ష ఫలితాలతో అనుసంధానించడంలో 'సీడీపీఎఫ్‌డీ' వంటి సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హయాంలో ప్రభుత్వ విధానాల దిశను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. ఎర్రకోట పైనుంచి ఆయన ప్రసంగాల్లో పలుమార్లు ప్రధానంగా ప్రకటించిన మేరకు బయోటెక్నాలజీ, ఆరోగ్య రంగాలకు మునుపెన్నడూ ఎరుగని రీతిలో ప్రాధాన్యం లభిస్తున్నదని మంత్రి తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో బయో-ఇ3 విధానాన్ని ఆయన ప్రకటించారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా శాస్త్రవేత్తలు, అంకుర సంస్థలు, యువ ఆవిష్కర్తలలో విస్తృత ఉత్సుకత ప్రేరేపించిందని వివరించారు.
దేశం నేడు పెద్ద ఎత్తున జీనోమ్ సీక్వెన్సింగ్ ఆధారిత పీడియాట్రిక్ జన్యు వ్యాధుల కార్యక్రమాలు సహా హీమోఫీలియా వంటి పలు అంశాల్లో ప్రగతిశీల కృషితో భారత్ వేగంగా పురోగమిస్తున్నదని డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. ఇలాంటి వ్యాధులతో బాధపడుతున్న రోగులకు విభిన్న చికిత్స విధానాలు అవసరం కావచ్చునని, ఈ నేపథ్యంలో ప్రస్తుతం సాగుతున్న కృషి వ్యక్తిగతీకరించిన వైద్య శకానికి ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను సిద్ధం చేస్తున్నదని చెప్పారు. అరుదైన వ్యాధుల అంశాన్ని ప్రస్తావిస్తూ- దేశంలో ఈ వ్యాధుల చికిత్స సంబంధిత తొలి జాతీయ విధానాన్ని 2021లో ప్రవేశపెట్టింది మోదీ ప్రభుత్వమేనని ఆయన తెలిపారు. ప్రభుత్వ విధానాల్లో వినూత్న మార్పును సూచించడంతోపాటు దూరదృష్టి, సార్వత్రిక శాస్త్రీయ వనరులను ఇది ప్రతిబింబిస్తుందని మంత్రి అన్నారు. వ్యాధుల గుర్తింపు మాత్రమే సరిపోదని, బాధితులకు పటిష్ఠ చికిత్సను కూడా అందుబాటులోకి తేవాల్సి ఉందని మంత్రి స్పష్టం చేశారు.
ఆయుష్ మంత్రిత్వ శాఖ ద్వారా సంప్రదాయ వైద్య విధానాల సంస్థాగతీకరణతోపాటు యోగాను వ్యాధి నివారక ఆరోగ్య ఉపకరణంగా ప్రపంచం గుర్తించడం వెనుక ప్రభుత్వ ప్రోత్సహిస్తున్న సమగ్ర ఆరోగ్య సంరక్షణ నమూనాను కూడా మంత్రి ప్రస్తావించారు. అలాగే జీవనశైలి, జీవక్రియ రుగ్మతల నిర్వహణ దిశగా ఆరోగ్య శ్రేయో విధానాలను ఆధునిక వైద్యంతో జోడించడం సానుకూల ఫలితాలిచ్చిందని ఆయన అన్నారు.
ఈ పర్యటన సందర్భంగా 'సీడీఎఫ్‌డీ'లో సాగుతున్న పరిశోధన-ఆవిష్కరణ కార్యకలాపాలను డాక్టర్ జితేంద్ర సింగ్ సమీక్షించారు. జీనోమ్ సీక్వెన్సింగ్ కార్యక్రమాలతోపాటు ప్రజలకు అవగాహన కల్పన లక్ష్యంగా చేపట్టిన కృషి తదితరాలను ఆయన ప్రశంసించారు. బయోటెక్నాలజీపై విశ్వాసం, ఆసక్తిని పెంచడం కోసం పౌరులకు... ముఖ్యంగా యువతకు అర్థమయ్యే భాషలో శాస్త్రవిజ్ఞానాన్ని చేరువ చేయడం అత్యావశ్యకమని మంత్రి అన్నారు.
దేశంలో బయోటెక్ అంకుర సంస్థల సంఖ్య కొన్నేళ్లుగా అనేక రెట్లు పెరిగిందని, భారత్‌లో బయో-ఆర్థిక వ్యవస్థ వికాసానికి ఈ రంగం ఎంతగానో తోడ్పడుతుందన్ని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. బయోటెక్నాలజీ పరిశోధన-ఆవిష్కరణ మండలి (బీఆర్ఐసీ) ఏర్పాటుతో సంస్థల మధ్య సమన్వయం బలోపేతమై, ఉన్నత-ప్రభావ పరిశోధనలతోపాటు పరిశ్రమ భాగస్వామ్యానికి దారితీసిందన్నారు.
టీకాలు, వ్యాధి నివారక ఆరోగ్య సంరక్షణ రంగం పరంగా భారత్ ప్రపంచంలో అగ్రస్థానానికి చేరుతున్నదని మంత్రి స్పష్టం చేశారు. స్వదేశీ ఆవిష్కరణలు నేడు జాతీయంగా అమలు కావడంతోపాటు ప్రపంచ దేశాల మధ్య వాటి ఆదానప్రదానం కూడా సాగుతున్నదని తెలిపారు. ఆ మేరకు ప్రపంచ ఆరోగ్య భద్రతలో భారత్ పాత్ర మరింత బలోపేతం అవుతున్నదని పేర్కొన్నారు. చివరగా- దేశ జనాభాలో దాదాపు 70 శాతం మంది 40 ఏళ్లలోపు వయస్కులేనని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. అందువల్ల ముందస్తు రోగ నిర్ధారణ, వ్యాధి నివారక ఆరోగ్య రంగంపై నిశితంగా దృష్టి సారించడం జాతీయ స్థాయిలో అత్యావశ్యకమని ఆయన స్పష్టం చేశారు. ఈ దిశగా సీడీఎఫ్‌డీ పనితీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఇటువంటి సంస్థలు ఆరోగ్యకర, బలమైన, భవిష్యత్ సంసిద్ధ భారత్ రూపకల్పనలో అర్థవంతంగా దోహదం చేస్తున్నాయంటూ మంత్రి తన ప్రసంగం ముగించారు.

# గోట్ బ్లడ్ మాఫియా వ్యవహారం

- మేక రక్తం సేకరిస్తున్న మటన్ షాపుపై కేసు నమోదు



**మేడ్చల్,జనవరి9( వెలుతురు):**
జంతువుల నుంచి రక్తం సేకరణ వ్యవహారంలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఘట్‌కేసర్ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ వాణి ఫిర్యాదు మేరకు కీసర పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మూగజీవుల నుంచి రక్తం తీసేందుకు ఎలాంటి అనుమతి పొందలేదని పోలీసులు గుర్తించారు. సోను మటన్ అండ్ చికెన్ షాప్‌పై కేసు నమోదు చేశారు పోలీసులు. ఈ వ్యవహారంపై వెటర్నరీ అధికారులు ఇచ్చిన నివేదికను జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ పరిశీలించారు. కాగా.. సోను మటన్ షాప్‌లో జీవించి ఉన్న మేక నుంచి రక్తం సేకరించిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈనెల 4న నాగారంలోని సోను మటన్ షాపుపై కీసర పోలీసులు దాడులు చేయగా.. 130 ప్యాకెట్ల మేకల రక్తం లభించింది. మేకల నుంచి రక్తాన్ని సేకరిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే ఈ రక్తాన్ని కాచిగూడలోని సీఎన్‌కే ఇంపోర్ట్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ సంస్థకు తరలించి.. అక్కడి నుంచి లేబొరేటరీల్లో ప్లేట్‌లెట్ల తయారీకి వినియోగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ 'గోట్ బ్లడ్ మాఫియా' ఎలాంటి వైద్య ప్రమాణాలూ పాటించకుండా మేకలు, గొర్రెల నుంచి అక్రమంగా రక్తం సేకరించి, దాన్ని ప్లేట్‌లెట్ల తయారీకి తరలిస్తుండటం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

# ఉపాధి కుట్రలపై 18నుంచి చైతన్య కార్యక్రమం

- ఇంటింటికి తిరిగి ప్రచారం చేపడతాం
- ప్రజల భూములను 99 పైసలకే ఎలా ఇస్తారు
- మంత్రి లోకేశ్ తీరుపై మండిపడ్డ సిపిఎం నేత శ్రీనివాసరావు




**విజయవాడ, జనవరి9( వెలుతురు):** ఉపాధిహామీపై కుట్రలను వివరిస్తూ...సిపిఎం ఆధ్వర్యంలో జనవరి 18 నుండి ఇంటింటికి తిరిగి చైతన్య ప్రచారం చేపడుతున్నామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రకటించారు. శుక్రవారం శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ . ఉపాధి హామీ చట్టం విషయంలో 100 రోజులను 150 రోజులు చేసినట్లుగా ప్రత్యేకంగా చెబుతున్నారు. కానీ దీనికోసం ప్రత్యేకమైన చట్టం తీసుకురానక్కరలేదన్నారు. పాత చట్టాన్నే 150 చేస్తే సరిపోద్ది కదా అన్నారు. వామపక్షాలు కూలీలతో కలిసి ఉపాధి హామీ చట్టం విషయంలో 200 రోజులు చేయాలని, రూ.600 కనీసం వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశామన్నారు. అయితే ఈరోజు ఆచరణలో కనీసం 50 రోజులు కూడా లేవన్నారు. కనీస వేతనాన్ని నిర్ణయిస్తే రూ.250 కూడా రావడం లేదన్నారు. దాన్ని అభివృద్ధి చేయాల్సిందిపోయి మొత్తాన్నీ నాశనం చేసి చట్టాన్నే మార్చేసి పథకాన్ని ఎత్తేసే కుట్ర జరుగుతుందని ధ్వజమెత్తారు. దీనిని వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో జనవరి 18 నుండి 31వ తేదీ వరకు ర్యాలీల ద్వారా ఇంటింటికి తిరిగి ప్రజలను చైతన్యవంతం చేసే కార్యక్రమాన్ని చేపడుతున్నామని ప్రకటించారు. ప్రతీ ఇంటికి తిరిగి కరపత్రం ఇచ్చి వారికి వాస్తవాలను చెప్పి సంతకాలను సేకరించి అధికారులకు కూడా మహజర్లను ఇస్తామన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే, పాత చట్టాన్ని పునరుద్ధరించకపోతే ఒక జాతీయ స్థాయి ఉద్యమాన్ని చేపట్టేందుకు వామపక్ష పార్టీలన్నీ సన్నద్ధమవుతున్నాయని ఉద్ఘాటించారు. వ్యవసాయ కూలీలు, పేద రైతులు, చేతి వృత్తిదారులు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అత్యధిక పేద ప్రజానీకం ఈ వాస్తవాలను గుర్తించి సిపిఎం చేపట్టనున్న ఇంటింటికి ప్రచారాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ కూలీ సంఘాలు, ఉపాధి సంఘాలు కలిసి గ్రామగ్రామాల్లో సమావేశాలు పెట్టి వారందరినీ చైతన్యవంతం చేయాలని కోరారు. 14వ తేదీ భోగి పండుగ రోజున ఉపాధి హామీ చట్టాన్ని నాశనం చేస్తున్న కొత్త చట్టాన్ని కూడా భోగి మంటల్లో దగ్ధం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున బలవంతంపు భూసేకరణ జరుగుతుందన్నారు. ఈ భూసేకరణను సమర్థించుకోవడానికి 99 పైసలకిచ్చేస్తాం మీకేంటి ఇబ్బంది అని లోకేశ్ చెబుతున్నారని అన్నారు. గతంలో ఓసారి లోకేష్ మాట్లాడుతూ ? ఉచితంగా ఎవ్వరికీ భూములను ఇవ్వలేదని, ఎవరెవరికి ఎన్ని కోట్ల రూపాయలలో భూములిచ్చారో లెక్కలతో సహా చెప్పారని గుర్తు చేశారు. ఉచితంగా ఎవ్వరికీ భూమిని ఇవ్వడం లేదనీ, మార్కెట్ రేటుకే ఇస్తున్నామని చెప్పి ఇప్పుడు వారు 99 పైసలుకే భూమిని ఇచ్చేస్తాం అని చెప్పడం బరితెగింపేనన్నారు. దున్నుకొని పంటలను పండించే వ్యవసాయ భూములను రైతుల నుండి బలవంతంగా లాక్కొని కార్పొరేట్లకు 99 పైసలకిస్తారా అని ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సహకరించాల్సిందిపోయి పక్కనే ఆర్సెల్ మిట్టల్ ను పెట్టారని, అటు గంగవరం పోర్టును అదానీకి ఇచ్చేశారని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంటు లేదు వారికి మైన్లు లేవు అని అన్నారు. ఇప్పుడు కొత్తగా విశాఖపట్నం రీజనల్ డెవలప్‌మెంట్ అంటూ నీతి ఆయోగ్ కూడా ఓ పెద్ద రిపోర్టు తయారుచేసిందన్నారు. దాన్ని పట్టుకొని తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. విశాఖ స్టీల్ ప్లాంటుకు చెందిన 2500 ఎకరాలను నక్కపల్లిలో పరిశ్రమలు పెట్టడానికి ప్రయివేటు పార్టీలకు మళ్ళించండి అని ఆ రిపోర్టులో స్పష్టంగా ఉందని తెలిపారు. కార్మికులను రాష్ట్ర ప్రజలను మోసం చేయవద్దు అని వి.శ్రీనివాసరావు హెచ్చరించారు. భూములను ఇష్టానుసారం ఇస్తామని మంత్రి లోకేష్ చెబితే ? దాన్ని అడ్డగించినందుకు పార్టీ వ్యక్తి అప్పలరాజును తీసుకెళ్లి డిటైన్ చేశారని దుమ్మెత్తిపోశారు. ఈరకంగా ఎంతమందిని నిర్బంధించి ఎన్ని అక్రమ కేసులు పెట్టి ఎంతమందిని బెదిరించి భూములను లాక్కుంటారు అని వి.శ్రీనివాసరావు ప్రశ్నించారు. వైఎస్.జగన్ ఉన్నప్పుడు తాము ప్రతిఘటిస్తే మీకు బాగుంది.. పక్కనే వచ్చి కూర్చొని బలపరిచారు.. ధర్నాల్లో కూడా కూర్చున్నారు.. ఆ రోజు తప్పు కాదు.. ఈరోజు తప్పయిందా అని వి.శ్రీనివాసరావు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇష్టానుసారం బాధ్యతారాహిత్యంగా ఒక మంత్రి ఇలా అపరిపక్వంగా మాట్లాడుతూ సిపిఎం లాంటి ఒక జాతీయ పార్టీపై అపనిందలు మోపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎవరో రాసిన స్క్రిప్టును చదివేటంత తెలివితక్కువ వాళ్లం తాము కాదు అని చెప్పారు. రైతులను బాధపెట్టి వారి పొట్టగొట్టి ఎవరిని పోషిస్తారు ? అదానీ అంబానీలనా మీరు పోషించేది ? అని వి.శ్రీనివాసరావు ప్రశ్నించారు.

# రాజ్యసభలో జూన్‌లో ఐదు ఖాళీలు

- తెలంగాణలో ఇద్దరు, ఎపిలో ముగ్గురు రిటైర్



**న్యూఢిల్లీ,జనవరి9(వెలుతురు):** ఈ ఏడాది రిరైట్ అవుతున్న రాజ్యసభ సభ్యుల జాబితాను శుక్రవారం రాజ్యసభ సచివాలయం విడుదల చేసింది. తెలంగాణలో భారాస సభ్యుడు కేఆర్ సురేష్ రెడ్డి, కాంగ్రెస్ సభ్యుడు అభిషేక్‌మను సింఘ్వీ ఏప్రిల్ 9న రిటైర్ కానున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వైకాపా ఎంపీలు అయోధ్యరామిరెడ్డి, పరిమళ్ నత్వానీ, పిల్లి సుభాష్ చంద్రబోస్, తెదేపా సభ్యుడు సానా సతీష్‌ల పదవీకాలం ఈ ఏడాది జూన్‌తో ముగుస్తుందని రాజ్యసభ సచివాలయం తెలిపింది. ఈమేరకు అన్ని రాష్ట్రాల సభ్యుల పదవీకాలం వివరాలను వెల్లడించింది.

# మహిళలు, చిన్నారుల భద్రత కోసం చర్యలు

- దాడులతో పలువురు బాలలకు విముక్తి
- సైబరాబాద్ విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్




**హైదరాబాద్,జనవరి9( వెలుతురు):** మహిళలు, చిన్నారుల భద్రత కోసం సైబరాబాద్ విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో ఈ వారం పలు విస్తృత చర్యలు చేపట్టామని డీసీపీ సృజన కరణం తెలిపారు. ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా సైబరాబాద్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక దాడుల్లో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో కేసులు నమోదు చేసి 215 మంది పిల్లలను, అంటే 200 మంది బాలురను మరియు 15 మంది బాలికలను విజయవంతంగా రక్షించగలిగారు . సైబరాబాద్ షీ టీం బృందాలు ఈ వారంలో మొత్తం 127 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించగా, బహిరంగ ప్రదేశాల్లో అసభ్యకర ప్రవర్తనకు పాల్పడిన 59 మందిని రెడ్ హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరిలో 63 ఖబిబా కేసులు నమోదు కాగా, మిగిలిన వారికి కౌన్సెలింగ్ చేశారు. అదేవిధంగా, మహిళల నుండి అందిన 17 ఫిర్యాదులను షీ టీం బృందాలు స్వీకరించాయన్నారు. భార్యాభర్తల మధ్య తలెత్తిన కుటుంబ సమస్యలను పరిష్కరించే దిశగా ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్లు కేంద్రాలు కీలక పాత్ర పోషించాయన్నారు. ఈ కేంద్రాల ద్వారా 31 కుటుంబాలను తిరిగి కలిపి, వారి కుటుంబాల్లో వెలుగులను నింపారు. సైబరాబాద్ పరిధిలో వివిధ ప్రాంతాలలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, షీ టీం బృందాలు మానవ అక్రమ రవాణా, బాలల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, మహిళలను వేధించడం, సామాజిక మాధ్యమాల ద్వారా వేధింపులు, మహిళలను నిరంతరం వెంబడించడం, భిక్షాటన, సామాజిక మాధ్యమాల ద్వారా వేధింపులు, సైబర్ మోసాలు వంటి అంశాలపై అవగాహన కల్పించామన్నారు. మొత్తం 6,615 మందికి అవగాహన కల్పించామన్నారు. అలాగే మహిళల హెల్ప్ లైన్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, డయల్ 100, నేరాల నివారణ కోసం 1930 వంటి సేవల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించామన్నారు.


# మొదలైన సంక్రాంతి ప్రయాణాలు

- ఊరిబాట పట్టిన పట్టణ ప్రజలు
- బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల వద్ద రద్దీ
- విజయవాడ రహదారిలో బారులు తీరిన వాహనాలు

**హైదరాబాద్,జనవరి9( వెలుతురు):** విద్యా సంస్థలకు శనివారం నుంచి సంక్రాంతి సెలవులు రావడంతో శుక్రవారం సాయంత్రం నుంచే హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ మొదలైంది. సంక్రాంతి పండగకు 3 రోజుల ముందే పయనమవుతుండటంతో జాతీయ రహదారిపై వాహనాల సందడి నెలకొంది. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా జాతీయ రహదారిపై పోలీసులు పటిష్ఠ చర్యలు చేపట్టారు. హైవేపై వెళ్లే వాహనాలకు అంతరాయం కలగకుండా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో నారాయణపురం రోడ్డును పోలీసులు మూసివేశారు. పంతంగి టోల్‌ప్లాజా వద్ద మొత్తం 16 టోల్ బూత్‌లు ఉండగా వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకొని పదింటిని విజయవాడ మార్గంలోనే తెరిచారు. ఫాస్టాగ్ విధానం అమలులో ఉండటంతో వాహనాల రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి. అదనపు టోల్ సిబ్బందిని నియమించారు. శని, ఆదివారాల్లో రద్దీ అధికంగా ఉండనుంది. సంక్రాంతి పండుగ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు కిక్కిరిపోతున్నాయి. శనివారం నుంచి విద్యాసంస్థలకు సెలవులు, ఆఫీసులకు వీకెండ్ కావడంతో స్వగ్రామాలకు వెళ్లేందుకు హైదరాబాద్ నగర వాసులు పోటెత్తారు. పట్టణాల నుంచి సొంతూళ్లకు బయలుదేరిన ప్రయాణికులతో ఆర్టీసీ బస్టాండ్లు కళకళలాడుతున్నాయి. మరోవైపు సొంత వాహనాల్లోనూ ప్రజలు స్వగ్రామాలకు బయలుదేరుతున్నారు. దీంతో ప్రధాన రహదారులన్నీ వాహనాలమయంగా మారిపోయాయి. ÷ఖ్యంగా హైదరాబాద్ నుంచి తెలంగాణలోని వివిధ ప్లలెలు, ఆంధప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు వెళ్లే వారితో రోడ్లన్నీ నిండిపోయాయి. హైదరాబాద్- విజయవాడ 65వ జాతీయ రహదారి అయితే మరింత రద్దీగా మారింది. పంతంగి టోల్ గేట్ వద్ద వాహనాల బారులు తీరాయి. దీంతో స్వగ్రామాలకు వెళ్లే వారికి ట్రాఫిక్ సమస్యగా మారిపోయింది. రద్దీ సమస్యను దృష్టిలో ఉంచుకుని ప్రయాణాలు చేయాలని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు.

# ఎపి టెట్ ఫలితాలు విడుదల

**అమరావతి, జనవరి9( వెలుతురు):**




ఏపీలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. గతేడాది డిసెంబర్ 10 నుంచి 21 వరకు జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్షకు 2,71,692 మంది దరఖాస్తు చేసుకోగా.. 2,48,427 మంది హాజరైనట్లు ఏపీ టెట్ కన్వీనర్ వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించి ముందుగా ప్రాథమిక కీ విడుదల చేశారు. అభ్యర్థుల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన తర్వాత తుదిఫలితాలు వెల్లడించినట్లు కన్వీనర్ పేర్కొన్నారు. టెట్‌లో 97,560 మంది (39.27 శాతం) ఉత్తీర్ణులు అయ్యారు. ఈ పరీక్షకు 31,886 మంది ఇన్ సర్వీసు ఉపాధ్యాయులు హాజరుకాగా.. వారిలో 47.82 శాతం(15,239) మంది ఉపాధ్యాయులు ఉత్తీర్ణులయ్యారు. టెట్ పరీక్ష ఫలితాలను 9552300009 వాట్సప్ నెంబర్ ద్వారా కూడా తెలుసుకోవచ్చని టెట్ కన్వీనర్ ఓ ప్రకటనలో తెలిపారు.

# గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం

- అదే తన జీవిత లక్ష్యం అన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- వ్యవసాయ యాంత్రీకరణ, ప్రకృతి వ్యవసాయ పథకాలకు శ్రీకారం



**భద్రాద్రి కొత్తగూడెం, జనవరి9( వెలుతురు):** గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం చేయడం తన జీవిత లక్ష్యమని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పాలనలో మూలకిపడిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం పున:ప్రారం భోత్సవం చేశామని తెలిపారు. శుక్రవారం అశ్వరావుపేట వ్యవసాయ కళాశాలలో రైతు మేళా కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ యాంత్రీకరణ పథకం, ప్రకృతి వ్యవసాయ పథకాలను మంత్రులు ప్రారంభించారు. అనంతరం మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. దివంగత ఎన్టీఆర్ దీవెనలతో వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో సీతారామ ప్రాజెక్టులో డిస్టిబ్యూట్రరీ కెనాల్స్ డీపీఆర్‌లో లేదని ప్రస్తావించారు. తమ ప్రభుత్వంలో కెనాల్స్‌కు నిధులు మంజూరు చేశామని తెలిపారు. 350 మంది రైతులకు రూ.1.07 కోట్లు విలువైన యాంత్రీకరణ పనిముట్లు పంపిణీ చేశామని వెల్లడించారు. జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌లో భాగంగా ప్రకృతి వ్యవసాయ పథకం ప్రారంభించినట్లు వివరించారు. వ్యవసాయ ఉద్యాన పామాయిల్ సాగుపై శాస్త్రవేత్తలు ఆదర్శ రైతులతో అవగాహన సదస్సు నిర్వహించామని పేర్కొన్నారు. నాలుగో పంపు హౌస్ నిర్మాణంతో దమ్మపేట, అశ్వరావుపేట మండలాలకు గోదావరి నీళ్లు వస్తాయని వెల్లడించారు. ఆయిల్ ఫామ్‌లో అంతర పంటలుగా కోకో, జాజి, వక్క, మిరియం, సాగుతో రైతులకు అదనపు లాభాలు వస్తాయని తెలిపారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. దేశానికే ఆదర్శంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యవసాయ రంగంలో అగ్ర భాగాన ఉండాలని చెప్పుకొచ్చారు. తెలంగాణలో పది లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు విస్తరణకు తమ ప్రభుత్వం పట్టుదలగా ఉందని పేర్కొన్నారు. సన్నకారు రైతులకు మేలు చేయాలని వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారని చెప్పుకొచ్చారు. సంక్రాంతి పండుగ రోజు నుంచి వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. 2047 నాటికి 470 బిలియన్ డాలర్స్ వ్యవసాయ రంగం వాటా ఉండేలా తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ ఉందని వెల్లడించారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల ఉత్తమ కళాశాలగా నిలవాలని సూచించారు. పామాయిల్ సాగుతో రైతులకు మహర్దశ వచ్చిందని తెలిపారు. భద్రాద్రి శ్రీ సీతారామ చంద్రస్వామి వారి ఆశీస్సులతో సీతారామ ప్రాజెక్టు పూర్తి చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# పురపోరుకు అంతా రెడీ




**హైదరాబాద్ జనవరి9( వెలుతురు):** రాష్ట్రంలోమున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేయనుంది. సంక్రాంతి పండుగకు మూడు రోజులు ముందుగానే ప్రకటించే అవకాశం ఉంది. నేడు రాజకీయ పార్టీలతో తెలంగాణ ఎన్నికల అధికారి భేటీ కానున్నారక. స్థానిక సంస్థల ఏర్పాట్లపై ఎస్ఈసీ చర్చించనుంది. రాష్ట్రంలో 117 మున్సిపాలిటీలకు ఈనెల 20లోగా నోటిఫికేషన్ వెలువడే అవకాశముందని తెలిసింది. తెలొంగాణలోని 117 మునిసిపాలిటీలు, 6 మునిసిపల్ కార్పొరేషన్లలో వార్డుల వారీగా ఓటర్ల జాబితా తయారీని షెడ్యూల్ ప్రకారం సిద్ధంచేస్తోంది. ఈనెల 12న రాష్ట్రవ్యాప్తంగా అన్ని మునిసిపాలిటీలు, కార్పొరేషన్‌ల పరిధిలో వార్డుల వారీగా తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నారు.మున్సిపాలిటీల్లో ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని, కార్యదర్శి మంద్ మకరంద్ అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల కమిషనర్లతో బుధవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తిచేయాలని కమిషనర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎప్పుడైనా మున్సిపాలిటీకి సంబంధించిన నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశముంది. ఇటీవల పంచాయతీ ఎన్నికలను మూడు దఫాలుగా సజావుగా నిర్వహించిన నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికలను కూడా మూడు దశల్లో నిర్వహించాలని నిర్ణయించారుఈనెల 12న అన్ని మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో ఓటర్ల తుది జాబితాను ప్రచురించాలని, 13న పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా ప్రచురణ.. ఆ వెంటనే 'టీ-పోల్' సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేయాలని రాష్ట్ర ఎన్నికల అధికారులు సూచించారు.. 16న ఫొటోలతో కూడిన ఓటర్ల తుది జాబితాను పోలింగ్ కేంద్రాల వారీగా ప్రచురించాలని మున్సిపల్ అధికారులకు ఇప్పటికే ఆదేశాలు అందాయి. సంక్రాంతి పండగ ముగిసిన తర్వాత నోటిఫికేషన్ విడుదల చేసి ఫిబ్రవరి నెలాఖరుకు ఎన్నికలను పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం భావిస్తుంది. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నేడు జరిగే ప్రజాప్రతినిధుల సమావేశంలో స్పష్టత వచ్చే అవకాశముంది.

# అదేపనిగా నెహ్రూపై విమర్శలు తగవు

- భారత ప్రజాస్వామ్య వ్యవస్థాపకుడు పండిట్
- జవహర్‌లాల్ నెహ్రూ పై శశిథరూర్ ఆసక్తికర వ్యాఖ్యలు

**తిరువనంతపురం, జనవరి9( వెలుతురు):** కాంగ్రెస్ విధానాలను విమర్శిస్తూ బీజేపీకి దగ్గరవుతున్నారంటూ కొంతకాలంగా విమర్శలను ఎదుర్కొంటున్న కాంగ్రెస్ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ తాజాగా భారతదేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నెహ్రూ భారత ప్రజాస్వామ్య వ్యవస్థాపకుడని కొనియాడారు. అయితే నెహ్రూపై తన అభిమానం గుడ్డిది కాదని అన్నారు. నెహ్రూ పొరపాట్లు చేసి ఉండొచ్చని, అయితే దేశంలోని అన్ని సమస్యలకూ ఆయనే కారణమంటూ నిందించడం ఆమోదయోగ్యం కాదని అన్నారు. నెహ్రూ వారసత్వంపై బీజేపీ వ్యవహరిస్తున్న తీరుపై కేరళ లెజిస్లేటివ్ అసెంబ్లీ ఇంటర్నేషన్ బుక్ ఫెస్టివల్‌లో లో శశిథరూర్ మాట్లాడారు.'నేను నెహ్రూ అభిమానిని. అయితే ఆయన నమ్మకాలు, విధానాలన్నింటికీ గుడ్డిగా తలాడించను. ఆయన ఆలోచనా దృక్పథం ప్రశంసనీయమైంది. ఆయన తీసుకున్న అనేక చర్యలు ప్రశంసలకు అర్హమైనవి. ముఖ్యంగా దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఆయన దృఢంగా నెలకొల్పారు. అలా అని వారు (మోదీ ప్రభుత్వం) ప్రజాస్వామి వ్యతిరేకులని కాదు. అయితే నిశ్చయంగా వారు నెహ్రూ వ్యతిరేకులు. సమస్య ఏదైనా నెహ్రూను వారు విమర్శలు చేస్తూనే ఉన్నారు' అని శశిథరూర్ వ్యాఖ్యానించారు. ఇండియా-చైనా మధ్య 1962లో జరిగిన యుద్ధాన్ని ప్రస్తావిస్తూ, కొన్ని కేసుల్లో మోదీ ప్రభుత్వం విమర్శలకు ఆధారాలుండవచ్చని, ఆ యుద్ధంలో చైనాపై ఓటమికి నెహ్రూ తీసుకున్న నిర్ణయాలు కారణం కావచ్చని అన్నారు. అయితే సమస్య ఏదైనా ప్రతిదానికి వాళ్లు నెహ్రూను నిందించడం మాత్రం సరికాదని అన్నారు. చయితగా తన జర్నీని ప్రస్తావిస్తూ, చిన్నప్పుడు ఆస్తమా కారణంగా తాను పుస్తకాలు చదవడాన్ని ఎక్కువగా ఇష్టపడేవాడినని, అప్పుడు టెలివిజన్ కానీ, మొబైల్ ఫోన్లు కానీ లేవని, పుస్తకాలే తన సహచరులని థరూర్ చెప్పారు. చాలా చిన్నప్పుడే తాను తొలి నవల రాశానని, అయితే సిరా ఒలికిపోవడంతో ఆ పుస్తకాన్ని కోల్పోయానని తెలిపారు. శ్రీ నారాయణ్ గురు బయోగ్రఫీ తన 28వ పుస్తకమని చెప్పారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో పుస్తక పఠనం తగ్గిపోయిందని, కానీ కేరళలో మాత్రం రీడింగ్ కల్చర్ కొనసాగుతోందన్నారు.

# పవర్ రీసెర్చ్ అధికారి ఇంట్లో నోట్ల కట్టలు

- రూ.3.59 కోట్లకుపైగా నగదు పట్టివేత

**బెంగళూరు, జనవరి9( వెలుతురు):** కేంద్ర ప్రభుత్వానికి చెందిన సెంట్రల్ పవర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ జాయింట్ డైరెక్టర్ ఇంట్లో నోట్ల కట్టలు బయటపడ్డాయి. బెంగళూరులోని తన కార్యాలయంలో చెన్ను రాజారామ్ మోహన్‌రావు రూ.9.5 లక్షల లంచం తీసుకుంటుండగా సీబీఐ అధికారులు శుక్రవారం అరెస్టు చేసారు. ఈ క్రమంలో జాయింట్ డైరెక్టర్ ఇంట్లో సోదాలు చేపట్టగా రూ.3.59 కోట్లకుపైగా లెక్కల్లో లేని నగదు లభ్యమైనట్లు అధికారులు వెల్లడించారు. ఆ నగదులో విదేశీ కరెన్సీ కూడా ఉంది. ప్రస్తుతం ఆయన సన్నిహితులు, కుటుంబసభ్యుల ఇళ్లలో సోదాలు కొనసాగుతున్నాయి. ఓ ప్రైవేట్ కంపెనీ ఉత్పత్తి చేసిన విద్యుత్తు పరికరాలకు సంబంధించిన పరీక్షల నివేదికలను జారీ చేయడానికి రాజారామ్ లంచం డిమాండు చేయడంతో బాధితులు సీబీఐని ఆశ్రయించి నట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఓ ప్రైవేట్ కంపెనీ డైరెక్టర్ అతుల్ ఖన్నానూ అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామన్నారు.

## కంచికచర్ల తహసీల్దార్ కార్యాలయంలో అగ్నిప్రమాదం

### - పలు రికార్డులు అగ్నికి ఆహుతి

**నందిగామ జనవరి 9( వెలుతురు):**
ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండల తహసీల్దార్ కార్యాలయంలో అగ్నిప్రమాదం జరిగింది. ఘటనలో పలు రికార్డులు అగ్నికి ఆహుతి అయ్యాయి. తహశీల్దార్ ఆఫీస్ బయట చలి మంట వేయటం వలన నిప్పురవ్వలు కార్యాలయంలో ఉన్న రికార్డు గదిలో పడడంతో మంటలు చెలరేగినట్లు అనుమానం. అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేసింది.

## ఫాతిమా షేక్ కు సీఎం రేవంత్ నివాళులు

**హైదరాబాద్ జనవరి 9( వెలుతురు):**
సంఘ సంస్కర్త, సావిత్రిబాయి పూలే సహోపాధ్యాయి, బాలికా విద్య, మహిళల అభ్యున్నతికి కృషి చేసిన వైతాళికురాలు ఫాతిమా షేక్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ మహనీయురాలికి ఘనంగా నివాళులు అర్పించారు. ఆధునిక భారత తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలిగా ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారని స్మరించుకున్నారు.

## అగ్రి యూనివర్సిటీలో పరీక్షా పత్రాల లీక్

### - ఇది రేవంత్ మార్క్ ప్రభుత్వ వైఫల్యం - హరీష్ రావు

**హైదరాబాద్ జనవరి 9( వెలుతురు):**
ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన పరీక్షా పత్రాల లీక్ ఘటన, పరీక్షల నిర్వహణలో ప్రభుత్వ చేతగాని తనాన్ని, అసమర్థతను, అవినీతిని బట్టబయలు చేస్తోందని మాజీ మంత్రి బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు.
మొన్నటి పీజీ వైద్య విద్య పరీక్షల్లో బయటపడిన మెడికల్ స్కాం ఇంకా మరువకముందే, ఇప్పుడు అగ్రికల్చర్ బీఎస్సీ పరీక్షల్లో ప్రశ్నాపత్రాలను వాట్సాప్ ద్వారా ముందుగానే లీక్ చేసి, ఏఐ పెన్లతో రాసిన మోడరన్ స్కాం రాష్ట్రాన్నిగ్భ్రాంతికి గురి చేస్తోంది. ఇంత బహిరంగంగా, అక్రమంగా పరీక్షలు జరుగుతుంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తున్నట్లు? విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుంటే, ఈ ప్రభుత్వం ఎందుకు మొద్దు నిద్రలో మునిగి ఉందని నిలదీసారు. మార్పు తెస్తామంటూ అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, రెండేళ్ల వ్యవధిలోనే స్కాంలకు చిరునామాగా మారడం దురదృష్టకరం. చివరకు విద్యా సంస్థలు సైతం అవినీతికి కేంద్రంగా మారడం రాష్ట్ర ప్రభుత్వ దిగజారుడు తనానికి, రేవంతు రెడ్డి విలువల్లేని తనానికి నిదర్శనం. రేవంత్ రెడ్డి "కాదేదీ స్కాంకు అనర్హం" అని చెప్పడమే కాకుండా, చేసి చూపిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వడం చేతకాదు, పరీక్షలను సక్రమంగా నిర్వహించడం చేతకాదు..ఇది రేవంత్ మార్క్ ప్రభుత్వ వైఫల్యం. పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడిన అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని బీఆర్ఎస్ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.

## 11 లక్షల ఉద్యోగాలే లక్ష్యం



**హైదరాబాద్ జనవరి 9( వెలుతురు):**
తెలంగాణను ప్రపంచ ఐటీ పటంలో అగ్రస్థానంలో నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ), ఇమేజ్ 2.0 వంటి నూతన విధానాలను అమలు చేస్తోంది. 2025-26 నాటికి రూ.3.60 లక్షల కోట్ల ఐటీ ఎగుమతులు, 11 లక్షల ఉద్యోగాలే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి దావోస్ పర్యటన ద్వారా అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించి, హైదరాబాద్‌ను జీసీసీ హబ్‌గా మార్చనున్నారు. యానిమేషన్, గేమింగ్ రంగాల కోసం ఇమేజ్ 2.0 విధానాన్ని తెస్తూ.. సృజనాత్మక రంగంలో యువతకు ఉపాధి పెంచనున్నారుతెలంగాణను ప్రపంచ ఐటీ రంగంలో అగ్రస్థానంలో నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త వ్యూహాలతో ముందుకు సాగుతోంది. ముఖ్యంగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) పాలసీ, ఇమేజ్ 2.0 విధానాలను ప్రవేశపెట్టడం ద్వారా భారీగా పెట్టుబడులను ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2025-26 ఆర్థిక సంవత్సరం నాటికి ఐటీ ఎగుమతులను రూ.3.60 లక్షల కోట్లకు చేర్చడమే కాకుండా.. దాదాపు 11 లక్షల మందికి ఉపాధి కల్పించాలని ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు పాల్గొననున్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రపంచ స్థాయి కంపెనీల సీఈఓలతో సమావేశమై హైదరాబాద్‌ను ప్రధాన ఐటీ హబ్‌గా ప్రదర్శించనున్నారు. కృత్రిమ మేధ, సైబర్ సెక్యూరిటీ, డేటా అనలిటిక్స్ వంటి రంగాల్లో పనిచేసే గ్లోబల్ కంపెనీలను రాష్ట్రానికి తీసుకురావడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం.వినోద, సాంకేతిక రంగాల కలయికతో 'ఇమేజ్ 2.0' పాలసీని ప్రభుత్వం రూపొందిస్తోంది. ఇది కేవలం సాఫ్ట్‌వేర్ రంగమే కాకుండా యానిమేషన్, గేమింగ్, విజువల్ ఎఫెక్ట్స్ (ఎఈచీ) విభాగాల్లో తెలంగాణను గ్లోబల్ హబ్‌గా మారుస్తుంది. దీనివల్ల కళాత్మక నైపుణ్యం ఉన్న యువతకు హై-స్కిల్ ఉద్యోగాలు లభిస్తాయి. మెటావర్స్, డిజిటల్ కంటెంట్ తయారీలో మరిన్ని స్టార్టప్‌లు వచ్చేలా రాయితీలు కల్పించనున్నారు. కొత్త విధానాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం పరిశ్రమల నుంచి నేరుగా నిపుణులను కన్సల్టెంట్లుగా నియమించుకోవాలని నిర్ణయించింది. ప్రభుత్వ యంత్రాంగంలో ఉన్న నైపుణ్య లోటును భర్తీ చేసేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుంది. అంతర్జాతీయ సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరపడానికి.. పెట్టుబడి ప్రతిపాదనలను వేగంగా ఆమోదించడానికి ఈ నిపుణుల బృందం పని చేస్తుంది. ఈ చర్యల ద్వారా తెలంగాణ కేవలం సేవల రంగంలోనే కాకుండా.. పరిశోధన మరియు అభివృద్ధి ) విభాగాల్లోనూ అగ్రగామిగా నిలవనుంది. మిషన్ 2047 లక్ష్యంలో భాగంగా రాష్ట్ర ఆదాయాన్ని పెంచడంతోపాటు.. అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావడానికి ఈ సరికొత్త ఐటీ పాలసీలు కీలకం కానున్నాయి.

## నకిలీ విలేఖరుల హల్చల్

**రంగారెడ్డి జనవరి 9( వెలుతురు):**





రంగారెడ్డి జిల్లా కొత్తూరు మున్సిపాలిటీలో గురువారం సాయంత్రం నకిలీ విలేఖరులు హల్చల్ చేశారు. మీడియా పేరుతో ఐదు మంది ఓ గ్యాస్ రీఫిలింగ్ దుకాణంలోకి చొరబడి వీడియోలు తీశారు. సదరు వ్యాపారి తస్లీమ్ ను బెదిరించి రూ.లక్ష డిమాండ్ చేశారు. అందుకు ఆమె అంత ఇచ్చుకోలేనని ప్రాధేయపడటంతో రూ.10 వేలకు బేరం కుదిరింది. ఆ డబ్బులు తీసుకువచ్చేందుకు వెళ్లిన ఆమె అనుమానంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్ కు తరలించారు. విచారణలో భాగంగా హైదరాబాద్ కు చెందిన శ్రీనివాసరావు, వాణి, స్వప్న, కీర్తి, నాగమల్లేష్ గా గుర్తించారు. ఒకరి నుండి శుభోదయం, మరొకరి నుండి జీకే టీవీ పేరుతో ఉన్న ప్రైవేట్ ఐడి కార్డులు లభించాయి. వ్యాపారిని బెదిరించినందుకు, నకిలీ గుర్తింపు కార్డులుగా అనుమానించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై గోపాలకృష్ణ వివరించారు. వీరి నుండి సెల్ ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నారు.

## ఇదేం... దాడి...

### మహిళా అధికారి క్యారెక్టర్ పై కథనాలా

**హైదరాబాద్, జనవరి 9( వెలుతురు):**
రాజకీయ నేతలు రాజకీయ కుట్రల కోసం హద్దులు దాటిపోతూంటారు. ఇప్పటి వరకూ రాజకీయ నేతలు.. రాజకీయ నేతలపై కుట్రలు చేసుకుంటూ..తప్పుడు ప్రచారాలు చేసుకుంటూ ఉంటారు. కానీ తెలంగాణలో ఇది మరో స్థాయికి దిగజారిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలేయడానికి.. ఓ మంత్రి అంటూ.. మరో ఐఏఎస్ అధికారిణి పేరును లింక్ పెట్టి తప్పుడు ప్రచారాలు ప్రారంభిస్తున్నారు. ఓ ఊరూపేరూ లేని చానల్ లో ఆ కథనాన్ని ప్రసారం చేయిస్తున్నారు. తర్వాత ఆ వీడియోను బీఆర్ఎస్ సోషల్ మీడియాకు చెందిన వారు పోస్టు చేసి.. ఆ మంత్రి ఎవరు.. ఆ ఐఏఎస్ అధికారి ఎవరూ అంటూ క్విజ్ ప్రోగ్రాం పెట్టి వైరల్ చేస్తున్నారు. రాజకీయ నేతలు తమపై బురద చల్లించుకోవడానికి.. ఎదుటి వారిపై చల్లడానికి రెడీగా ఉంటారు. కానీ ఈ విషయంలోకి మహిళా ఐఏఎస్ అధికారిని తీసుకు రావడమే అత్యంత వివాదాస్పదమైన అంశంగా మారింది.గౌరవప్రదమైన స్థానంలో ఉన్న మహిళా ఐఏఎస్ అధికారిణిని లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న సోషల్ మీడియా తప్పుడు ప్రచారం, కొన్ని వార్తా సంస్థల తీరు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రాజకీయ ప్రయోజనాల కోసం ఒక అధికారిణి వ్యక్తిత్వాన్ని హననం చేయడం ఆమె కుటుంబాన్ని ఈ వివాదంలోకి లాగడంపై పౌర సమాజం నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఎటువంటి ఆధారాలు లేకుండా, కేవలం ఊహాగానాలతో ఆమె వ్యక్తిగత జీవితంపై అసభ్యకరమైన ఆరోపణలు చేస్తున్నారు. పరోక్షంగా కాకుండా, దాదాపు నేరుగా ఆమెను ఉద్దేశిస్తూ చేస్తున్న వ్యాఖ్యలు జర్నలిజం విలువలకే మచ్చ తెచ్చేలా ఈ కథనాలు ఉంటున్నాయి.ఈ వివాదంలో బీఆర్ఎస్ పార్టీ అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్స్, ఆ పార్టీ మద్దతుదారులు, సోషల్ మీడియా కార్యకర్తలు సానుభూతి చూపిస్తున్నట్లుగా నటిస్తూ.. ట్వీట్లు చేస్తున్నారు. ఆ వీడియోను కావాలని వైరల్ చేస్తున్నారు. వారి ప్రమేయం ఉండ బట్టే వాటిని ఇలా వైరల్ చేస్తున్నారని అనుకోవచ్చు. ఒక ఉన్నత స్థాయి అధికారిణి ప్రతిష్టను దెబ్బతీసేలా అసభ్యకరమైన గాసిప్స్‌ను వీరు వ్యాప్తి చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పైకి సానుభూతి చూపిస్తున్నట్లు నటిస్తూనే, లోలోపల అసత్య ప్రచారాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లే వ్యూహాన్ని వీరు అమలు చేస్తున్నారు.రాజకీయ పార్టీలు తమ ప్రత్యర్థులపై పైచేయి సాధించడానికి అనేక మార్గాలను అన్వేషించవచ్చు, కానీ ఒక మహిళా అధికారిణి వ్యక్తిత్వాన్ని హననం చేయడం, ఆమె క్యారెక్టర్‌ను తక్కువ చేసి చూపడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. కేవలం సదరు అధికారిణిని మాత్రమే కాకుండా, ఆమె కుటుంబాన్ని కూడా ఈ వివాదాల్లోకి లాగడంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. వ్యక్తిగత ప్రతిష్టను మంటగలిపేలా జరుగుతున్న ఈ దాడులు సదరు అధికారిణి మానసిక ధైర్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని, ఇది వ్యవస్థకే ప్రమాదకరం. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న మహిళా అధికారులకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది. ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్న అభిప్రాయం అధికారవర్గాల్లో వినిపిస్తోంది.

## పీవీ పేరిట జిల్లా...




**కరీంనగర్, జనవరి 9( వెలుతురు):**
తెలంగాణలో జిల్లాల పునర్వ్యవస్థీకరణపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలతో కొత్త జిల్లాల డిమాండ్లు ఊపందుకున్నాయి. గతంలో జరిగిన విభజన అశాస్త్రీయమని మంత్రి అనడంతో.. హుజూరాబాద్‌ను జిల్లాగా ప్రకటించాలని స్థానికులు ఉద్యమిస్తున్నారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జన్మస్థలమైన ఈ ప్రాంతాన్ని ఆయన పేరు మీదనే 'పీవీ నరసింహారావు జిల్లా'గా ఏర్పాటు చేయాలని కోరుతూ భారీ ర్యాలీ నిర్వహించారు. పరిపాలన ప్రజలకు దగ్గరవ్వాలంటే హుజూరాబాద్ జిల్లా కేంద్రం కావడం అవసరమని నాయకులు స్పష్టం చేశారు. మంత్రి హామీ మేరకు ప్రభుత్వం త్వరలోనే ఈ దిశగా సానుకూల నిర్ణయం తీసుకోవాలని, భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం చేపట్టిన జిల్లాల విభజన అశాస్త్రీయంగా జరిగిందని.. దానిని పునర్వ్యవస్థీకరిస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అసెంబ్లీలో చేసిన ప్రకటన ఇప్పుడు కొత్త చర్చకు దారితీసింది. ముఖ్యంగా కరీంనగర్ జిల్లాలోని హుజూరాబాద్ ప్రాంత ప్రజలు తమ ప్రాంతాన్ని జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఉద్యమ బాట పట్టారు. రాష్ట్రంలోని మండలాల నుంచి జిల్లాల వరకు విభజన ప్రక్రియ ప్రజల సౌలభ్యం కంటే రాజకీయ ప్రయోజనాల కోసమే జరిగిందని మంత్రి విమర్శించారు.ఒకే నియోజకవర్గంలోని మండలాలు వేర్వేరు జిల్లాల పరిధిలోకి వెళ్లడం వల్ల పరిపాలన పరంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. దీనిపై అధికారుల నుంచి సమగ్ర నివేదిక తెప్పించి.. అసెంబ్లీలో చర్చించిన తర్వాతే మార్పులు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలోనే ఏ ప్రాతిపదికన జిల్లాలను మారుస్తారో అనే అంశంపై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.మంత్రి వ్యాఖ్యల నేపథ్యంలో.. హుజూరాబాద్ పట్టణాన్ని కేంద్రంగా చేసుకుని కొత్త జిల్లాను ఏర్పాటు చేయాలని స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. మాజీ ప్రధాని, దివంగత నేత పీవీ నరసింహారావు ఈ గడ్డ బిడ్డ కావడంతో.. ఆయన గౌరవార్థం ఈ జిల్లాకు 'పీవీ నరసింహారావు జిల్లా' అని పేరు పెట్టాలని వారు కోరుతున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం నుంచి అంబేద్కర్ కూడలి వరకు సాగిన ఈ ర్యాలీలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. సైదాపూర్ క్రాసింగ్ వద్ద ఉన్న పీవీ విగ్రహానికి పూలమాలలు వేసి తమ నిరసనను విన్నవించారు.హుజూరాబాద్ నియోజకవర్గం చుట్టుపక్కల ఉన్న మండలాలకు ఇది కీలకమైన వాణిజ్య కేంద్రంగా ఉంది. జిల్లా కేంద్రమైన కరీంనగర్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే అన్ని ప్రభుత్వ సేవలు అందేలా జిల్లా హోదా కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. తెలంగాణలో ప్రస్తుతం 33 జిల్లాలు ఉన్నాయి. ప్రజల డిమాండ్ మేరకు కొత్త జిల్లాలను ఏర్పాటు చేయాలంటే ప్రభుత్వం భౌగోళిక సరిహద్దులు, జనాభా ప్రాతిపదికన పలు అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి.హుజూరాబాద్ వంటి ప్రాంతాల్లో జిల్లా కార్యాలయాల ఏర్పాటుకు అవసరమైన భూమి, భవనాల సౌకర్యాలను ప్రభుత్వం సమీక్షించాల్సి ఉంటుంది. కొత్త జిల్లాల ఏర్పాటు వల్ల కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం వంటి మౌలిక సదుపాయాల కోసం భారీగా నిధులు అవసరమవుతాయి. మంత్రి పొంగులేటి చెప్పినట్లుగా కేబినెట్‌లో చర్చించి.. అన్ని పార్టీల అభిప్రాయాలను తీసుకున్న తర్వాతే తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం హుజూరాబాద్ ప్రజలు చేస్తున్న డిమాండ్ ప్రభుత్వం దృష్టికి వెళ్ళింది. రాబోయే పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో ఈ విజ్ఞప్తిని ప్రభుత్వం ఎలా పరిగణనలోకి తీసుకుంటుందో వేచి చూద్దాం.

## మహిళల సేఫ్టీలో తెలంగాణ ఫోర్త్ ప్లేస్

**హైదరాబాద్ జనవరి 9( వెలుతురు):**




దేశంలోనే మహిళలకు బెస్ట్ సిటీగా బెంగళూరు రికార్డు సృష్టించింది. టాప్ సిటీస్ ఫర్ ఉమెన్ ఇన్ ఇండియా 2025 నివేదిక ప్రకారం.. మహిళా సాధికారత, ఉద్యోగ అవకాశాల్లో బెంగళూరు దేశంలోనే నంబర్ 1 నగరంగా నిలిచింది. భద్రతలో మొదటి స్థానంలో చెన్నై ఉండగా.. హైదరాబాద్ నాలుగో స్థానంలో నిలిచింది. మొత్తం మీద దక్షిణ, పశ్చిమ భారతదేశ నగరాలు మహిళలకు అత్యంత సురక్షితమైన, వృద్ధిని ఇచ్చే ప్రాంతాలుగా తమ ఆధిపత్యాన్ని చాటుకున్నాయి.తమిళనాడు రాజధాని చెన్నైకి చెందిన అవతార్ గ్రూప్ అనే ప్రముఖ వర్క్‌ప్లేస్ ఇంక్లూజన్ సంస్థ 2025 ఏడాదికి గానూ దేశంలోని వివిధ నగరాలపై.. పలు అంశాలపై అధ్యయనం నిర్వహించింది. ఈ తాజా అధ్యయనంలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. 2025లో భారతదేశంలో మహిళలు నివసించడానికి, పనిచేయడానికి అత్యంత అనుకూలమైన నగరంగా కర్ణాటక రాజధాని బెంగళూరు అగ్రస్థానంలో నిలిచింది. ఈ రిపోర్ట్‌లో మొత్తం దేశంలోని 125 నగరాలను విశ్లేషించి.. సిటీ ఇంక్లూజన్ స్కోర్ (సీఐఎస్) ఆధారంగా ఆయా నగరాలకు అవతార్ గ్రూప్ ర్యాంకులను కేటాయించారు.మొత్తం స్కోరులో 53.29 పాయింట్లతో మొదటి స్థానంలో బెంగళూరు నిలిచింది. ఆ తర్వాత 49.86 పాయింట్లతో చెన్నై రెండో స్థానంలో నిలిచింది. ఇక టాప్ -5లో ఉన్న పుణె (46.27).. హైదరాబాద్ (46.04).. ముంబై (44.49) వరుసగా నిలిచాయి. ప్రధానంగా రెండు అంశాల మీద ఆధారపడి ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. ఒకటి సామాజిక భద్రత, జీవన ప్రమాణాలను కొలిచే సోషల్ ఇంక్లూజన్ స్కోర్.. రెండోది ఉద్యోగ అవకాశాలు, పని వాతావరణాన్ని కొలిచే ఇండస్ట్రియల్ ఇంక్లూజన్ స్కోర్.మహిళల భద్రత, ప్రభుత్వ సేవలు, విద్య, ఆరోగ్య సదుపాయాల విషయంలో చెన్నై నగరం దేశంలోనే అగ్రస్థానాన్ని దక్కించుకుంది. అయితే.. బలమైన కార్పొరేట్ వ్యవస్థ, స్టార్టప్‌లు, విస్తృతమైన ఉద్యోగ అవకాశాల కారణంగా బెంగళూరు పారిశ్రామిక విభాగంలో అగ్రస్థానంలో నిలిచి ఓవరాల్‌గా నంబర్ 1 నగరంగా మారింది. హైదరాబాద్, పుణె నగరాలు అటు సామాజిక భద్రతలోనూ.. ఇటు ఉద్యోగ అవకాశాలలోనూ సరైన సమతుల్యతను కలిగి ఉన్నాయని ఈ నివేదిక వెల్లడించింది.ఈ నివేదికలోని మరో ఆసక్తికరమైన అంశం ఏంటంటే.. టాప్ 10 నగరాల జాబితాలో దక్షిణ భారతదేశం నుంచి.. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, తిరువనంతపురం, కోయంబత్తూర్ అనే 5 నగరాలు చోటు దక్కించుకున్నాయి. ఇది దక్షిణ భారత్‌లో మహిళలకు ఉన్న సురక్షితమైన, వృద్ధిదాయకమైన వాతావరణాన్ని ప్రతిబింబిస్తోంది. ఉత్తర భారతదేశం నుంచి.. గురుగ్రామ్ ఒక్కటే 6వ స్థానంలో నిలిచి టాప్ 10 నగరాల జాబితాలో చేరింది.

## శాటిలైట్ సాయంతో... సంక్రాంతికి ట్రాఫిక్ క్లియర్....

**నల్గొండ, జనవరి 9( వెలుతురు):**
తెలుగు రాష్ట్రాల్లో అత్యంత రద్దీగా ఉండే రహదారుల్లో హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారి ప్రధానమైంది. ముఖ్యంగా సంక్రాంతి , దసరా వంటి పండుగ సమయాల్లో ఈ రోడ్డుపై వాహనాల రద్దీ ఏ స్థాయిలో ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.
కిలోమీటర్ల మేర బారులు తీరే వాహనాలు, టోల్ ప్లాజాల వద్ద గంటల తరబడి వేచి చూడటం ప్రయాణికులకు ఒక నరకంలా మారుతోంది. అయితే, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అడుగులు వేస్తోంది. తాజాగా యాదాద్రి జిల్లాలోని పంతంగి టోల్ ప్లాజా వద్ద శాటిలైట్ ఆధారిత టోల్ వసూలు విధానాన్ని ప్రయోగాత్మకంగా పరీక్షించారు.
గురువారం
సాయంత్రం పంతంగి టోల్ ప్లాజాలో మొత్తం 16 టోల్ బూత్‌లు ఉండగా విజయవాడవైపు వెళ్లే మార్గంలో 8 బూత్‌లను ఈ పరీక్ష కోసం కేటాయించారు. దాదాపు అరగంటపాటు సాగిన ఈ ట్రయల్ రన్‌లో శాటిలైట్ సాంకేతికత పనితీరును అధికారులు నిశితంగా పరిశీలించారు. ఈ నూతన విధానంలో వాహనం టోల్ ప్లాజా వద్ద ఆగాల్సిన అవసరం ఉండదు. శాటిలైట్, హై-స్పీడ్ కెమెరాల సాయంతో వాహనం, నంబర్‌ను గుర్తించి, సెన్సార్ల ద్వారా ఆటోమేటిక్‌గా టోల్ ఫీజు కట్ చేస్తారు. ఈ ప్రక్రియ ఎంత వేగంగా జరుగుతుందంటే, కేవలం 3 సెకన్లలోనే ఫాస్టాగ్ స్కాన్ పూర్తవుతుంది. దీని వల్ల నిమిషానికి 20 వాహనాలు ఎటువంటి ఆటంకం లేకుండా ప్లాజాను దాటి వెళ్లే అవకాశం ఉంటుంది.



అక్కడ హ్యాండ్ గన్ ద్వారా ఫాస్ట్‌గన్‌లను స్కాన్ చేసి ట్రాఫిక్ వేగంగా క్లియర్ చేసేందుకు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న ఫాస్టాగ్ విధానం వల్ల పాత నగదు చెల్లింపుల కంటే సమయం ఆదా అవుతున్నప్పటికీ, వాహనాలు గేట్ల వద్ద ఆగాల్సిన వస్తోంది. కానీ శాటిలైట్ ఆధారిత విధానం వల్ల కలిగే ప్రయోజనాలు చాలా ఉన్నాయి.
జీరో నిరీక్షణ సమయం: వాహనాలు వేగాన్ని తగ్గించకుండా టోల్ చెల్లింపు పూర్తి చేయవచ్చు. ఇంధన ఆదా: ట్రాఫిక్ జామ్‌లలో ఇంజిన్ ఆన్ చేసి ఉంచడం వల్ల వృథా అయ్యే ఇంధనం ఆదా అవుతుంది. పర్యావరణ హితం: వాహనాల కాలుష్యం తగ్గుతుంది.పారదర్శకత: శాటిలైట్ ట్రాకింగ్ వల్ల టోల్ వసూళ్లలో అక్రమాలకు తావుండదు.
హైదరాబాద్- విజయవాడ హైవేపై ప్రస్తుతం పంతంగి వద్ద మాత్రమే ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. ఇది విజయవంతం అయితే దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రధాన టోల్ ప్లాజాల్లో దీనిని విస్తరించనున్నారు.

### ట్రయల్ రన్‌లో ఎదురైన సవాళ్లు

ఏదైనా కొత్త సాంకేతికతను ప్రవేశ పెట్టినప్పుడు ప్రారంభంలో కొన్ని ఇబ్బందులు సహజం. పంతంగి వద్ద నిర్వహించిన పరీక్షల్లో కూడా కొన్ని సాంకేతిక లోపాలు వెలుగులోకి వచ్చాయి. కొన్ని వాహనాలు ప్లాజా దాటుతున్నప్పుడు సెన్సార్లు సరిగా స్పందించకపోవడం, టోల్ వసూలు కాకపోవడం వంటి అంశాలను గుర్తించారు. ఈ లోపాలను సరిదిద్దే పనిలో ప్రస్తుతం ఔఊంఎ, టోల్‌ప్లాజా సాంకేతిక నిపుణులు నిగ్నమయ్యారు. రాబోయే సంక్రాంతి రద్దీని దృష్టిలో ఉంచుకొని, ఒక వేళ వాహనాల సంఖ్య విపరీతంగా పెరిగితే, అదనంగా రెండు బూత్‌లను కూడా అందుబాటులోకి తెచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు.

# ఐదేళ్లు కాలక్షేపాలతో కాలం గడిపిన జగన్

**- అమరావతి రైతుల ఉసురు తీసారు**

**- మండిపడ్డ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**



**అమరావతి, జనవరి 9( వెలుతురు):**
ఐదేళ్లపాటు కాంట్రాక్టర్ల వద్ద కమిషన్లకే జగన్ కాలం వెళ్లదీశారని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మండిపడ్డారు. రాజధాని అమరావతిని నీరుగార్చినందుకు ఆ గ్రామాల ప్రజలు ఇప్పటికీ జగన్ను ఛీకొడుతున్నారని మంత్రి వ్యాఖ్యానించారు. ఈ మేరకు వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డిపై మంత్రి మరోసారి మండిపడ్డారు.జగన్ శైలి పైనేమో మృదుత్వంగా.. లోపల మాత్రం కర్కషత్వంగా ఉంటుందని వ్యాఖ్యానించారు. ప్రజలు జగన్ను తిరస్కరిస్తే దానికి ప్రజలే తప్పుచేశారనడం ఆయన అవివేకానికి నిదర్శనమని ఆనం అన్నారు. గంజాయి బ్యాచ్‌ను ప్రోత్సహించి జగన్ యువశక్తిని నిర్వీర్యం చేశారు. తన ఉనికిని కాపాడుకునేందుకు రాష్ట్రానికి అంతా మంచే చేశానంటున్నాడు. కుప్పంలోని హంద్రీ–నీవా కాలువలో ఆర్టిఫిషియల్ నీరు పారించిన ఘనుడు జగన్. తన హయాంలో అమాయకులను వాడుకుని వారి జీవితాలను నాశనం చేశాడు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు ముందుకొస్తుంటే.. వైసీపీ జీర్ణించుకోలేకపోతోంది. విధ్వంసం చేయడం, అరాచకాలు సృష్టించడం వైసీపీ సిద్ధాంతం. ప్రాజెక్టులు పూర్తిచేసి ప్రతి ఎకరాకు నీరివ్వాలనే తపన, తాపత్రయం చంద్రబాబు ప్రభుత్వానిది’ అని ఆనం చెప్పుకొచ్చారు. రాష్ట్రం.. జగన్ హయాంలో కరవు కాటకాలతో ఉంటే, చంద్రబాబు హయాంలో సస్యశ్యామలంగా ఉంటుందని వైసీపీ పాలనాతీరుపై దుమ్మెత్తిపోశారు.

# టీటీడీ పాలకమండలికి జంగా కృష్ణమూర్తి రాజీనామా

**- రాజీనామాను సీఎం చంద్రబాబుకు చేరవేత**



**అమరావతి, జనవరి 9( వెలుతురు):**
తిరుమల తిరుపతి దేవస్థానం టీటీడీ పాలకమండలి సభ్యత్వానికి జంగా కృష్ణమూర్తి రాజీనామా చేశారు. ఈ మేరకు శుక్రవారం తన రాజీనామా లేఖను సీఎం చంద్రబాబు నాయుడుకి పంపారు. తన రాజీనామాను వెంటనే ఆమోదించాలంటూ ఆ లేఖలో సీఎం చంద్రబాబుకు జంగా కృష్ణమూర్తి విజ్ఞప్తి చేశారు. ఈ పదవికి రాజీనామా చేయడానికి గల కారణాలను ఆ లేఖలో జంగా వివరించినట్లు తెలుస్తోంది. తంలో తనకు కేటాయించిన బాలాజీనగర్‌లో ప్లాట్ నెంబర్ 2 నేటికీ ఖాళీగానే ఉందని.. దీనిని తనకు కేటాయించాలంటూ ప్రభుత్వాన్ని కోరారని సమాచారం. దీనిని టీటీడీ బోర్డుకు ప్రభుత్వం పంపడంతో.. ఆమోదముద్ర పడినట్లు తెలుస్తోంది. అయితే గురువారం జరిగిన కేబినెట్ భేటీలో ఈ భూ కేటాయింపును రద్దు చేసినట్లు సమాచారం. దాంతో ఆయన టీటీడీ సభ్యత్వ పదవికి రాజీనామా చేశారనే ప్రచారం సాగుతోంది. 2024 ఎన్నికలకు కొన్ని రోజుల ముందు వైసీపీకి జంగా కృష్ణమూర్తి రాజీనామా చేశారు. అనంతరం ఆయన టీడీపీలో చేరారు. ఈ ఎన్నికల్లో కూటమికి ఓటరు పట్టం కట్టాడు. దాంతో చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. అనంతరం నామినేటెడ్ పోస్టుల భర్తీకి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. దాంతో టీటీడీ చైర్మన్‌గా బీఆర్ నాయుడుని నియమించి.. పాలక మండలి సభ్యులుగా పలువురుని నియమించారు. ఆ జాబితాలో జంగా కృష్ణమూర్తికి స్థానం కల్పించారు. ఇక టీడీపీలో చేరక ముందు జంగా కృష్ణమూర్తి వైసీపీలో ఉన్నారు. పల్నాడులోని గురజాలకు చెందిన ఆయనకు ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ ఎమ్మెల్సీ పదవి కేటాయించారు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈయనకు టీటీడీ చైర్మన్ పదవి కేటాయిస్తారంటూ ఒక ప్రచారం సాగింది. టీటీడీ చైర్మన్ పదవికి వైవీ సుబ్బారెడ్డి రాజీనామా చేసిన తర్వాత ఈ పదవి జంకాను వరిస్తుందని.. చర్చ జరిగింది. కానీ ఆ పదవిని భూమన కరుణాకర్ రెడ్డికి వైఎస్ జగన్ కేటాయించిన విషయం విదితమే. దీంతో ఆయన టిడిపిలో చేరారు.

# అలాస్కా టూర్‌కు వెళ్లిన విద్యార్థి అదృశ్యం

**- పది రోజులయినా జాడ తెలియక ఆందోళన**

**- దర్యాప్తు చేపట్టిన అమెరికా పోలీసులు**

**గుంటూరు, జనవరి 9( వెలుతురు):**
గుంటూరుకు చెందిన హరి కృష్ణారెడ్డి కరసాని అమెరికాలోని అలాస్కా రాష్ట్రంలో అదృశ్యమవడం కలకలం రేపుతోంది. ప్రకృతి అందాలను ఆస్వాదించాలని వెళ్లిన తెలుగు విద్యార్థి కనిపించకుండా పోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు జిల్లా అద్దంకికి చెందిన హరి కృష్ణారెడ్డి హ్యూస్టన్‌లో ఉంటున్నారు. క్రిస్మస్ సెలవులు రావడంతో అలాస్కాకు వెళ్లాలని అనుకున్నారు. ఈ క్రమంలో డిసెంబర్ 22న ఒంటరిగానే హరి అలాస్కా పర్యటనకు బయలుదేరి వెళ్లారు. డెనాలి సమీపంలోని ఓ హోటల్‌లో బస చేశారు. తాను అలాస్కా పర్యటనకు వెళ్తున్నానని.. జనవరి 3 లేదా 4న తిరిగి వస్తానని తన రూమ్మేట్స్‌కు చెప్పారు. ఒంటరిగా అలాస్కా వెళ్లిన తెలుగు విద్యార్థి.. డిసెంబర్ 30న తన స్నేహితులతో చివరిసారిగా మాట్లాడారు. డిసెంబర్ 31 నుంచి అతడి ఫోన్ స్విచ్ ఆఫ్ అయినట్లు తెలుస్తోంది. డిసెంబర్ 31నే హరి హోటల్ నుంచి చెక్ అవుట్ అయినట్లు సమాచారం. హరికి డ్రైవింగ్ రాకపోవడంతో ఎక్కడి వెళ్లినా క్యాబ్ సర్వీస్‌ను




ఉపయోగిస్తుంటారు. లేదా స్థానిక రవాణాపైనే ఆధారపడాల్సి వచ్చేది. ఈ క్రమంలో డిసెంబర్ 31న హోటల్ నుంచి బయటకు వచ్చిన హరి.. క్యాబ్ సర్వీస్ వాడినట్లు తెలుస్తోంది. దీంతో హరి ఆ క్యాబ్‌లో ఎక్కడికి వెళ్లారు?.. క్యాబ్ డ్రైవర్ ఎవరు? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అంతేకాకుండా ఈ కేసులో హరి క్రెడిట్ కార్డ్ లావాదేవీలు కూడా కీలకంగా మారాయి. వారం రోజులుగా హరి కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు భయాందోళనకు గురవుతున్నారు. హరి గురించి ఎలాంటి సమాచారం లేకపోవడం, ఫోన్ కలవకపోవడంతో పాటు సోషల్ మీడియాలో కూడా యాక్టివిటీ ఆగిపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. అమెరికాలోని స్థానిక పోలీసులు, తెలుగు అసోసియేషన్ ప్రతినిధులు.. హరి కోసం గాలిస్తున్నారు. ’ఒకవైపు తీవ్రమైన మంచు తుఫాన్, మరోవైపు మైనస్ 40 డిగ్రీల చలి.. ఈ పరిస్థితుల్లో హరి క్షేమంగా తిరిగి రావాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నాం’ అని ఆయన స్నేహితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక.. అలాస్కాలో ఉష్ణోగ్రతలు మైనస్ 40 డిగ్రీల ఫారెన్‌హీట్‌కు పడిపోయాయి. ఇలాంటి వాతావరణంలో కొన్ని నిమిషాల పాటు బయట ఉన్నా శరీరం గడ్డకట్టడం, హైపోథెర్మియా వంటి ప్రాణాంతక స్థితికి వెళ్లే ప్రమాదం ఉంటుంది. అంతేకాకుండా అలాంటి ప్రదేశంలో సరైన నెట్‌వర్క్ ఉండదు. ఇటువంటి పరిస్థితుల్లో ఒంటరిగా ప్రయాణిస్తే సెల్‌ఫోన్ సిగ్నల్స్ లేక ఇతరుల సహాయం కోరడం కూడా కష్టతరంగా మారే అవకాశం ఉంటుంది. హరి అదృశ్య ఘటన విదేశాల్లో ఉన్న భారతీయ విద్యార్థులకు ఒక హెచ్చరికగా మారింది. ముఖ్యంగా చలి ఎక్కువగా ఉండే ప్రాంతాలకు వెళ్లేటప్పుడు, ఒంటరి ప్రయాణాలు చేయవద్దని, ఎప్పటికప్పుడు కుటుంబసభ్యులకు లోకేషన్లు షేర్ చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

# స్లీపర్ బస్సు ప్రమాదాల నివారణకు చర్యలు

**- గుర్తింపు పొందిన సంస్థలకే తయారీ పనులు**

**- గతేడాది ప్రమాదాలతో కేంద్రం నిర్ణయం**

**న్యూఢిల్లీ, జనవరి 9( వెలుతురు):**
స్లీపర్ బస్సు ప్రమాదాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై స్థానికంగా పనిచేసే మాన్యువల్ స్లీపర్ బస్సు బాడీ బిల్డర్లకు కాకుండా.. కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆటోమొబైల్ కంపెనీలు, తయారీ సంస్థలకే బస్సుల తయారీకి అనుమతి ఉంటుందని కేంద్ర రోడ్డు రవాణా శాఖ ప్రకటన జారీ చేసింది. గత ఏడాది దేశంలోని పలు రాష్ట్రాల్లో ఘోర బస్సు ప్రమాదాలు జరిగిన విషయం తెలిసిందే. ప్రైవేటు స్లీపర్ బస్సులు ప్రమాదానికి గురవడంతో పెద్ద సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ చర్యలకు ఉపక్రమించారు. ఏపీ, రాజస్థాన్ సహా పలు రాష్ట్రాల్లో జరిగిన బస్సు ప్రమాదాల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఈ బస్సు ప్రమాదాలకు అనేక కారణాలు ఉన్నాయని నివేదికల్లో తేలిందన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ప్రమాదాలు జరిగినట్లు బయటపడిందన్నారు. అంతే కాకుండా అగ్నిప్రమాదం జరిగిన సమయాల్లో మంటలను నియంత్రించేందుకు అవసరమైన పరికరాలు బస్సుల్లో లేకపోవడం కూడా ప్రమాదానికి కారణమైందని చెప్పారు. అలాగే బస్సుల్లో తరచూ తనిఖీలు చేపట్టకపోవడం కూడా మరో కారణమని నివేదికల్లో తేలిందని చెప్పారు. మరోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు



కేంద్ర మంత్రి వెల్లడించారు. బస్సు ప్రమాదాల నివారణకు కేంద్ర ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన సంస్థలు మాత్రమే బస్సులను తయారు చేయాలనే నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఇప్పుడు ఉన్న అన్ని స్లీపర్ బస్సుల్లో అగ్నిప్రమాద గుర్తింపు వ్యవస్థ, ప్రతి ఎమ్జన్గ÷న్సీ ఎగ్జిట్ వద్ద సుత్తి, అత్యవసర లైటింగ్ వంటి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘించే బస్సులు, అలాగే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేసే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆదేశించారు. దేశంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధునిక సాంకేతికతను వినియోగించేందుకు చర్యలు చేపట్టినట్లు కేంద్రమంత్రి తెలిపారు. కార్లలో ఉచిత స్పెక్ట్రమ్‌ను ఉపయోగించి వాహనం నుంచి వాహనానికి కమ్యూనికేషన్ టెక్నాలజీని ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ÷ఎ2÷ఎ టెక్నాలజీ ద్వారా వాహనాలు తమ వేగం, స్థానం, దిశ వంటి కీలక సమాచారాన్ని సమీప వాహనాలతో పంచుకోగలవని ఆయన వివరించారు. టెక్నాలజీ వల్ల అకస్మాత్తుగా బ్రేక్ వేసినా.. రోడ్డుపై వాహనాలు ఆగి ఉన్నా.. మిగతా వాహనాలకు అలర్ట్ వెళ్తుందని కేంద్ర మంత్రి తెలిపారు. తద్వారా ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ ఏడాది చివరి నాటికి ఈ వైర్‌లెస్ కమ్యూనికేషన్ వ్యవస్థను అన్ని వాహనాల్లో అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వెల్లడించారు. ఈ సాంకేతికత రోడ్డు భద్రతను మరింత మెరుగుపరుస్తుందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆశాభావం వ్యక్తం చేశారు.


# యాక్టివ్ పాలిటిక్స్ కు జెంటిల్ మ్యాన్ గుడ్ బై...



**విజయవాడ, జనవరి 9( వెలుతురు):**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మృదుస్వభావిగా, వివాదరహితుడిగా పేరున్న బీజేపీ సీనియర్ నేత, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు సంచలన నిర్ణయం తీసుకున్నారు. 2024 ఎన్నికల విజయం తర్వాత, తన రాజకీయ భవిష్యత్తుపై స్పష్టతనిస్తూ.. “ఇకపై ఎన్నికల్లో పోటీ చేయను.. రాజకీయాల నుంచి తప్పుకుంటా” అని ప్రకటించడం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. కేవలం తప్పుకోవడమే కాదు, తన కుటుంబం నుంచి కూడా ఎవరూ రాజకీయాల్లోకి రారని చెప్పడం ద్వారా ఆయన వారసత్వ రాజకీయాలకు తాము దూరమని స్పష్టం చేశారు.కామినేని శ్రీనివాసరావు మౌలికంగా రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి కాదు. ఆయన వృత్తి రీత్యా వైద్యుడు. లండన్ లాంటి ప్రదేశాల్లో ఉన్నత వైద్య విద్యను అభ్యసించిన ఆయన, తొలినాళ్లలో వైద్య సేవల్లోనే నిమగ్నమయ్యారు. అయితే, ఎన్టీఆర్ హయాం నుంచే ఆయనకు రాజకీయ ప్రముఖులతో, ముఖ్యంగా చంద్రబాబు నాయుడు, వెంకయ్య నాయుడు వంటి అగ్రనేతలతో సన్నిహిత సంబంధాలు ఉండేవి. ఆ సాన్నిహిత్యం, ప్రజాసేవ చేయాలనే తపన ఆయన్ని ప్రత్యక్ష రాజకీయాల వైపు నడిపించింది.2014 ఎన్నికలు కామినేని రాజకీయ జీవితంలో అత్యంత కీలకమైనవి. అప్పటి టీడీపీ–బీజేపీ పొత్తులో భాగంగా కైకలూరు నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన ఘన విజయం సాధించారు. ఆ విజయంతో చంద్రబాబు మంత్రివర్గంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఒక డాక్టర్‌గా వైద్య శాఖ మంత్రి పగ్గాలు చేపట్టడం ఆయనకు బాగా కలిసొచ్చింది. ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతం, ఎన్టీఆర్ వైద్య సేవ వంటి పథకాల అమలులో ఆయన తనదైన ముద్ర వేశారు.కామినేని శ్రీనివాసరావు రాజకీయ నిబద్ధతకు 2018 ఒక ఉదాహరణగా నిలిచింది. అప్పట్లో ఏపీకి ప్రత్యేక హోదా విషయంలో కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంపై నిరసనగా టీడీపీ కూటమి నుంచి బయటకు వచ్చింది. చంద్రబాబుతో వ్యక్తిగతంగా మంచి స్నేహం ఉన్నప్పటికీ, పార్టీ నిర్ణయానికి కట్టుబడి కామినేని మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆ సమయంలో ఆయన చేసిన ఉద్వేగభరిత ప్రసంగం అసెంబ్లీలో అందరినీ ఆకట్టుకుంది.తాజా ప్రకటనలో ఆయన చెప్పినట్లుగా.. 2019 తర్వాత ఆయన క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉండాలని భావించారు. కానీ, 2024 ఎన్నికల సమయంలో మళ్లీ పొత్తులు కుదరడం, స్థానికంగా ప్రజలు, పార్టీ శ్రేణులు, అధినాయకత్వం ఒత్తిడి తేవడంతో ఆయన పోటీ చేయక తప్పలేదు. అయితే, ఈసారి ప్రజలు ఆయనకు ఊహించని మెజారిటీని కట్టబెట్టారు. కూటమి అభ్యర్థిగా కైకలూరు నుంచి భారీ ఆధిక్యంతో గెలుపొందారు. ఈ గెలుపు ఆయన వ్యక్తిగత ఇమేజ్‌కి నిదర్శనం.తాజాగా ఆయన చేసిన ప్రకటనలో ఒక పరిణతి కనిపిస్తుంది. పదవులను పట్టుకుని వేలాడకుండా, గెలిచినప్పుడే గౌరవంగా తప్పుకోవాలనే ఆయన నిర్ణయం అభినందనీయం. “రాజకీయాలకు అతీతంగా పని చేసి పేరు తెచ్చుకుంటా” అని ఆయన చెప్పడం, రాబోయే రోజుల్లో ఆయన పూర్తిస్థాయిలో సామాజిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారించనున్నారని స్పష్టం చేస్తోంది.రాజకీయాల నుంచి తప్పుకుంటానన్నంత మాత్రాన పాలనలో అలసత్వం ఉండదని ఆయన తేల్చిచెప్పారు. కైకలూరులో అక్రమాలు, అన్యాయాలు జరిగితే సహించేది లేదని, చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించడం ద్వారా తన అధికారిక బాధ్యతలను గుర్తుచేశారు. ఇక, సంక్రాంతి పండుగ వేళ జూదాలు వద్దు సంప్రదాయ క్రీడలే ముద్దు అని పిలుపునివ్వడం, యువత పెడదోవ పట్టకుండా ఆయన చూపిస్తున్న శ్రద్ధకు అద్దం పడుతోంది.మొత్తానికి, సౌమ్యుడిగా, ‘జెంటిల్ మ్యాన్ పొలిటీషియన్’గా పేరు తెచ్చుకున్న కామినేని శ్రీనివాస్.. తన తాజా నిర్ణయంతో మరోసారి విలువల రాజకీయాలకు ప్రాధాన్యతనిచ్చినట్లయింది.

# కవ్విస్తున్న చైనా

**న్యూఢిల్లీ, జనవరి 9( వెలుతురు):**
భారత్‌తో మంచిగా ఉన్నట్లు నటిస్తూనే వెనుక గోతులు తవ్వే చర్యలో చైనా ఎప్పుడూ ముందు వరుసలోనే ఉంటుంది. తాజాగా పాకిస్థాన్, చైనా సంబంధాలు బలోపేతమయ్యాయంటూ బలుచిస్థాన్ మానవ హక్కుల కార్యకర్త మీర్ యార్ బలూచ్.. భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌కు లేఖ రాయడం చర్చనీయాంశంగా మారింది. చైనా–పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ (సీపెక్) ప్రాజెక్టు చివరి దశకు చేరుకుందని.. ఈ క్రమంలో తన పెట్టుబడులను కాపాడుకోవడానికి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్న చైనా నేరుగా తన సైన్యాన్ని బలూచిస్థాన్ గడ్డపై దింపేందుకు సిద్ధమవుతోందని లేఖలో రాసుకొచ్చారు. బలూచిస్థాన్‌లో చైనా సైనిక ఉనికి కేవలం స్థానిక ప్రజల సమస్య మాత్రమే కాదని, దీనివల్ల భారత్‌కు కూడా ప్రమాదం పొంచి ఉందన్నారు. బలూచిస్థాన్ రక్షణ, తమ దళాల సామర్థ్యాలను బలోపేతం చేయకపోతే దీర్ఘకాలంలో చైనా దళాలు మోహరించే అవకాశముందని, ఇదే జరిగితే భారత్ సరిహద్దులో భద్రతా సవాళ్లు ఊహించని రీతిలో పెరుగుతాయని హెచ్చరించారు. బలూచిస్థాన్ రక్షణకు హానీ కలిగించే ఇలాంటి అపవిత్ర కూటమిని




అడ్డుకోవడానికి భారత్, బలూచిస్తాన్ మధ్య పరస్పర సహకారం అవసరమన్నారు.పాక్‌తో కలిసి చైనా పన్నుతున్న కుయుక్తులను అడ్డుకోవడంలో బలూచిస్థాన్ పూర్తి మద్దతు భారత్‌కే ఉంటుందని మీర్ యార్ బలూచ్ చెప్పడం ముదావహం. అయితే చైనా మనపై కవ్వింపు చర్యలకు పాల్పడడం ఇదేమీ తొలిసారి కాదు. రెండు రోజుల కిందట చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి.. గతేడాది మేలో జరిగిన భారత్–పాక్ యుద్ధాన్ని ఆపేందుకు చైనా మధ్యవర్తిత్వం వహించిం దంటూ పేర్కొనడం ఆసక్తి కలిగించింది. ‘ఆపరేషన్ సిందూర్’ సమయంలో పాక్ సైన్యం వాడిన ఆయుధ సామగ్రిలో చైనా సరఫరా చేసినవే ఎక్కువగా ఉన్నాయని, దాని విలువ 81 శాతమని కూడా తేలింది.ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అవకాశం వచ్చినప్పుడల్లా భారత్, పాక్ యుద్ధాన్ని తానే ఆపానంటూ పేర్కొన్న ప్రతీసారి భారత్ ఖండిస్తూనే వచ్చింది. ఇక బ్రహ్మపుత్ర నదిపై 15.27 లక్షల కోట్ల రూపాయల ఖర్చుతో ప్రపంచంలోనే అతి పెద్ద ఆనకట్టను నిర్మిస్తున్నట్టు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రకటన చేశారు. ఈ ఆనకట్ట వల్ల బ్రహ్మపుత్రలో భారత్ వాటాకు గండిపడడంతో పాటు మన దేశంలోని ఈశాన్య రాష్ట్రాలకు వరద ముప్పు పెరిగే అవకాశముంటుంది.ఈ విషయమై భారత్ గతంలోనే చైనాను హెచ్చరించింది. ఇక మనతో సరిహద్దుల్లో అకారణంగా వైరానికి దిగడం చైనాకు అలవాటే. గతంలో గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణే ఇందుకు ఉదాహరణ. అంతేకాదు చైనాకు సరిహద్దు ప్రాంతంగా ఉన్న అరుణాచల్ ప్రదేశ్ తమదేనంటూ పదే పదే ప్రచారం చేసుకునే చైనా అందులోని కొన్ని గ్రామాల పేర్లు అనైతికంగా మార్చే ప్రయత్నాలు చేసి అప్రతిష్టను మూటగట్టుకుంది. చైనా తలపెట్టిన ప్రాజెక్టులు, ఆనకట్టలు అన్నీ పొరుగుదేశాల హక్కులను కాలరాసేవే.చైనా ప్రాబల్య కాంక్షవల్ల భారత్ సహా పొరుగు దేశాలన్నీ ఇబ్బందులకు గురవుతున్నాయి. మహామార్గం వన్ రోడ్డు వన్ బెల్ట్ ప్రాజెక్టు పేరిట భూటాన్, నేపాల్, తదితర పొరుగు రాష్ట్రాల్లో భూభాగాలను కాజేసే యత్నాలను చైనా ఇదివరకే ప్రారంభించింది. ఒకవైపు పాకిస్థాన్, మరోవైపు బంగ్లాదేశ్ తమ ధోరణితో ఇబ్బంది కలిగిస్తున్న వేళ తాజాగా చైనా కూడా తోడవ్వడంతో భారత్ జాగ్రత్తగా ఉండాల్సిన అవసరముంది. చైనా ప్రపంచ సూపర్ పవర్‌గా మారుతోంది. కీలకమైన ఖనిజాలు, ఆయుధాలలో దాని పాత్రను చాలా ఉంది,అమెరికా ఎజెండాను పరిశీలిస్తే, అది ‘మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్’ అంటే ‘మాగా’. ఈ ఎజెండా కింద, అది దాదాపు అన్ని దేశాలపై సుంకాలను విధించింది”

# ఫర్వాలేదనిపించుకున్న రాజా సాహెబ్

బాహుబలి తర్వాత లార్జర్ దేన్ లైఫ్ తరహా సినిమాలతోనే ప్రయాణం చేస్తున్నారు ప్రభాస్. ఫ్యాన్స్ ఆయనను వింటేజ్ డార్లింగ్ లుక్ లో చూసి చాలా కాలమైయింది. ఆ లోటుని భర్తీ చేసే సినిమా 'రాజాసాబ్' అని స్వయంగా డైరెక్టర్ మారుతి చెప్పడం, కెరీర్ లో తొలిసారి ప్రభాస్ ఒక హారర్ ఫాంటసీ స్జబెక్ట్ ని ఎంచుకోవడం, ప్రచార చిత్రాలు ఆసక్తిని రేపడం, సంక్రాంతి రేసులో తొలి సినిమాగా రావడంతో మంచి హైప్, అంచనాలు ఏర్పడాయి. రాజు అలియాస్ రాజాసాబ్ (ప్రభాస్)కు అమ్మానాన్న అన్నీ నాయనమ్మ గంగాదేవి(జరీనా వహాబ్)నే. గంగాదేవికి ఆల్జీమర్స్. ప్రతి విషయాన్ని మర్చిపోతుంటుంది. కాకపోతే ఎప్పుడో తనని విడిచిపెట్టి వెళ్ళిపోయిన భర్త కనకరాజు (సంజయ్‌దత్)ని మాత్రం గుర్తుపెట్టుకుంటుంది. తాత కనకారాజు కోసం వెదుకుతున్న రాజుకు కొన్ని సంచలన నిజాలు తెలుస్తాయి. నర్సాపూర్ అడవిలోని ఓ రాజమహల్ వున్నాడనే సంగతి తెలుసుకుంటాడు. ఆ రాజమహల్ అడుగుపెట్టిన రాజుకి ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి ? కనకరాజు గురించి ఎలాంటి నిజాలు తెలుసుకున్నాడు? అసలు గంగాదేవి గతం ఏమిటి? కనకరాజు గంగాదేవిని ఎందుకు వదిలివెళ్ళిపోయాడు? తన లక్ష్యం ఏమిటి? నాయనమ్మ కోసం రాజు ఎలాంటి పోరాటం చేశాడనేది మిగతా కథ. నాయనమ్మకి జరిగిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకున్న మనవడి కథ ఇది. ఒక హారర్ ఫాంటసీ సరిపడే ముడిసరకు ఈ కథలో పుష్కలంగా వుంది. హిప్నాటిజంతో పాటు తాంత్రిక విద్యలు తెలిసిన విలన్ ని తన మనోబలంతో హీరో ఎలా జయించాడనే పాయింట్ బలమైనదే. కాకపోతే ఇందులో సంఘర్షణ, సన్నివేశాలు, కథనం అల్లిన తీరు ఇంకా ప్రభావవంతంగా ఉండాల్సింది. సత్య పాత్ర రాజ్ మహాల్ ప్రవేశం, అక్కడ జరిగిరే సన్నివేశాలు థ్రిల్లింగ్ ఫీలింగ్ కలిగిస్తూ సినిమా కథ మొదలౌతుంది. ఈ సీక్వెన్స్ రాజాసాబ్ పై అంచనాలు పెంచుతుంది. రాజు పాత్రలో ప్రభాస్ ఎంట్రీ ఆ తర్వాత వచ్చే పాట వింటేజ్ డార్లింగ్ ని గుర్తు చేస్తుంది. తర్వాత తాతని వెదికే క్రమంలో వచ్చే సన్నివేశాలు సాదాసీదాగా




సాగుతాయి. హీరోయిన్స్ ట్రాక్స్ సరిగ్గా వర్క్ అవుట్ కాలేదు. రాజు పాత్ర మహాల్ లోకి ఎంట్రీ ఇస్తేనే అసలు కథ మొదలౌతుంది. కాకపోతే ఆ ఘట్టానికి రావడానికి ఇంటర్వెల్ వరకూ ఎదురుచూసేలా చేశారు. దీంతో అప్పటివరకూ సాగదీసిన ఫీలింగ్ కలుగుతుంది.కనకరాజు పాత్రలో సంజయ్ దత్ చేసే హిప్నటిజం ఆడియన్స్ కి ఇంకా బలంగా రిజిస్టర్ చేయాల్సింది. బోమన్ ఇరానీ పాత్ర వచ్చే వరకూ చాలా విషయాలు కన్ఫ్యుజన్ లోనే వుంటాయి. అలాగే ఆ మహల్ ప్రవేశించిన పాత్రలు పెద్ద సవాళ్లు ఎదురుకావు. కామెడీ కూడా సరిగ్గా వర్క్ అవుట్ కాలేదు. దీంతో ఆడియన్స్ కి జరుగుతున్న సంఘటనలపై ఆసక్తి తగ్గుతుంది. కాకపోతే ప్రీక్లైమాక్స్ క్లైమాక్స్ సినిమాకి ఆయువు పట్టుగా నిలిచాయి. ఆ సన్నివేశాలు ఉత్కంఠభరితంగా తీర్చిదిద్దారు. ప్రభాస్ మళ్ళీ వింటేజ్ లుక్ లో చూడటం ఆయన ఫ్యాన్స్ ని ఖుషి చేస్తుంది. చాలా కాలం తర్వాత ఫన్ బాడీ లాంగ్వేజ్,్గ ÷ట్స్, డ్యాన్సులు.. ఇలా కలర్ ఫుల్ అవతార్ లో కనిపించారు. సంజయ్ దత్ పర్సనాలిటీ ఆ క్యారెక్టర్ కి ప్లస్ అయ్యింది. కాకపోతే ఆ పాత్రని ఇంకా బలంగా రాయాల్సింది. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ తెరపై అందంగా కనిపించారు. అయితే ఆ పాత్రలు కథలో మిళితం కాలేదు. జరీనా వాహెబ్ తన అనుభవం చూపించారు. వీటీవీ గణెశిష్, సప్తగిరి, ప్రభాస్ శ్రీను, సత్య.. అక్కడక్కడ నవ్వించారు.

## మొసలి బొమ్మలతో ప్రభాస్ అభిమానుల సందడి



ప్రభాస్ నటించిన 'ది రాజాసాబ్' నేడు ప్రేక్షకుల ముందుకొచ్చి సందడి చేస్తోంది. ఈ సినిమా ట్రైలర్ విడుదలైన నాటి నుంచి మొసలి మీమ్స్ సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం తెలిసిందే. నేడు ఈ చిత్రం విడుదల కావడంతో కొందరు అభిమానులు ఏకంగా మొసలి బొమ్మలను థియేటర్‌లలోకి తీసుకెళ్లి హంగామా చేస్తున్నారు. ÷-లకైమాక్స్‌లో ప్రభాస్ మొసలితో్గ ÷ట్ చేసే సన్నివేశం థియేటర్‌లో వచ్చే సమయంలో ఆ బొమ్మలతో స్క్రీన్ వద్దకు వెళ్లి దాన్ని రీక్రియేట్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ వీడియోలు సోషల్ మీడియాలో షేర్ అవుతున్నాయి. అయితే కొందరు మాత్రం ఇవి ఏఐతో చేసిన వీడియోలంటూ కామెంట్స్ పెడుతున్నప్పటికీ ఈ సినిమా విడుదల సందర్భంగా మొసలి మాత్రం హైలైట్ అవుతోంది. 'ఎవర్రా మీరంతా..', 'ఇది మొసళ్ల పండగ' అంటూ నెటిజన్లు ఫన్నీ కామెంట్స్ పెడుతున్నారు.

## శివకార్తికేయన్ పరాశక్తి నేడు విడుదల


శివకార్తికేయన్ హీరోగా, సుధా కొంగర దర్శకత్వంలో రూపుదిద్దుకున్న భారీ బడ్జెట్ చిత్రం 'పరాశక్తి' ఎట్టకేలకు సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు తాజాగా సర్టిఫికేట్‌ను జారీ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ సినిమా 1960ల నాటి హిందీ వ్యతిరేక ఉద్యమ నేపథ్యం ఉన్నందున, తొలుత సెన్సార్ బోర్డు 23 కట్స్ సూచించినప్పటికీ, రివైజింగ్ కమిటీ పరిశీలన తర్వాత కొన్ని మార్పులతో క్లియరెన్స్ లభించింది. సుమారు 162 నిమిషాల నిడివి ఉన్న ఈ పీరియాడిక్ పొలిటికల్ డ్రామాలో శివకార్తికేయన్ కాలేజీ విద్యార్థిగా కనిపించనున్నారు. ఈ సినిమా తమిళ వెర్షన్ సంక్రాంతి కానుకగా జనవరి 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. అయితే తెలుగులో సంక్రాంతి సినిమాల రద్దీ మరియు థియేటర్ల లభ్యత తక్కువగా ఉన్న కారణంగా, తెలుగు వెర్షన్ విడుదలను జనవరి 23కి వాయిదా వేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. శ్రీలీల హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో జయం రవి, అథర్వ మురళి కీలక పాత్రలు పోషించారు. సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్‌కు ఇది 100వ సినిమా కావడం విశేషం.




## యాక్షన్ మోడల్‌లో సమంత సూపర్బ్

చూస్తూ ఉండండి.. మా ఇంటి బంగారం మీ అందరితో కలిసిపోతుంది..' అంటూనే ఫుల్ యాక్షన్ మోడ్‌లో అదరగొడుతున్నారు సమంత. ఆమె ప్రధానపాత్రలో నందిని రెడ్డి తెరకెక్కిస్తోన్న చిత్రం 'మా ఇంటి బంగారం'. తాజాగా ఈ సినిమా టీజర్ ట్రైలర్‌ను విడుదల చేశారు. సమంత అమాయకంగా కనిపిస్తూనే యాక్షన్ సన్నివేశాల్లో తనదైన శైలిలో నటించారు. 1980ల నేపథ్యంలో సాగే క్రైమ్ థ్రిల్లర్ కథతో రూపొందుతున్నట్లు ఈ వీడియో ఆధారంగా తెలుస్తోంది. ఇందులో సమంతతో పాటు బాలీవుడ్ నటుడు గుల్షన్ దేవయ్య కీలకపాత్రలో నటిస్తున్నారు.




## ఆస్కార్ రేసులో ఇండియన్ ఫిలిమ్స్

### ముందున్న కాంతారా, మహావతార్ నరసింహ

సినీ ఇండస్ట్రీలో ప్రతిష్టాత్మకంగా భావించే 98వ ఆస్కార్ అవార్డుల సందడి మొదలైంది. అంతర్జాతీయ వేదికపై అప్పుడే మొదలైంది. తాజాగా అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ విడుదల చేసిన 'రిమైండర్ లిస్ట్'లో భారత్ నుండి ఏకంగా నాలుగు చిత్రాలు చోటు దక్కించుకుని సంచలనం సృష్టించాయి. మొత్తం 201 చిత్రాలతో కూడిన ఈ జాబితాలో నిలిచిన సినిమాలు 'ఉత్తమ చిత్రం' కేటగిరీలో పోటీ పడేందుకు అర్హత సాధించాయి. ఇందులో రిషబ్ శెట్టి దర్శకత్వంలో వచ్చిన కన్నడ బ్లాక్ బస్టర్ 'కాంతార: ఎ లెజెండ్ చాప్టర్ 1' గ్లోబల్ స్థాయిలో తన పట్టు నిలుపుకోగా, అనుపమ్ ఖేర్ దర్శకత్వం వహించిన హిందీ చిత్రం 'తన్వి ది గ్రేట్' ఆస్కార్ రేసులో నిలిచి అందరినీ షాక్‌కి గురిచేసింది. ఇక వీటితో పాటు భారతీయ పురాణ నేపథ్యంలో వచ్చిన బహుభాషా యానిమేషన్ చిత్రం 'మహావతార్ నరసింహ', నూతన దర్శకుడు అభిషన్ జీవింత్ తెరకెక్కించిన తమిళ చిత్రం 'టూరిస్ట్ ఫ్యామిలీ' కూడా ఈ అర్హత జాబితాలో చోటు దక్కించుకున్నాయి. రాధికా ఆప్టే నటించిన 'సిస్టర్ మిడ్‌నైట్' సైతం ఈ పోటీలో ఉండటం విశేషం. మరోవైపు భారత్ నుంచి అధికారికంగా పంపబడిన నీరజ్ ఘైవాన్ చిత్రం 'హోమ్‌బౌండ్' ఇప్పటికే 'ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్' కేటగిరీలో టాప్-15 షార్ట్‌లిస్ట్‌లో నిలిచి భారీ ఆశలు రేకెత్తిస్తోంది. ఆస్కార్ నిబంధనల ప్రకారం.. ఈ చిత్రాలన్నీ 2025లో అమెరికాలోని ప్రధాన మెట్రోపాలిటన్ ఏరియాల్లో కనీసం ఏడు రోజులు థియేటర్లలో ప్రదర్శితమై ఉండటంతో పాటు ఆస్కార్ అకాడమీ సూచించిన 'ఇన్‌క్లూజన్ స్టాండర్డ్స్' ప్రమాణాలను విజయవంతంగా పూర్తిచేశాయి. అయితే ఈ జాబితాలో ఉన్నంత మాత్రాన నామినేషన్ దక్కినట్లు కాదని, అకాడమీ సభ్యుల రహస్య ఓటింగ్ పక్రియ తర్వాతే అసలు విజేతలు ఎవరో తెలుస్తుందని గుర్తుంచుకోవాలని సినీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు ఈ ఉత్కంఠకు తెరదించుతూ 2026 జనవరి 22న తుది నామినేషన్ల జాబితాను అకాడమీ ప్రకటించనుంది. ఇక ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు ఎంతగానో ఎదురుచూసే 98వ ఆస్కార్ అవార్డుల ప్రధానోత్సవ వేడుక మార్చి 15న లాస్ ఏంజెల్స్‌లోని డాల్బీ థియేటర్లో వైభవంగా జరగనుంది.




## జన నాయగన్' సినిమాకు ఊరట

### సెన్సార్ సర్టిఫజకెట్ ఇవ్వాలని మద్రాస్ హైకోర్టు ఆదేశం

విజయ్ కథానాయకుడిగా నటించిన 'జన నాయగన్' సినిమాకు ఊరట లభించింది. ఈ సినిమాకు యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని సెన్సార్ బోర్డుకు మద్రాసు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం తీర్పు వెలువరించింది. గత డిసెంబరులో సెన్సార్ కోసం జన నాయగన్ సినిమాను పంపగా అభ్యంతరకర మైన సన్నివేశాలు తొలగించాలని, కొన్ని సంభాషణలు మ్యూట్ చేయాలని సూచించినట్లు సమాచారం. ఆ మేరకు మార్పులు చేసిన నిర్మాణ సంస్థ మళ్లీ సెన్సార్‌కు పంపగా బోర్డు నుంచి స్పందన రాలేదు. ఈ నేపథ్యంలో కేవీఎన్ ప్రొడక్షన్ తరఫున మద్రాసు హైకోర్టులో అత్యవసర పిటిషన్ దాఖలైంది. తొలుత యూ/ఏ సర్టిఫికేషన్‌కు సిఫార్సు చేసిన సెన్సార్ బోర్డు.. ఆ తర్వాత సినిమాను రివ్యూ కమిటీకి పంపిందని నిర్మాణ సంస్థ కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. దీనిపై వాదనలు విన్న హైకోర్టు బుధవారం తీర్పును రిజర్వ్ చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో జనవరి 9న విడుదల కావాల్సిన ఈ సినిమా వాయిదా పడింది. తాజాగా ఈ అంశంపై హైకోర్టు సింగిల్ జడ్జి శుక్రవారం తీర్పు వెలువరించారు. సినిమాకు సర్టిఫికెట్ ఇచ్చిన తర్వాత మళ్లీ రివ్యూ కమిటీకి పంపాల్సిన అవసరం ఏంటని న్యాయమూర్తి ప్రశ్నించారు. ముందుగా ఇస్తామన్న యూ/ఏ సర్టిఫికెట్ తక్షణమే ఇవ్వాలంటూ ఆదేశాలు జారీ చేశారు. కాగా.. సింగిల్ జడ్జి తీర్పుపై సెన్సార్ బోర్డు అప్పీల్ చేసింది. మద్రాసు హైకోర్టు చీఫ్ జస్టిస్ ధర్మాసనం ముందు అత్యవసర విచారణ కోసం రిట్ పిటిషన్ దాఖలు చేసింది. అయితే, తాజా తీర్పుతో 'జననాయగన్' విడుదలకు లైన్ క్లియర్ అయ్యింది. ఈ క్రమంలోనే సంక్రాంతి కానుకగా జనవరి 14న విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోన్నట్లు సమాచారం.

# రాయచోటి అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

**- మంత్రి నారా లోకేశ్‌తో మండిపల్లి భేటీ**

**- అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ**




**అమరావతి,జనవరి 9(వెలుతురు):** రాయచోటి నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని విద్య, ఐటీ, స్కిల్ డెవలప్‌మెంట్ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. రానున్న మూడేళ్లలో రాయచోటిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వ పరంగా సంపూర్ణ సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. శుక్రవారం మంత్రి నారా లోకేష్‌తో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. సందర్భంగా రాయచోటి నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై ఇద్దరు మంత్రులు విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా విద్య, ఐటీ, స్కిల్ డెవలప్‌మెంట్ రంగాల్లో రాయచోటికి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు మంత్రి లోకేష్ తెలిపారు. రాయచోటిలో విద్యా సంస్థలు, ఐటీ కాలేజీలు, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల స్థాపనకు అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాల అమలులో రాష్ట్ర ప్రభుత్వంతో పాటు సంబంధిత శాఖల నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు. రాయచోటిని భవిష్యత్తులో విద్య, ఉపాధి అవకాశాలకు కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

# టిక్కెట్ ధరల పెంపు మెమోలు ఎలా ఇస్తారు

**- ధరలు పెంచబోమని మంత్రే స్వయంగా చెప్పారుగా**

**- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ తెలంగాణ హైకోర్టు**



**హైదరాబాద్,జనవరి9( వెలుతురు):** కొత్త సినిమాల టికెట్ ధరలను పెంచుకునేందుకు అవకాశం కల్పిస్తూ మెమోలు జారీ చేయడంపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తెలివిగా మెమోలు ఎందుకు ఇస్తున్నారని ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించింది. టికెట్ ధరలు పెంచబోమని సంబంధిత మంత్రే స్వయంగా ప్రకటించారని, అయినా కూడా ధరల పెంపునకు మెమోలు ఎందుకు ఇస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేసింది. ఎన్నిసార్లు చెప్పినా ఎందుకు మీ ఆలోచన మారడం లేదంటూ మండిపడింది. మెమో ఇచ్చే అధికారికి నిబంధనలు తెలియవా? అంటూ తీవ్ర స్వరంతో ప్రశ్నించింది. సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'ది రాజాసాబ్' సినిమా టికెట్ ధరలు పెంచుకునేందుకు అధికారులు అనుమతించిన సంగతి తెలిసిందే. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం నుంచి ఈ నెల 11 వరకు సింగిల్ స్క్రీన్‌లలో రూ.105, మల్టీప్లెక్స్‌ల్లో రూ.132 పెంపునకు అనుమతి ఇచ్చింది. 12 నుంచి 18వ తేదీ వరకు సింగిల్ స్క్రీన్‌లలో రూ.62, మల్టీప్లెక్స్‌ల్లో రూ.89 పెంపునకు అనుమతి ఇచ్చింది. టికెట్ లాభాల్లో 20 శాతం ఫిలిం ఫెడరేషన్‌కు ఇవ్వాలని ఆదేశాలిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో 'రాజాసాబ్' టికెట్ ధరల పెంపును సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. నిబంధనలకు విరుద్ధంగా టికెట్ల ధరల పెంపునకు అనుమతిస్తున్నారని న్యాయవాది విజయ్ గోపాల్ పిటిషన్‌లో పేర్కొన్నారు. హోంశాఖ కార్యదర్శికి మెమో జారీ చేసే అధికారం లేదని ఆయన కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా స్థాయిలో కలెక్టర్లు, హైదరాబాద్‌లో సీపీ మాత్రమే టికెట్ల ధరల పెంపు, బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వాల్సి ఉంటుందని కోర్టుకు వివరించారు.

# నటుడు నవదీప్‌కు హైకోర్టులో ఊరట

**- డ్రగ్స్ కేసును కొట్టేసిన తెలంగాణా న్యాయస్థానం**

**హైదరాబాద్,జనవరి9( వెలుతురు):** టాలీవుడ్ యంగ్ హీరో నవదీప్‌నకు హైకోర్టులో భారీ ఉపశమనం కలిగింది. అతడిపై నమోదైన డ్రగ్స్ కేసును తెలంగాణా న్యాయస్థానం కొట్టివేసింది. నవదీప్ వద్ద డ్రగ్స్ ఉన్నట్టు ఎలాంటి ఆధారాలు లభించలేదనే ఆయన తరఫు న్యాయవాది వెంకట సిద్దార్థ్ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. ఈ కేసును కొట్టివేస్తున్నట్టు పేర్కొంది. దీంతో ఈ యంగ్ హీరోకు పూర్తిస్థాయిలో ఉపశమనం లభించినట్లైంది. కొద్ది నెలల క్రితం.. హైదరాబాద్‌లో వెలుగులోకి వచ్చిన డ్రగ్స్ కేసులో హీరో నవదీప్ పేరు వినిపించడంతో ఆయన డ్రగ్స్ తీసుకున్నట్టు గతంలో వార్తలు వచ్చాయి. అందులో భాగంగా.. గుడిమల్కాపూర్‌లో నమోదైన కేసులో ఎఫ్ఐఆర్‌లో అతడి పేరు నమోదైంది. ఈ ఆరోపణలపై నవదీప్ ఘాటుగా స్పందించారు. తనకు, డ్రగ్స్‌కు ఎలాంటి సంబంధం లేదని అతను వాపోయాడు. ఈ నేపథ్యంలోనే తనను అరెస్ట్ చేయొద్దంటూ అతను గతంలో తెలంగాణా హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఈ పిటిషన్ను విచారించిన న్యాయస్థానం.. అరెస్ట్ చేయకూడదని ఆదేశాలు జారీ చేసింది. తాజాగా ఈ కేసుపై మరోసారి విచారణ చేపట్టింది న్యాయస్థానం. నవదీప్ పేరును కేవలం ఎఫ్ఐఆర్‌లోనే చేర్చారని.. అతను డ్రగ్స్ తీసుకున్నట్టు ఆధారాలేవీ లేవని స్పష్టం కావడంతో ఈ కేసును కొట్టివేసింది.

# కెసిఆర్ కుటుంబానికి విదేశాల్లో భారీ పెట్టుబడులు

**- దాదాపు 30 వేల ఎకరాల భూములు దోచుకున్న ఘనులు**

**- పీసీసీ తెలంగాణ జనరల్ సెక్రెటరీ గజ్జెల కాంతం సంచలన ఆరోపణలు**




**హైదరాబాద్,జనవరి 9( వెలుతురు):** కేసీఆర్ కుటుంబం అమెరికాలో రూ.40 వేల కోట్లు, దుబాయ్‌లో రూ.25 వేల కోట్ల పెట్టుబడులు పెట్టిందని పీసీసీ తెలంగాణ జనరల్ సెక్రెటరీ గజ్జెల కాంతం సంచలన ఆరోపణలు చేశారు. దాదాపు 30 వేల ఎకరాల భూములు దోచుకున్నారని ఆరోపించారు. కేటీఆర్‌కు ఇన్ని ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఇవన్నీ అబద్దాలని తన కొడుకుపై ప్రమాణం చేయగలరా అని గజ్జెల కాంతం నిలదీశారు. ఈ మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై పీగజ్జెల కాంతం సంచలన ఆరోపణలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. దుబాయ్‌లో తన బినామీని చంపితే ఆధారాలు పోతాయని కేటీఆర్ భ్రమపడ్డారని గజ్జెల కాంతం ఆరోపించారు. నాలుగు రాష్ట్రాల్లో కేటీఆర్ మకాం వేసేవారని తెలిపారు. 2022 జనవరి 24న ఒక హీరోయిన్‌కు కేటీఆర్ రూ.100 కోట్లు ఇచ్చారని.. ఒక కాంట్రాక్టర్, జ్యువెలరీ షాప్ యజమాని అకౌంట్ నుంచి ఆ మొత్తాన్ని ట్రాన్స్‌ఫర్ చేయించారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ముంబైలోని తాజ్ కృష్ణా హోటల్ 328వ గదికి ఒక హీరోయిన్‌ను పిలిపించి, రూ.35 కోట్ల 75 లక్షలతో విల్లా కొనిచ్చారని, ఆడి కారు కూడా బహుమతిగా ఇచ్చారని ఆరోపించారు. 2022 మార్చి 3న ఢిల్లీలోని లలిత్ హోటల్ 770వ గదికి.. మైసూర్‌లో షూటింగ్ చేస్తున్న హీరోయిన్‌ను బెదిరించి పిలిపించు కున్నారని, రూ.50 కోట్లు ఇస్తానని బెదిరింపులకు పాల్పడ్డారని తీవ్ర ఆరోపణలు చేశారు. కేసీఆర్‌కు ఎన్టీఆర్, చంద్రబాబు రాజకీయ భిక్ష పెట్టారని.. దొంగ పాస్‌పోర్టులు సృష్టించిన చరిత్ర కేసీఆర్‌దేనని గజ్జెల కాంతం విరుచుకుపడ్డారు. ఎన్నికల కోసం జగన్‌కు రూ. 200 కోట్లు.. మహారాష్ట్ర, బీహార్, పంజాబ్, ఢిల్లీకి కోట్లాది రూపాయలను కేసీఆర్ పంపారన్నారు. అఖిలేష్ యాదవ్, కుమారస్వామికి కేటీఆర్ డబ్బులు పంపారని ఆరోపించారు. తెలంగాణ ఇచ్చిన సోనియా, రాహుల్‌పై కేటీఆర్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ కుటుంబం వల్లే కేటీఆర్ మంత్రి అయ్యారని, రాహుల్ కాలి గోటికి కూడా కేటీఆర్ సరిపోరని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ కుటుంబం దేశం కోసం త్యాగాలు చేసిందని, కేటీఆర్ కుటుంబం ఏం త్యాగం చేసిందని గజ్జెల కాంతం ప్రశ్నించారు. చట్టాలు, రాజ్యాంగంపై కేటీఆర్‌కు గౌరవం, జ్ఞానం లేదని, చరిత్ర తెలియదని విమర్శించారు. రాహుల్ గాంధీ కుటుంబానికి సొంత ఇల్లు కూడా లేదని.. కేటీఆర్ లాగా రాహుల్, రేవంత్‌లు దోచుకోలేదని గజ్జెల కాంతం పేర్కొన్నారు.

# ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టులకు ఎదురు దెబ్బలు

**- పోలీస్ అధికారులకు లొంగిపోమిన మరో 63మంది**




**రాయ్‌పూర్,జనవరి9( వెలుతురు):** ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టులకు వరుసగా ఎదురు దెబ్బలు తగులు తున్నాయి. తాజాగా ఛత్తీస్‌గఢ్ దంతెవాడ జిల్లాలో పోలీస్ ఉన్నతాధికారులు ఎదుట 63 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వారిలో 18 మంది మహిళా మావోయిస్టులు ఉన్నారు. పశ్చిమ బస్తర్ డివిజన్ కమిటీ కార్యదర్శి మోహన్ కడ్తీ.. తన భార్యతో కలిసి పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా తమ వద్ద ఉన్న ఆయుధాలను పోలీసులకు మావోయిస్టులు అప్పగించారు. లొంగిపోయిన మొత్తం మావోయిస్టులపై రూ. కోటి రివార్డు ఉందని పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన లోన్ వర్రాటు (ఇంటికి తిరిగి రండి) ప్రచారంలో భాగంగా వీరంతా లొంగిపోయి నట్లు పోలీసులు తెలిపారు. మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టులను శాశ్వతంగా నిర్మూలిస్తామని కేంద్ర ప్రకటించింది. అందుకోసం ఆపరేషన్ కగార్‌ను అమలు చేస్తోంది. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో దాదాపుగా మావోయిస్టుల ప్రభావం పూర్తిగా తగ్గిపోయింది. చివరకు ఛత్తీస్‌గఢ్‌లో వారి ప్రభావం కొంత మేర ఉంది. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలో పోలీసులు, భద్రతా బలగాలు సంయుక్తంగా మావోయిస్టుల ఎరివేతకు నిరంతరాయంగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు. దాంతో వరుస ఎన్‌కౌంటర్లు చోటు చేసుకుని.. వందలాది మంది మావోయిస్టులు మరణించారు. అలాగే వేలాది మంది మావోయిస్టులు ఇప్పటికే ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. ఇలా లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం గతంలో ప్రకటించిన రివార్డులను అందజేస్తోంది. అదీకాక.. మావోయిస్టులు లొంగిపోయి జన జీవన స్రవంతిలో కలవడం ద్వారా దేశాభివృద్ధిలో భాగం కావాలంటూ ప్రధాని మోదీతోపాటు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఇప్పటికే పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ప్రభుత్వం చేపట్టిన కూంబింగ్‌లో పలువురు అగ్రనేతలు ఎన్‌కౌంటర్‌కాగా.. కీలక నేతలు ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు.

# మిర్యాలగూడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

**- డిసిఎం, సిమెంట్ ట్యాంకర్ ఢీకొనడంతో ముగ్గురు మృతి**



**నల్లగొండ,జనవరి 9( వెలుతురు):** నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణం ఈదులగూడ చౌరస్తా వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి గుంటూరుకు టైల్స్ తరలిస్తున్న డీసీఎం, సిమెంట్ ట్యాంకర్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందగా.. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఘటనలోని మృతులంతా బీహార్ వాసులుగా గుర్తించారు. వీరిలో బీరు బాయ్ (30), సంతోష్ (30), సూరజ్ (18) ఉన్నారు. డీసీఎంలో ఉన్న టైల్స్ కూలీల మీద పడటంతో ముగ్గురు మృతిచెందారు. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. వారిని చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.టైల్స్‌ను హైదరాబాద్ నుంచి గుంటూరుకు తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. క్రేన్ సహాయంతో రహదారిపై నుంచి లారీని, డీసీఎంను తొలగించారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ స్థంభించిపోయింది. ట్రాఫిక్‌ను పోలీసులు క్లియర్ చేస్తున్నారు. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మిర్యాలగూడలోని ఈ రహదారిపై ప్రయాణించే సమయంలో అత్యంత జాగ్రత్తగా వెళ్లాలని పోలీసులు సూచించారు. పరిమితికి మించి లోడ్‌తో వెళ్లే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.




Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com